కాంగ్రెస్ సర్కార్‌పై నిరసనల వెల్లువ

పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల ధర్నా.. రుణమాఫీ కోసం రైతుల ఆందోళన.. తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు.. బిల్లులు చెల్లించాలని పాడిరైతుల నిరసన

కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకూ నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. సోమవారం పలు జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వివిధ వర్గాలవారు ఆందోళన బాటపట్టారు. సిద్దిపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పాడి రైతులు బిల్లులు చెల్లించాలని ధర్నా చేశారు. మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో పింఛన్లు, జీవనభృతి చెల్లించాలని బీడీ కార్మికులు రోడ్డెక్కారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భూ సమస్యను పరిష్కరించాలని తల్లీకొడుకు, కామారెడ్డి జిల్లాలో డబ్బులు తీసుకుని భూమి పట్టా చేస్తలేరని రైతు ప్రజావాణిలో ఆత్మహత్యాయత్నం చేశారు. భువనగిరి జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు తహసీల్ ఆఫీస్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ములుగు, సిద్దిపేట జిల్లాల్లో దళితబంధు పథకం అమలు చేయాలని లబ్ధిదారులు ఆందోళన చేశారు. ఖమ్మం జిల్లా మణుగూరులో బ్రీత్ అనలైజర్ లు సరిగా పనిచేస్తలేవని, మద్యం తాగని తమకు రీ టెస్ట్ చేయాలని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళనలు చేశారు. మన ఊరు- మనబడి పనుల బిల్లులు చెల్లించాలంటూ జగిత్యాల జిల్లా రేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి గొర్రెలనుతోలి నిరసన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు దీక్ష చేపట్టారు. వరంగల్ జిల్లాలో రుణమాఫీ కోసం రైతులు ఆందోళన చేపట్టా రు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు.

• బిల్లులు రాలేదని పాఠశాలలోకి గొర్రెలను పంపి ..



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు-మనబడి'లో భాగంగా అభివృద్ధి పనులకు గతేడాది అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. అప్పటి విద్యాకమిటీ చైర్మన్ దండిక శంకర్ సొంత డబ్బులతో పనుల పూర్తి చేశాడు. దీనికి సంబంధించి బిల్లులు రాకపోవడంతో వృత్తి రీత్యా గొర్రెల కాపరిగా జీవనం కొనసాగిస్తున్న శంకర్ తాను పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్‌లో గొర్రెలను తోలి నిరసన తెలిపారు. -మల్లాపూర్

• దళితబంధు నిధుల కోసం..



దళితబంధు నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ములుగు కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, కోఆర్డినేటర్ రమేశ్, సలహాదారు సంజీవ, నాయకులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పినట్టు వారంలోగా రెండో విడత దళితబంధు నిధులను విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ మనుచౌదరికి దరఖాస్తులు అందజేశారు. **-సిద్దిపేట కలెక్టరేట్/ములుగురూరల్**

• బిల్లులు చెల్లించాలని పాడి రైతుల నిరసన



రెండున్నర నెలలుగా విజయ డెయిరీలో తమకు బిల్లులు చెల్లిండం లేదని నిరసిస్తూ పాడి రైతులు సిద్దిపేటలో విజయ డెయిరీ సెంటర్ నుంచి ముస్తాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో 20 లీటర్ల గేదె, ఆవు పాలు పారబోసి నిరసన తెలిపారు. పాడిని నమ్ముకొని పలువురు రైతులు జీవిస్తున్నారని, బిల్లులు రాకపోవడంతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారని వాపోయారు. -సిద్దిపేట/ఉప్పునుంతల

• డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలి



డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో కలిసి అఖిలపక్షం నాయకులు భువనగిరి తహసీల్దార్ కార్యాలయం గేటుకు తాళం వేసి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు కిరణ్‌కుమార్, భగత్, బబ్లు, సుభాష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. -భువనగిరి కలెక్టరేట్

• భూ సమస్య పరిష్కరించాలని ఆత్మహత్యాయత్నం



భూ సమస్యను పరిష్కరించాలని మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో హన్వాడ మండలం చిన్నదర్పల్లి పరిధి హనుమాన్ టెంపుల్ తండాకు చెందిన తల్లీకొడుకు అమని బాయి, కెడావత్ రాములు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోబోయారు. పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. కామారెడ్డి జిల్లా పెద్దగొడప్‌గల్ మండలం వడ్ల గ్రామానికి చెందిన రైతు గైని అంజయ్య తన పేరు మీద భూమి పట్టా చేయడం లేదంటూ ప్రజావాణిలో ఆత్మహత్యాయత్నం చేశాడు. -మహబూబ్‌నగర్ కలెక్టరేట్/పెద్దకొడప్‌గల్

• సమస్యలు పరిష్కరించాలని ఒక రోజు సమ్మె..



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఒకరోజు దీక్ష చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ అధికారులకు అందజేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామపంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ వీడీసీ సభ్యులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. -అశ్వారావుపేట టౌన్/కంఠేశ్వర్

• మాకూ రుణమాఫీ చేయండి..



వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి పీఏసీఎస్ ఎదుట రుణమాఫీ కోసం రైతులు నిరసన వ్యక్తం చేశారు. సంఘంలో చింతలపల్లి, కృష్ణానగర్, పల్లార్‌గూడ, మొండ్రాయి, కుంటపల్లి గ్రామాల రైతులు 644 మంది సభ్యులుగా ఉన్నారు. వీరు ఎస్‌బీఐద్వారా 2017లో రుణం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ వర్తిస్తుందని ఆశగా ఎదురుచూసిన తమకు కన్నీరే మిగిలిందని అన్నదాతలు వాపోయారు. -సంగెం

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన

మద్యం అలవాటు లేనివాళ్లు కూడా మద్యం తాగినట్లు చూపుతున్న బ్రీత్ అనలైజర్‌ను మార్చకుండా డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం సరికాదంటూ ఆర్టీసీ మణుగూరు డిపో అద్దె బస్సు డ్రైవర్లు, సిబ్బంది బస్సులు నిలిపివేసి నిరసన చేపట్టారు. ఇఫ్టూ నాయకుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. మద్యం అలవాటులేని ఓ కార్మికుడిని సస్పెండ్ చేసిన అంశంపై పునరాలోచన చేయాలని కోరారు. ఆర్టీసీ డీఎం శ్యాంసుందర్ స్పందిస్తూ.. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

-మణుగూరు టౌన్



• అర్హులైన బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి



బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి బాలమణి, బీడీ కార్మికులు పాల్గొన్నారు. పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా సిరికొండ తహసీల్ ఆఫీస్ ఎదుట బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. -మెదక్/సిరికొండ

• మంచినీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన



సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని 4వ వార్డులో కొన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు తహసీల్దార్ కార్యాలయానికి ఖాళీ బిందెలతో వచ్చి నిరసన తెలిపారు. పైప్‌లైన్ల మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కాటమయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రామస్వామి, మహిళలు పాల్గొన్నారు. -తుంగతుర్తి

రాడార్ స్టేషన్ ఏర్పాటును విరమించాలి

- **లేకుంటే 12 లక్షల వృక్షాలకు నష్టం**
- **దామగుండం అడవిని పరిరక్షించాలి**
- **'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' డిమాండ్**

ఖైరతాబాద్, ఆగస్టు 12: దామగుండం అడవిని పరిరక్షించాలని, రాడార్ ప్రాజెక్టు కోసం రిజర్వ్ ఫారెస్టు భూమిని కేటాయించడాన్ని విరమించుకోవాలని 'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' స్వచ్ఛంద సంస్థ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆ సంస్థ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారత్ కిసాన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డీకే చంద్రశేఖర్ యాదవ్, 'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' ప్రధాన కార్యదర్శి మేకల కార్తీక్ యాదవ్ మాట్లాడుతూ.. వీఎల్‌ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటు కోసం వికారాబాద్ జిల్లా పూడురు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం 2,900 ఎకరాల్లో 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని చెప్పారు. దీనివల్ల 20 గ్రామాల్లోని 60 వేల మంది ప్రజల ఆరోగ్యం, జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని, పశువులకు మేత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



రాడార్ స్టేషన్ ఏర్పాటును విరమించుకోవాలంటూ నినాదాలు చేస్తున్న 'ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్' ప్రతినిధులు



పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ ఖమ్మం జిల్లా వేంసూరు తహసీల్దార్ ఎంఏ రాజు కాళ్లు మొక్కుతున్న ఒంటరి మహిళ లోకా నాగమణి

సారూ.. నా భూమికి పాస్‌బుక్ ఇప్పించండి

వేంసూరు, ఆగస్టు 12: 'సారూ.. నా సాగు భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించండి' అంటూ తహసీల్దార్ కాళ్లు మొక్కి వేడుకుంది ఓ ఒంటరి మహిళ. ఈ ఘటన సోమవారం ఖమ్మం జిల్లా వేంసూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన 'ప్రజావాణి'లో చోటుచేసుకుంది. అమ్మపాలెం గ్రామానికి చెందిన ఒంటరి మహిళ లోకా నాగమణి, తనకు తన తండ్రి గోపయ్య ఎకరం భూమిని పెద్దల సమక్షంలో సాదా కాగితంపై రాసి ఇచ్చినట్టు తెలిపింది. తన అన్న, ఆయన భార్య కలిసి భూమిని వారి పేరున చేసుకున్నారని వివరించింది. తన పేరిట పాస్‌బుక్ ఇప్పించాలని తహసీల్దార్‌ను వేడుకుంటూ కంటతడి పెట్టింది. అదే తహసీల్దార్ కార్యాలయంలో మరో మహిళ కూడా కంటతడి పెట్టుకుంది. కుంచపర్తికి చెందిన మొగిలపాడు సుశీల అదే గ్రామానికి చెందిన జమ్ముల శ్రీనివాసరావు వద్ద 19 కుంటల సాగు భూమి కొనుగోలు చేశానని, దానికి అగ్రిమెంట్లు కూడా ఉన్నాయని, కానీ తన పేరుతో పాస్‌బుక్ మంజూరు కాలేదని తెలిపింది. గత రెవెన్యూ అధికారులు తన భూమిని ధరణిలో మరొకరి పేరుతో ఎక్కించి తనకు అన్యాయం చేశారని వాపోయింది. తనకు న్యాయం చేయాలంటూ మొరపెట్టుకుంది.

కట్టింది మేము.. కటింగ్ మీదా?

మొదటిపేజీ తరువాయి...

పుష్కలంగా నీళ్లందుతాయని, సాగు, తాగు నీటి సమస్య ఉండదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, బీఆర్‌ఎస్ నేత దిండిగల రాజేందర్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభ సన్నాహక సమావేశాల్లో కాంగ్రెస్ మంత్రులు పోటీ పడి మరీ నెత్తి మీద నీళ్లు చల్లుకుంటున్నారని, మంత్రుల కంటే తానేం తక్కువ అన్నట్టుగా ఈ నెల 15న సీఎం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని దెప్పిపొడిచారు. సీతారామ ప్రాజెక్టు కేసీఆర్‌కు ఎంతో ఇష్టమైనదని, పదేండ్ల కృషి అని గుర్తుచేశారు. ఆ ఫలితాలు, విజయాలను తమవిగా చెప్పుకునేందుకు కాంగ్రెస్ పడుతున్న అపసోపాలు, సర్కారు పడుతున్న ఫీట్లను చూస్తుంటే నవ్వు వస్తున్నదని ఎద్దేవాచేశారు. ఖమ్మం జిల్లా కరువు బాధలను తీర్చేందుకు సీతారామ ప్రాజెక్టుకు సంకల్పం చేసింది కేసీఆర్ అని, పవిత్రమైన ప్రాజెక్టుకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని అది శరవేగంగా పూర్తికావాలని సీతారామ అని పేరుపెట్టారని గుర్తుచేశారు. ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కోర్టుల్లో కేసులు వేసినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నికష్టాలు అధిగమించి పట్టుదలతో పూర్తి చేసిందని చెప్పారు. 'ఈ రోజు మీకు రిబ్బన్ కటింగ్ చేసే అవకాశం వచ్చింది కదా అని ప్రాజెక్టు కట్టినట్టి కటింగ్ ఇస్తే ప్రజలు నవ్వుకుంటరు.. ఇతరుల ఘనతను తమ ఘనతగా చెప్పుకొనేటోళ్లను పరాన్నజీవులు అంటరు' అంటూ హరీశ్ ఎద్దేవాచేశారు.

30 వేల ఉద్యోగాల లెక్కనే సీతారామ కథ

'ప్రారంభించిన మూడు పంపుహౌస్ పనుల్లో పది పైసల పనైనా మీరు చేశారా? ప్రాజక్టు కట్టాలంటే డిజైన్, భూ సేకరణ, అనుమతులకు ఏండ్లు పడుతుంది. మీరు ఏడు నెలల్లోనే పూర్తిచేశారా?' అంటూ హరీశ్ నిలదీశారు. ప్రాజెక్టు వద్దకు రోజుకో మంత్రి వెళ్తున్నారని, ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీ పడుతున్నారని, జనం వారిని చూసి నవ్వుకుంటున్నారని, సీతారామ ప్రాజెక్టు కథ కూడా 30 వేల ఉద్యోగాల తీరులానే ఉన్నదని ఎద్దేవాచే

> **ఇందిరమ్మ సాగర్ ప్రాజెక్టుకు 2005 నుంచి 2014 వరకు కాంగ్రెస్ కనీసం అనుమతులైనా తెచ్చిందా? నీటి కేటాయింపులు చేసిందా? భట్టి విక్రమార్క అప్పుడు కూడా క్యాబినెట్ హోదాలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నడు కదా? ఇప్పుడు వచ్చి 75 కోట్లతో సీతారామ ప్రాజెక్టు ద్వారా 1.50 లక్షల ఎకరాలకు నీళ్లిస్తున్నామంటున్న ఆయనకు నోబెల్ బహుమతి ఇవ్వచ్చు.. -హరీశ్‌రావు**



తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

శారు. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసింది. నిజాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు. నాడు కేసీఆర్ నిజాలు చెప్పారు. నిండు శాసనసభలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్ పథకాలను కొనసాగిస్తామని చెప్పిండ్రు. ఆ ధైర్యం, సంస్కారం మాకు ఉన్నది. కాంగ్రెస్ నాయకులు మాత్రం పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు, ఫొటో ఉన్నదని పేజీలను చింపించిండ్రు. మేము కట్టిన ఫ్లైఓవర్లు, ప్రాజెక్టులను ప్రారంభిస్తూ, మేము తెచ్చిన బస్సులకు జెండాలూపుతూ, మేం అమలు చేసిన పథకాలకు చెక్కులు పంచుతూ కాలం గడపుతున్నరు. ఈ ఎనిమిది నెలల్లో ఒక్కటైనా నిర్మాణాత్మక అడుగు పడిందా' అంటూ నిలదీశారు. 'కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని అంటున్నారు.. మీ తండ్లాట, మీ తాపత్రయమే నీ నైతిక పతకానికి సంకేతం. కేసీఆర్ చేసిన పనులను తమవిగా చెప్పుకునేందుకు కాంగ్రెస్సోళ్లు పడుతున్న తపనే మా నైతిక విజయానికి నిదర్శనం' అని హరీశ్ స్పష్టంచేశారు.

మంత్రి తుమ్మల గుండెలపై చెయ్యేసుకొని చెప్పాలె

సీతారామ క్రెడిట్ కేసీఆర్‌దే అన్న మంత్రి తుమ్మల ఇప్పుడు అదేమాటను గుండెలపై చెయ్యేసుకొని చెప్పాలని హరీశ్ సూచించారు. సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ కల అని, కృష్ణా నీళ్లు రాకపోవడంతో గోదావరి నీళ్లను ఒడిసిపట్టి ఖమ్మం జిల్లాను మొత్తం రెండు పంటలతో సస్యశ్యామలం చేయాలనుకున్నారని గుర్తుచేశారు. 'రాజీవ్, ఇందిరాసాగర్లలో మీరు మూడు వేల క్యూసెక్కుల సామర్థ్యం పెడితే కేసీఆర్ 9 వేల క్యూసెక్కులకు పెంచిండ్రు. ఈ ప్రాజెక్టుల్లో మీరు కొన్ని మండలాలు, కొన్ని నియోజకవర్గాలను వదిలేసిండ్రు. కృష్ణా జలాలు ఆలస్యమై ఖరీఫ్ పంట వేసే అవకాశం ఉండకపోయేది. గోదావరి పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాకే గోదావరి జలాలు ఏనాడూ అందలేదు. ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరం

> **మూడు పంపుహౌసుల్లో పది పైసల పనైనా చేశారా? డిజైన్, భూ సేకరణ, అనుమతులను మీరు ఏడు నెలల్లోనే పూర్తిచేసి ప్రాజెక్టును కట్టిండ్రా? మేం అమలు చేసిన పథకాలకు చెక్కులు పంచుతూ కాలం గడపుతున్న మీరు, ఈ ఎనిమిది నెలల్లో ఒక్క నిర్మాణాత్మక అడుగైనా వేశారా? -హరీశ్‌రావు**

దించేలా ప్రాజెక్టును కేసీఆర్ రూపొందించిండ్రు.' అని గుర్తుచేశారు. సీతారామ ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్లో ఎనిమిది ప్యాకేజీల్లో ఐదు తాము పూర్తి చేశామని, మిగతా మూడింటిలో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మోటర్లు, పంప్‌హౌస్‌ల నిర్మాణం బీఆర్‌ఎస్ హయాంలో పూర్తయిందని వివరించారు. మొత్తంగా 90 శాతం ప్రాజెక్టును తాము పూర్తి చేస్తే కాంగ్రెస్ వాళ్లు పూర్తిచేసినట్టు చెప్పుకొంటున్నారని ఎద్దేవాచేశారు. ప్రాజెక్టు పేరే సీతారామ అని, రాముడు సత్యవాక్పరిపాలకుడని, సత్యానికి, ధర్మానికి ప్రతిరూపమని, ఆయన పేరుతో కట్టిన ప్రాజెక్టుపై అబద్ధాలు చెప్తే భగవంతుడు కూడా క్షమించడని మండిపడ్డారు.

అనుమతులు ఆనాడే తెచ్చినం

హైడ్రాలజీకి 2023 ఏప్రిల్ 3న, ఇతర

హాస్టల్‌లో ఒక్క మంత్రయినా అన్నం తిన్నడా?

గురుకులాల హాస్టళ్లలో భోజనం కలుషితం అవుతున్నదని, వంటల్లో ఎలుకలు, బల్లులు పడుతున్నాయని, చివరికి కారం మెతుకులతో అన్నం తినే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. 'ప్రభుత్వ హాస్టల్‌కు పోయి ఒక్క మంత్రయినా అన్నం తిన్నడా?.. విద్యార్థులను పరామర్శించారా?' అంటూ ప్రశ్నించారు. వైన్స్ షాపులకు టార్గెట్లు పెట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేదని, ఇప్పటికైనా పబ్లిసిటీ స్టంట్స్ మాని గవర్నెన్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్మూర్‌లో ఏడుగురిని కుక్కలు కరిచాయని చెప్పారు. జ్వరం సర్వే తుతూ మంత్రంగా సాగిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో చేసిన పనులను ప్రారంభించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

రాష్ట్రాల అనుమతులు 2023 జూలై 6న వచ్చాయని, 67.05 టీఎంసీల నీటి కేటాయింపులకు సీడబ్ల్యూసీ అనుమతులు వచ్చాయని హరీశ్‌రావు తెలిపారు. ఇందిరమ్మ సాగర్‌కు కాంగ్రెస్ 2005 నుంచి 2014 వరకు కనీసం అనుమతులు కూడా తీసుకురాలేదని, నీటి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. భట్టి విక్రమార్క అప్పుడు కూడా క్యాబినెట్ హోదాలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారని గుర్తుచేశారు. ప్రాజెక్టును తాము రైతుల అవసరాల కోసం రీడిజైన్ చేశామని చెప్పారు. గతంలోని ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ కంటే వరప్రదాయిని అని, ఆయకట్టును మూడు లక్షల ఎకరాల నుంచి 6.74 లక్షల ఎకరాలకు పెంచామని, పది పంపింగ్ స్టేషన్‌లు ఉండేవని, ఎక్కువ పంపింగ్ స్టేషన్‌లు ఉంటే ఎక్కువ సమస్యలు వస్తాయని నాలుగుకు తగ్గించామని, 27 నుంచి 67 టీఎంసీలకు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచామని చెప్పారు. బ్యారేజీలో 1.2 టీఎంసీల సామర్థ్యం ఉంటే దానిని 36 టీఎంసీలకు పెంచుకున్నామని, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ తదితర ప్రాంతాలకు ఆయకట్టు విస్తరించామని, డోర్నకల్, మహబూబాబాద్‌కు కూడా విస్తరించామని వివరించారు. మూడు వేల చెరువులకు నీళ్లిచ్చే ప్రయత్నం చేశామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అన్ని అనుమతులను కేసీఆర్ తీసుకొచ్చారని, కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని కలిశారని గుర్తుచేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ అనుమతులు కూడా తెచ్చామని చెప్పారు. గోదావరి నీళ్లు పాలేరు దాకా వస్తాయని, అక్కడ రివర్స్ పంపింగ్ చేస్తే నల్లగొండ జిల్లాకు కూడా నీళ్లు వస్తాయని, చిన్న లిఫ్ట్ పెట్టుకుంటే పాలేరు బ్యాక్ వాటర్ ద్వారా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టుకు కూడా సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలను అందించేలా జాగ్రత్తలు తీసుకున్నామని, ఎంతో ముందుచూపుతో కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును ప్రతిపాదించారని గుర్తుచేశారు. పాలేరు, వైరా, లంకసాగర్ రిజర్వాయర్లకు ఢోకా ఉండదని, 3.40 లక్షల ఎకరాల సాగర్ అయకట్టును స్థిరీకరరించే ప్రయత్నం చేశామని తెలిపారు.

కార్యదర్శులు అప్పులపాలు

'మీ పరిపాలన ఆగమాగమైంది.. రాష్ట్రంలో పాలన పడకేసింది.. అంతా గందరగోళంగా మారింది' అంటూ హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఎనిమిది నెలల బాబు కూడా డెంగ్యూతో చనిపోయాడని, మూడు వేల డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. పసికందులను కుక్కలు పీక్కుతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అసిఫాబాద్ జిల్లా గండిపేటలో కాశీనాథ్, పూజఅనే అమ్మాయి కూడా విషజ్వరంతో చనిపోయారని, వేలాది మంది విషజ్వరాలతో బాధపడుతున్నారని ఆందోళన చెందారు. సర్పంచ్‌లే కాదు పంచాయతీ సెక్రటరీలను కూడా అప్పుల పాలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అంటూ ఎద్దేవాచేశారు. దేశ చరిత్రలో కార్యదర్శులు అప్పుల పాలైన ఘనత లేదని, తన నియోజక వర్గానికి దమ్ముంటే కాంగ్రెస్ మంత్రులు వస్తే పంచాయతీల్లో నెలకొన్న దుస్థితిని చూపిస్తానని హరీశ్ సవాల్ విసిరారు.

వాటికి, సీతమ్మసాగర్‌కు తేడాఇదే

నాడు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌లో జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం లేదని, కానీ ఇప్పుడు అవకాశం కల్పించామని, 280 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి ఏర్పాట్లు చేశామని హరీశ్ చెప్పారు. 18 కిలోమీటర్ల కిన్నెరసాని అభయరణ్యంలో ప్రతిపాదనకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వాల్సి ఉంటే దీనిని మార్చామని తెలిపారు. 77 కిలోమీటర్ల పైప్‌లైన్లతో నిర్వహణ సమస్యలు వస్తాయని, వీటిని 8.50 కిలోమీటర్లకు తగ్గించామని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉంటే కాంగ్రెస్ వాళ్లు మాత్రం తామే ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టినట్టు, రాత్రింబవళ్లు పనిచేయించినట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు రావడం తమకు ఎంతో సంతోషాన్నిస్తున్నదని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభాన్ని ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ తరఫున పండుగలా నిర్వహించుకుందాని చెప్పారు. తమకు భేషజాలు లేవని, 75 కోట్లతో సీతారామ ప్రాజెక్టు ద్వారా 1.50 లక్షల ఎకరాలకు నీళ్లిస్తున్నామని చెప్తున్న డిప్యూటీ సీఎం భట్టికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవాచేశారు.



లఘుచిత్ర రూపకల్పనలో గొత్తికోయ పిల్లలతో రఘుపతి

ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈఎంఆర్‌సీ సత్తా

- 'రీచింగ్ ది అన్‌రీచ్‌డ్' అనే లఘు చిత్రానికి మొదటి బహుమతి
- అటవీ ప్రాంతాల్లోని విద్యార్థుల స్థితిగతులపై డాక్యుమెంటరీ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-కన్సార్షియం ఆఫ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్(యూజీసీ-సీఈసీ) ఆధ్వర్యంలో 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసర్చ్ సెంటర్(ఈఎంఆర్‌సీ) సత్తాచాటింది. ములుగు, భూపాలపల్లి జిల్లా అటవీ ప్రాంతాల్లోని గొత్తికోయ విద్యార్థుల స్థితిగతులపై ఈఎంఆర్‌సీ డైరెక్టర్ పీ రఘుపతి రూపొందించిన లఘు చిత్రం 'రీచింగ్ ది అన్‌రీచ్‌డ్' అభివృద్ధి విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మానవ హక్కుల విభాగంలోనూ సైటేషన్‌కు ఎంపికైంది. త్వరలో జరిగే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రఘుపతి ఈ అవార్డు అందుకోనున్నారు. ప్రతీ రోజూ ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో ప్రయాణించి, చిన్నారులకు విద్యతో పాటు బయటి సమాజాన్ని పరిచయం చేసేందుకు వలంటీర్లు చేస్తున్న కృషిని ఈఎంఆర్‌సీ డాక్యుమెంటరీగా మలిచింది. లఘుచిత్ర రూపకర్త రఘుపతిని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి వీసీ దానకిశోర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, యూజీసీ డీన్ ప్రొఫెసర్ జీ మల్లేశం తదితరులు అభినందించారు.

మాకెందుకు 'సీతారామ' నీళ్లియ్యరు!

- చెరువులు నింపకుంటే ఉద్యమాన్ని వీడం
- జూలూరుపాడు మండల రైతుల ప్రతిన
- ప్రాజెక్టు రీడిజైన్ చేసిన కాంగ్రెస్ సర్కార్
- నీటిని మళ్లించడంతో తీవ్ర నష్టం
- భూములిచ్చిన రైతుల పోరు తీవ్రరూపం



సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

జూలూరుపాడు, ఆగస్టు 12: ప్రాజెక్టు కోసం మా భూములు కోల్పోయాం.. మా కండ్ల ముందు నుంచి నీళ్లు వెళ్తున్నాయి.. మా చెరువులు నింపకుండా ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు.. కాంగ్రెస్ సర్కారు రీడిజైన్‌తో మాకు తీరని అన్యాయం చేసింది.. మాకు నీళ్లియ్యకుండా తరలిస్తే చూస్తూ ఊరుకోం.. అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల రైతాంగం ప్రతినబూనింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రీడిజైన్ చేసింది. జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ సమీపం నుంచి ఏన్కూరులో ఉన్న సాగర్ కాల్వ వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర లింక్ కెనాల్‌కు నిధులు కేటాయించి ఆగమేఘాల మీద పనులను పూర్తిచేశారు. ఈ నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. తమ మండలంలోని చెరువులన్నింటినీ నింపకుండా నీటిని మళ్లించి తరలించుకు వెళ్తున్నారని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏన్నో ఏళ్లుగా సాగునీటి కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్న తమ ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అఖిల పక్షం ఆధ్వర్యంలో గత కొన్నిరోజులుగా రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. గత కొంతకాలంగా వినతిపత్రాల అందజేత, జలదీక్ష, ధర్నాలతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత రైతుల భూములను ఎండబెడుతూ సొంత ప్రయోజనాల కోసం నీటిని తరలించుకుపోతున్న కాంగ్రెస్ మంత్రుల నిర్ణయాలను ఎండగడతామని రైతులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

జూలూరుపాడు రైతుల గోడు ఇది!

జూలూరుపాడు మండల పరిధిలోని నల్లబండబోడు గ్రామ సమీపం నుంచి రామచంద్రాపురం, గుండెపుడి, ఒంటిగుడిసె, జూలూరుపాడు, వినోభానగర్, పాపకొల్లు, పుల్లుడు తండా మీదుగా పాపకొల్లు అటవీ ప్రాంతమైన పోలవరం ప్రాజెక్టు సరిహద్దు వరకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ నుంచి ఎత్తయిన గుట్టకు సొరంగమార్గం వేసి నీటిని కారేపల్లి మండలం ద్వారా వైరా, పాలేరు పరిధిలోని చెరువులకు తరలించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పట్లో డిజైన్ రూపొందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రీడిజైన్ చేసి వినోభానగర్ నుంచే నీటిని మళ్లించడంతో జూలూరుపాడు మండలంలోని అన్ని చెరువులను నింపేందుకు వీలులేకుండా పోయింది. దీంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన చేస్తున్నారు.

సాగునీరొస్తుందని భూములిచ్చాం



జూలూరుపాడు మండలంలోని అన్ని చెరువులకు నీటిని అందిస్తామని గ్రామసభల్లో అధికారులు హామీ ఇచ్చారు. మా ప్రాంతానికి నీరివ్వకుండా నీటిని తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోం. మాకు సాగునీటిని ఇవ్వకుంటే మా భూములు మాకివ్వాలి.

- పొన్నెకంటి వెంకటయ్య, గుండెపుడి గ్రామం, జూలూరుపాడు మండలం

పాత డిజైన్ ప్రకారమే నీరివ్వాలి



బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూపొందించిన డిజైన్ ప్రకారమే సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలి. భూములను కోల్పోయిన మాకే మొదట నీరిచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవాలి. ఈ ప్రాంతానికి సాగునీరందించేదాకా రైతులందరం ఆందోళన చేస్తూనే ఉంటాం.

- యల్లంకి కార్తికేయ, గుండెపుడి గ్రామం, జూలూరుపాడు మండలం

డీటీవో గౌస్‌పాషా అరెస్ట్

మహబూబాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): అక్రమాలకు పాల్పడిన మహబూబాబాద్ డీటీవో మహ్మద్ గౌస్‌పాషాతో పాటు డ్రైవర్ ఎలమందల సుబ్బారావు, ప్రైవేట్ వ్యక్తి రాంగోపాల్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. డీటీవో గౌస్‌పాషాపై వాహనదారులు ఏసీబీ అధికారులకు లేఖ రాశారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. ఈ ఏడాది మే 28న మహబూబాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ సుబ్బారావు వద్ద లెక్కల్లో చూపని 61,600 నగదుతోపాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో గౌస్‌పాషా పనిచేసినపుడు కుమారుడు మహ్మద్ ఆరీపుద్దీన్, మేనల్లుడు మహ్మ ద్ మునీర్‌తో కలిసి రూ.2.97లక్షలు లంచం వసూలు చేసినట్టు విచారణలో తేలింది. ఇవి కాకుండా మరో రూ.38 వేలు కారు డ్రైవర్ సుబ్బారావు ద్వారా గ్రానైట్, ఏజెంట్లు, వాహనదారుల నుంచి వసూలు చేసి వివిధ బ్యాంకు ఖాతాలకు మళ్లించి డిపాజిట్ చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏ1గా డీటీవో మహ్మద్ గౌస్‌పాషా, ఏ2గా ఎలమందల సుబ్బారావు, ఏ3గా డీటీవో కుమారుడు అరిపుద్దీన్, ఏ4గా గౌస్‌పాషా మేనల్లుడు మహ్మద్ మునీర్, ఏ5గా తణుకు రాంగోపాల్‌పై కేసు నమోదు చేశారు. ఈ నెల 11న గౌస్‌పాషా, సుబ్బారావు, రాంగోపాల్‌లను అరెస్ట్ చేసి సోమవారం వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరుచగా, జడ్జి వారిని రిమాండ్‌కు ఆదేశించడంతో పోలీసులు జైలుకు తరలించారు.



డీటీవో మహ్మద్ గౌస్ పాషా(మధ్యలో), డ్రైవర్ సుబ్బారావు, ప్రైవేట్ వ్యక్తి రాంగోపాల్

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ

- రూ.6 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

సుబేదారి, ఆగస్టు 12: ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈగా పనిచేస్తున్న గుగులోత్ గోపాల్ లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి సబ్‌డివిజన్‌లో నీటిపారుదల శాఖ ఏఈగా పనిచేస్తున్న గుగులోత్ గోపాల్ పాలకుర్తి మండలం గుడికుంట తండా స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ బానోత్ కాంతి భర్త యాకూబ్ నాయక్ గ్రామపంచాయతీలో చేపట్టిన పనుల బిల్లులు మంజూరు చేయాలని గోపాల్‌ను సంప్రదించాడు. రూ.6 వేల లంచం ఇస్తే బిల్లులు మంజూరు చేస్తానని చెప్పడంతో యాకూబ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం.. సోమవారం హనుమకొండ నక్కలగుట్ట ఎస్‌బీఐ సమీపంలో యాకూబ్ నుంచి గోపాల్ రూ.6 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



ఏసీబీకి పట్టుబడిన ఏఈ గోపాల్

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

విశ్వక్రీడల్లో వెనుకబాటు

ప్యారిస్ ఒలింపిక్స్ క్రీడలు మన దేశానికి అనేక కారణాల వల్ల గుర్తుండిపోతాయి. ఒక్కటంటే ఒక్క స్వర్ణం రాలేదు. మను భాకర్ సింగిల్స్ కాంస్యంతో శుభారంభం చేసినా ముగింపు నిరాశాజనకమే. మిక్స్‌డ్ షూటింగ్‌లోనూ సరబ్ జ్యోత్‌సింగ్‌తో కలిసి మను మరో కాంస్యం అందుకోవడంతో ట్యాలీ 3కు పెరిగింది. 50 మీటర్ల రైఫిల్ పోటీల్లో స్వప్నిల్ కూసళే కాంస్యం గెల్చుకోగా, హాకీ టీం కూడా కాంస్యంతోనే సరిపెట్టుకున్నది. కాకపోతే వరుసగా రెండు ఒలింపిక్స్‌లో హాకీ టీం పతకాలు గెలవడం విశేషం. 44 ఏండ్లుగా మన హాకీ జట్టుకు స్వర్ణం అందని ద్రాక్షగా ఉండిపోయింది. కుస్తీల్లో అమన్ సెరావత్ కూడా కాంస్యం దగ్గరే ఆగిపోవాల్సి వచ్చింది. జావెలిన్ త్రోలో నీరజ్ రజతం గెల్చుకోవడం కొద్దిగా ఊరటనిచ్చింది. ఇదంతా ఒకెత్తు, రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఉదంతం ఒకెత్తు. స్వర్ణం సాధిస్తుందనుకున్న ఈ కుస్తీ యోధురాలు చివరి నిమిషంలో కేవలం వంద గ్రాముల అధిక బరువు కారణంగా పోటీకి అనర్హురాలు కావడం పెను విషాదం. దాంతో ఉవ్వెత్తున ఎగసిన ఆశలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఆ చేదు అనుభవం కారణంగా అంతర్జాతీయ పోటీల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్టు ఆమె ప్రకటించడం మరింత బాధాకరం. వినేశ్ బరువును చూసుకోవాల్సిన సహాయక బృందం వైఫల్యమే ఆమె బరువు సమస్యకు కారణమనే వాదన వినవస్తుండటం గమనార్హం. యావత్తు దేశం ఆమె ఆవేదనలో పాలుపంచుకున్నది. ఓటమితో వెనుదిరిగిన ఓ క్రీడాకారిణి స్ఫూర్తి అపూర్వ గౌరవాన్ని పొందడం చిన్న విషయం కాదు.

టోక్యోతో పోల్చితే పతకాలు తగ్గినా క్రీడాకారుల సామర్థ్యం మెరుగుపడిందనే ప్రశంసలు వస్తుండటం ముదావహం. అయినప్పటికీ అంతర్జాతీయ ప్రమాణాలు సాధించడంలో మనం వెనుకబడిపోయామనేది ఒప్పుకొని తీరాల్సిన వాస్తవం. 117 మందితో వెళ్లిన భారత ఒలింపిక్స్ టీం 6 పతకాలతోనే సరిపెట్టుకోవాల్సి రావడం మన దేశపు క్రీడా నాయకత్వం ఆలోచించాల్సిన విషయమే. ప్రభుత్వం, క్రీడా సంఘాలు తమ విధానాలను, ఆచరణను లోతుగా సమీక్షించుకోవాల్సిన సందర్భం ఇది. భారత్‌కు పతకాలు రాకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తాయి. అన్నిటికన్నా ముఖ్యంగా గత పదేండ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఎన్డీయే సర్కారు క్రీడారంగంలో సాధించిన ప్రగతి ఏమిటనేది పెద్ద ప్రశ్న. ప్రధాని మోదీ క్రీడాపోటీల విజేతలతో ఫొటోలు దిగేందుకు చూపే ఉత్సాహంలో కొంచెమైనా క్రీడల అభివృద్ధి పట్ల చూపకపోవడం విచారకరం. పైగా క్రీడారంగంలో రాజకీయ నేతల పెత్తనం అడుగడుగునా కనిపిస్తుంటుంది. అస్మదీయులను అందలమెక్కించడం, ప్రతిభావంతులను అణగదొక్కడమనే జాడ్యం భారత క్రీడారంగానికి శాపంగా మారింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు జైషా బీసీసీఐ కార్యదర్శిగా ఉండటం క్రీడల్లో బంధుప్రీతికి నిదర్శనం. అలాగే గతంలో బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ రెజ్లింగ్ సమాఖ్యలో తిష్ఠవేసుకుని కూర్చుని క్రీడాకారిణులను లైంగిక వేధింపులకు గురిచేయడంపై దుమారం చెలరేగింది. ఒలింపిక్స్‌లో స్వర్ణం దాకా వెళ్లి ఆగిపోయిన వినేశ్ ఫోగట్ ఆయనపై సాగించిన పోరాటం తెలిసిందే.

ఇలాంటి సమస్యలే కాకుండా మోదీ సర్కారు క్రీడలకు కేటాయిస్తున్న నిధులు అరకొరగా ఉండటం మరో సమస్య. ప్రపంచ దేశాలు క్రీడలకు సగటున జీడీపీలో 0.5 శాతం కేటాయిస్తుంటే, భారత్ కేటాయించేది 0.1 శాతమే. మొన్నటి బడ్జెట్‌లో నిధులు పెంచిన తర్వాత ఆ స్థాయికి చేరింది. అరకొర నిధుల పర్యవసానంగా క్రీడలకు మౌలిక సదుపాయాలు, శిక్షణా కేంద్రాలు తగినస్థాయిలో లేకపోవడం, క్రీడా మనస్తత్వ, వైద్య శాస్త్రాల్లో పురోగతి సాధించకపోవడం, ఆధునిక శిక్షణ వసతులు, శిక్షకులు అందుబాటులో ఉండకపోవడం వంటివి భారతీయ క్రీడారంగానికి శాపంలా పరిణమించాయి. వివిధ క్రీడలను ప్రోత్సహించడంలో సమతూకం పాటించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే మరో లోపం. ఒలింపిక్స్ పతకాల్లో భారత్ పరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతుండటంపై కేంద్ర సర్కారు దృష్టిపెట్టాలి. వ్యవస్థాపరమైన, నిర్వహణాపరమైన లోపాలను చిత్తశుద్ధితో సవరించాలి. లేకపోతే అత్యధిక జనాభా కలిగిన దేశం అతితక్కువ పతకాలతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి పదేపదే ఎదురవుతూనే ఉంటుంది.

మన దేశంలో ఏ మంత్రయినా బాధ్యతలు స్వీకరించేటప్పుడు ఎలాంటి ఆశ్రిత పక్షపాతం చూపనని రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేస్తారు. అంతేకాదు, భారత ప్రభుత్వ ప్రవర్తనా నియమావళి ప్రకారం.. ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి పదవిలో ఉన్నంత కాలం తన కుటుంబ సభ్యులు ప్రభుత్వంతో ఎలాంటి వ్యాపారాలు చేయకుండా చూడాలి. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఈ నిబంధనలు వర్తించవా? అన్నది అసలు ప్రశ్న.

conflict of interest కేసులో ఇందిరాగాంధీని కోర్టు అనర్హురాలిగా ప్రకటించినప్పుడు ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేశారు. విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ కూడా గతంలో తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి చట్టానికి అతీతుడేమీ కాదు.

స్వచ్ఛ బయో డీల్ స్వచ్ఛం కాదు



క్రిశాంక్ మన్నె



ఈ పదేండ్లలో తెలంగాణ నుంచి అమెరికాకు వెళ్లిన అతిపెద్ద బృందం ఇదే కావచ్చు. గతంలో ఐటీ మంత్రి, ఐటీ శాఖకు చెందిన అధికారులే పర్యటనకు వెళ్లేవారు. కానీ, ఈసారి మాత్రం ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యమంత్రి సిబ్బంది, ఇద్దరు మంత్రులు, కొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక పత్రిక ఎడిటర్ కూడా ఆ బృందంలో ఉండటం ఆశ్చర్యకరం.

> **రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడమే కాదు, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే మరింత మెరుగైన పనితీరును కనబరిచారని రుజువు చేయడం ఈ బృందం ముందున్న టాస్క్. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తారని ఆశిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ వారికి శుభాకాంక్షలు కూడా తెలిపారు.**

గత ప్రభుత్వ కృషిని, పనితీరును మెచ్చుకుంటూ కాగ్నిజెంట్ కంపెనీ విస్తరణతో సీఎం మొదటిరోజు పర్యటన ప్రారంభమవడం ఆహ్వానించదగిన విషయం. ఏదేమైనప్పటికీ వాల్ష్ కర్రా హోల్డింగ్స్ కంపెనీతో ఒప్పందంతో మొదటి రోజు అస్పష్టతతో ముగిసింది. ఆ కంపెనీ డైరెక్టర్లు సందేహాస్పదంగా ఉన్నారు. సదరు కంపెనీ ఆర్థిక స్థితిగతులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతేకాదు, ఆ కంపెనీ మునుపటి వ్యాపారాలు మూతబడ్డాయి. సదరు కంపెనీ తెలంగాణలో రూ.839 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్టు రేవంత్‌రెడ్డితో కలిసి ప్రకటించడం సంచలనం రేపింది. అసలు ఇలాంటి మోసపూరిత కంపెనీలను రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహిస్తున్నట్టు?

ఈ ఏడాది మొదట్లో రేవంత్ దావోస్ పర్యటన సందర్భంగా గోదీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ రూ.8 వేల కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. రూ.కోటి మాత్రమే పెయిడ్ అప్ క్యాపిటల్ ఉన్న కంపెనీ, వార్షిక స్టేట్‌మెంట్‌ను రూ.27 లక్షలుగా చూపిన కంపెనీ అసలు రూ.8 వేల కోట్ల పెట్టుబడులు పెట్టగలదా? ఈ ఒప్పందాన్ని ప్రకటించిన నాటి నుంచి గత ఆరు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడంలో విఫలమైంది.

రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ మూసీ పునరుజ్జీవ పథకాన్ని తమ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా చేపట్టింది. అయితే ఈ పథకానికి సంబంధించి ఎలాంటి వివరణాత్మక నివేదికలు లేవు. ఈ ప్రాజెక్టుకు రూ.50 వేల కోట్ల అంచనా వ్యయం అవుతుందని మొదట కాంగ్రెస్ పాలకులు ప్రకటించారు. ఆ తర్వాత రూ.70 వేల కోట్లకు పెంచారు. తాజాగా రూ.1.50 లక్షల కోట్లకు సవరించారు.

ఈ భారీ ప్రాజెక్టును చేపట్టేందుకు సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కంపెనీ ప్రతినిధులతో సీఎం కార్యాలయంలో చర్చలు జరిగాయి. అయితే ఆ కంపెనీ యజమానులు నసీమ్ షహజాద్, ఒమర్ షహజాద్ ఆర్థిక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. రూ.3 వేల కోట్ల మనీ లాండరింగ్‌కు సంబంధించి వారిపై లుకౌట్ నోటీసులు ఉన్నాయి. అంతేకాదు, వారు దేశం విడిచి పారిపోయారని పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అభియోగాలు మోపింది. అలాంటి కంపెనీ ప్రతినిధులతో మూసీ పునరుజ్జీవ పథకం గురించి సీఎం రేవంత్ చర్చించడం ఆశ్చర్యం కలిగించింది.

తెలంగాణలో బీర్లు విక్రయించేందుకు సోమ్ డిస్టిలరీస్‌కు కాంగ్రెస్ సర్కార్ అనుమతులు ఇవ్వడంపై ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. సదరు కంపెనీ నకిలీ మద్యానికి పేరుగాంచింది. కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలు స్వాహా చేయడం, పన్ను ఎగవేతల కేసులో అరెస్టులు, బాల కార్మికులతో పని చేయించినందుకు గానూ బ్లాక్‌లిస్టులో చేరడం వంటి వాటికి ఆ కంపెనీ పేరుగాంచింది. అలాంటి కంపెనీకి అనుమతులు ఇవ్వడంపై ప్రతిపక్షాలు నిలదీశాయి. మీడియా, సోషల్‌మీడియాలోనూ తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో అనుమతులను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రభుత్వం మీడియాకు లీకులిచ్చింది. ఈ కంపెనీ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల విరాళం సమర్పించినదే కావడం గమనార్హం. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ద్వారా ఈ విషయం వెల్లడైంది.

కేవలం ఆరు నెలల కాలంలోనే కాంగ్రెస్ సర్కార్ చేసుకున్న లోపభూయిష్ట చీకటి ఒప్పందాలివీ. ఇవన్నీ ఓవైపు ఉండగానే.. రేవంత్ అమెరికా పర్యటనలో రెండో రోజు స్వచ్ఛ్ బయో కంపెనీ తెలంగాణలో రూ.1000 కోట్ల పెట్టుబడులు పెడుతుందని ప్రకటించడం షాక్‌కు గురిచేసింది. అసలు వాస్తవమేమిటంటే.. ఈ కంపెనీ స్థాపించింది 15 రోజుల కిందటనే. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఈ కంపెనీకి ఇద్దరు డైరెక్టర్లు ఉన్నారు. లక్నోలోని మెజ్జె బార్ మెడిటెరేనియన్ యజమాని శివానంద వారిలో ఒకరు. రెండో డైరెక్టర్ మరెవరో కాదు, స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం.. అతని చిరునామా ఫిలడెల్ఫియా. కానీ, స్వచ్ఛ్ బయో కంపెనీ అధికారిక చిరునామా మాత్రం జూబ్లీహిల్స్‌లోని నవనిర్మాణ్ నగర్. ఈ చిరునామాలో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఉన్నది.

> **ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అసలు అక్కడ ఆ కంపెనీ పేరిట బోర్డే లేదు. కానీ, ఆ కంపెనీ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. కంపెనీ డైరెక్టర్లు ఎంవోయూపై సంతకం చేయకపోవడం ఆశ్చర్యకరం. ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి సహచరుడు హర్ష పసునూరితో అందులో సంతకం చేయించారు. అంతేకాదు, సీఎం రేవంత్, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులతో ఆయనే ఫొటోలకు ఫోజులిచ్చారు.**

శాస్త్రవేత్త ప్రవీణ్ పరిపాటి నేతృత్వంలోని సుగనిత్ కంపెనీతోనూ స్వచ్ఛ్ బయో ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత తమ్ముడితో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడుల కోసం ఒప్పందం చేసుకున్నారని ప్రతిపక్షం బయటపెట్టడంతో రేవంత్‌రెడ్డి మొదటిసారి ఆత్మరక్షణలో పడిపోయారు. దీంతో ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావులతో వీడియోలు విడుదల చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌ను రక్షించేందుకు రామకృష్ణరావు తన విశ్వసనీయత, అనుభవాన్ని ఉపయోగించవలసి వచ్చింది. అమెరికా పర్యటన, తాము కంపెనీలతో చేసుకుంటున్న ఒప్పందాలకు సంబంధించి తమను విశ్వసించాలని జయేశ్ రంజన్ ప్రార్థిస్తున్నట్టు వీడియోలో చూడవచ్చు. మీడియాలో విస్తృతంగా వ్యాప్తిచెందిన ఈ వీడియోలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. దీంతో కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నష్టనివారణ చర్యలకు దిగారు. అయితే వాళ్ల ప్రయత్నం ఏ మాత్రం ఫలించలేదు.

ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సుగనిత్ కంపెనీ, శాస్త్రవేత్త సాంకేతిక అనుభవాన్ని సమర్థించారు. కానీ, స్వచ్ఛ్ బయో గురించి గాని, సీఎం సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి ఆ కంపెనీకి డైరెక్టర్‌గా ఉండటం గురించి గాని ఆయన ఒక్కమాట కూడా ప్రస్తావించలేదు. సాధారణంగా అమెరికా పర్యటన, డెలిగేట్స్‌తో సమావేశాలు, ఎంవోయూల గురించి ప్రతి విషయాన్ని తన అధికారిక, సీఎంవో ఎక్స్ ఖాతాల్లో షేర్ చేసే ఐటీ మంత్రి.. వాల్ష్ కర్రా, స్వచ్ఛ్ బయో లాంటి ఒప్పందాల గురించి పోస్టు చేయలేదనే విషయాన్ని నెటిజన్లు గుర్తించారు.

చామల కిరణ్ లాంటి కొందరు ఎంపీలు సీఎంను సమర్థించే క్రమంలో అయోమయానికి గురయ్యారు. ఆ కంపెనీ సీఎం తమ్ముడి సొంతం కాదని, ఆయన కంపెనీకి డైరెక్టర్‌గా మాత్రమే ఉన్నారని, ప్రమోటర్‌కు సన్నిహితుడని చెప్పారు. సీఎం రేవంత్ కుటుంబసభ్యులు వ్యాపారాలు చేస్తే తప్పేంటని కిరణ్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి ప్రశ్నించారు. తెలంగాణకు అమెరికా నుంచి వేల కోట్ల పెట్టుబడులను తీసుకొస్తున్నట్టు వారు సమర్థించారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని మంత్రులు, అధికారుల బృందం ఎంవోయూపై సంతకాలు చేసి, బహిరంగంగా ఒప్పందాల గురించి ప్రకటించిన విషయాన్ని మరిచిపోయి.. రేవంత్‌ను సమర్థించే క్రమంలో ఒప్పందంలోని పని ఇంకా ప్రారంభం కాలేదని కొందరు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. అనేక ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన రేవంత్ కాంగ్రెస్ నేతల వాదనలతో మరింత ఇరకాటంలో పడ్డారు.

> **ఈ మొత్తం వ్యవహారం రాజ్యాంగబద్ధమైన కార్యాలయాన్ని, ఎవరి పట్ల ఆశ్రిత పక్షపాతం చూపనని అతను చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘించినందున సీఎం పదవికి ఎసరు తేవచ్చు. అంతేకాదు, సీఎం తాను పేద కుటుంబానికి చెందినవాడినని పదే పదే చెప్తున్నందున.. పెట్టుబడి పెట్టేందుకు రూ.వెయ్యి కోట్లు ఎలా సంపాదించారనే విషయాన్ని అతని సోదరుడు వివరించాలి. మనీ లాండరింగ్ ఏమైనా ఉందా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాలి.**

ఒకవేళ కంపెనీ డైరెక్టర్లు ఆదాయ వనరులను వివరించడంలో విఫలమైతే, బ్రాండ్ విలువను పెంచే ఉద్దేశంతో షెల్ కంపెనీ లాగా ఆ ప్రకటన వెనుక నేరపూరితమైన ఉద్దేశం ఉండి ఉంటే అది Conflict of interest కింద సీఎం రేవంత్‌కు తీవ్ర సమస్యగా మారవచ్చు. కంపెనీ డైరెక్టర్ ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి తన చిరునామా ఫిలడెల్ఫియా అని ప్రకటించినందున వ్యాపార లావాదేవీలు, పన్నులకు సంబంధించి ఫెడరల్ ఏజెన్సీలు అతన్ని ప్రశ్నించవచ్చు. అదేవిధంగా మన దేశంలోని కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా స్వచ్ఛ్ బయో ద్వారా రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, అతని సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి, మరో డైరెక్టర్ శివానంద, హర్ష పసునూరిలను ప్రశ్నించవచ్చు. అంతేకాదు, సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీని కాపాడే విషయంలో కంపెనీకి సంబంధించి తమ వ్యక్తిగత ప్రయోజనాలు ఏమిటనే విషయమూ ఆరా తీయవచ్చు. అదే కనుక జరిగితే సీఎం రేవంత్ సీటుకే గండం.

(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ నాయకులు)

విదేశాంగ విధానం వైఫల్యమే!

ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వాంఛనీయం కాదు. కానీ, పొరుగు దేశాలు అల్లకల్లోలంగా ఉన్నప్పుడు, హింసను ఎదుర్కొంటున్నప్పుడు మౌనం వహించడం విదేశాంగ విధానం అనిపించుకోదు. అలా ఉండటం విదేశాంగ విధానం వైఫల్యమే.

- అఖిలేశ్ యాదవ్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి



మేధావులకు నిజాయితీ అక్కరలేదా?

ఏది ఉన్నా లేకున్నా నిజాయితీ లేనివారిని మేధావులు అనవచ్చునా? తెలంగాణలో మేధావుల పేరిట ఒక బృందం చెలామణి అవుతున్నది. సాధారణ నిర్వచనాల ప్రకారం చూసినట్లయితే వారు మేధావులే. బాగా చదువుకున్నవారు. యూనివర్సిటీలలోనో, బయటనో పెద్ద ఉద్యోగాలు చేసినవారు. లేదా ఇంకా చేస్తున్నవారు. సెమినార్లలో, వర్క్‌షాప్‌లలో, సభలలో వారు గొప్పగా ఉపన్యసిస్తారు. అద్భుతమైన థియరీలు చెప్తారు. సునిశితమైన విశ్లేషణలు చేస్తారు. అంతా ప్రజల కోసమంటారు. మేధావులైనవారికి ఇంతకన్నా ఇంకేమి కావాలి? అందువల్ల వీరిని మేధావులని తప్పకుండా ఒప్పుకోవాలి. అయితే, మేధావులైనవారికి బహుశా మరొక లక్షణం కూడా ఉండాలి కావచ్చు. అది నిజాయితీ. ఈ మాట అనటం ఎందుకంటే, ప్రజలు ఇతరత్రా ఎవరికి ఏ లక్షణాలున్నా గుర్తించి మెచ్చుకుంటూనే, నిజాయితీ అన్నది లేకుంటే మాత్రం పెదవి విరిచి కొట్టివేస్తారు. మేధావుల మేధావితనానికి, గౌరవనీయతకు, విశ్వసనీయతకు నిజాయితీ అన్నది చివరి గీటురాయి అవుతుంది.



టంకశాల అశోక్



ఇప్పుడు నిర్దిష్ట అంశాలలోకి వెళ్దాము. ఈ మేధావులు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను వ్యతిరేకించి, కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రచార రథాలకు జెండాలు ఊపి మరీ ప్రచారాలు చేశారు. సమస్య అది కాదు. అది వారి అభిప్రాయం, స్వేచ్ఛ. అదంతా వారు ప్రజల మేలును కోరి చేశారనుకోవాలి. అదేవిధంగా మరొకవైపు ప్రజలు తమ తమ కారణాల వల్ల బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారు. ప్రజాస్వామ్యంలో అది ప్రజల స్వేచ్ఛ. ఇంతవరకు దేని గురించి కూడా ఆక్షేపించవలసిందేమీ లేదు. విషయం ఆ తర్వాత నుంచి మొదలవుతుంది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఒక గెలిచిన పార్టీకి, ప్రజలకు మధ్య కాంట్రాక్టు ఒకటి ఏర్పడుతుంది. అధికారపక్షం ఆ కాంట్రాక్టు ప్రకారం నడుచుకుంటే ప్రజలు హర్షిస్తారు. లేనట్లయితే నిరసిస్తారు. ఇటువంటి కాంట్రాక్టు స్థితిలో జెండా మేధావుల వ్యవహరణ ఏ విధంగా ఉండాలి? ఏ విధంగా ఉండాలని స్వయంగా వారనుకుంటున్నారు?

మనకు కలిగే ఆలోచన ప్రకారమైతే, వారు జెండాలూపింది ప్రజల కోసమే అయినపక్షంలో, కాంట్రాక్టు భంగపడుతున్నదని భావించటం మొదలైనప్పుడు తాము కూడా ఆ ప్రజల పక్షాన నిలవాలి. లేక కాంట్రాక్టుకు భంగం ఏమీ కలగటం లేదని తమకు తోచినట్లయితే అదే మాట ప్రజలకు వివరించి చెప్పాలి. లేదా కాంట్రాక్టు చక్కగా అమలవుతున్నదనుకున్నట్లయితే ప్రభుత్వాన్ని ధైర్యంగా బలపరచాలి. కాంట్రాక్టు అమలుకు ఇంకా సమయం అవసరమని, ప్రజలు కొంత ఓపిక పట్టాలని అనిపించితే అదైనా చెప్పాలి. ఈ నాలుగు కాకుండా, తాము అనేక థియరీలు చదివిన మేధావులు గనుక, ఇతర పద్ధతులు ఏమైనా ఉంటే అవన్నా పేర్కొనాలి. కానీ వారు ఏదీ చేయటం లేదు. సమస్య అక్కడే వస్తున్నది. ఇంతకూ వారు జెండా లూపి ప్రభుత్వం మారాలని ప్రజలకు సలహా ఇచ్చింది ప్రజలపై ప్రేమ వల్లనా లేక కాంగ్రెస్ పట్ల ప్రేమతోనా? అనే అనుమానాలు మొదలయ్యేది అటువంటప్పుడే. అది గ్రహించలేనివారేమీ కాదు వీరు. అయినప్పటికీ మౌనంగానే మిగిలిపోతే రోజులు గడిచి న కొద్దీ ఈ అనుమానాలు సహజంగానే బలపడుతాయి.

ప్రజలకు పరిపాలనాపరమైన కాంట్రాక్టు అధికారపక్షంతో అయితే, నైతికమైన కాంట్రాక్టు ఈ జెండా మేధావులతో ఉంటుంది. సమాజంలో మేధావులది ఒక ప్రత్యేక స్థానం గనుక. ఇందుకు ఒక పోలిక చెప్పాలంటే, ఒక ఉత్పత్తికి ఫలానా మంచి గుణాలు లేకపోయినా ఉన్నాయంటూ ప్రచారాలతో ప్రమోట్ చేసే సినీతారలకు నైతిక బాధ్యత ఉండటం వంటిదన్న మాట. వారికి అటువంటి బాధ్యత ఉంటుందని కోర్టులు తీర్పు చెప్పాయి కూడా. అటువంటి సందర్భాలలో కొందరు తారలు, క్రీడాకారులు ఆ ప్రచారాల నుంచి ఉపసంహరించుకునే నిజాయితీ చూపటం మనకు తెలుసు. నిజాయితీ లేని మరికొందరు ఏవో ప్రయోజనాల కోసం అట్లానే కొనసాగుతున్నారు. వారి గురించి ఏమనుకుంటాము? ప్రజల బాగోగులతో నిమిత్తం లేకుండా సదరు కంపెనీలతో కాంట్రాక్టులే వారికి ముఖ్యం అనుకుంటాము. ఈ మేధావుల విషయంలోనూ అట్లాగే భావించవలసి వస్తుంది. అటువంటి అనివార్య స్థితిని సృష్టిస్తున్నది వారే. ఆ పని ఇతరులు చేసినట్లయితే పట్టించుకోనక్కరలేదు. కానీ మేధావులనేవారు చేయడమంటే వారిని ఏమనాలో తోచదు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా, ద్వంద్వ ప్రమాణాలు లేకుండా, కపట బుద్ధి లేకుండా ఉండాలని కోరటం తప్పు.

> **ఇప్పుడు కొన్ని విషయాలు చూద్దాము. ఎన్నికల సమయంలో ప్రజలకు, కాంగ్రెస్‌కు మధ్య కాంట్రాక్టు జరిగినవి కొన్నున్నాయి. అందుకు జెండా మేధావులు తమ ప్రచారాల కారణంగా పరోక్ష సంధాన కర్తలయ్యారు. చెప్పుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి గాని ముఖ్యమైన కొన్నింటిని చూద్దాము.**

వాటిని ముఖ్యమని పరిగణించటం ఎందుకంటే, తెలంగాణ ప్రజలలోని పెద్ద సంఖ్యల వారితో వాటికి నిమిత్తం ఉంది. వారి జీవితాలలో అవి చాలా ముఖ్యమైన విషయాలు. అటువంటి వాటిలో ఉద్యోగ నియామకాలు ఒకటి. రైతాంగం కోసం చేస్తామన్నవి మరొకటి. పేదల సంక్షేమ సంబంధమైనవి మూడవది. ఈ మూడింటిని మాత్రం చెప్పుకుందాము.

ఉద్యోగాలకు సంబంధించి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ విధంగా ఉంది. 'అధికారంలోకి రాగానే మొదటి సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, స్పెషల్ డిపార్టుమెంట్ నియామకాల మిషన్ ద్వారా చేపట్టబడుతాయి. దరఖాస్తుదారులు ఎవ్వరూ ఒక్క రూపాయి ఫీజు కట్టవలసిన అవసరం లేదు.' కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 7న ఏర్పడింది. ఈ వ్యాసం రాసే రోజుకు 8 నెలల 5 రోజులు పూర్తయ్యాయి. ఇంకా మిగిలింది 3 నెలల 25 రోజులు. గడిచిన 8 నెలల 5 రోజులలో ప్రస్తుత ప్రభుత్వం తన వైపు నుంచి ఇచ్చిన ఉద్యోగాలు శూన్యం. అనగా, తక్కిన 3 నెలల 25 రోజులలో ఇవ్వవలసినవి 2 లక్షలు. ఆరు గ్యారెంటీలలో భాగంగా బాండ్‌పేపర్‌పై రాసి, సంతకం చేసి, రాహుల్‌గాంధీతో చెప్పించి, ఇంటింటికి వెళ్లి హామీ ఇచ్చిన మొత్తానికి మొత్తం 2 లక్షలన్నమాట.

ఇక ఇందుగురించి జరుగుతున్న వాటిని మాట్లాడుకోవాలంటేనే అలసట కలుగుతున్నది. ఇంత సుదీర్ఘకాలంలో ఒక్కటంటే ఒక్క కొత్త ఉద్యోగమైనా ఇవ్వకపోవటమే గాక, గత ప్రభుత్వ ఉద్యోగాలు 30 వేలను తమవని నిర్భయంగా అబద్ధపు మాటలు పదే పదే చెప్తున్నారు. చివరికి అసెంబ్లీలోనూ గవర్నర్‌తో అదే అబద్ధం చెప్పించి, బడ్జెట్ ప్రసంగంలో సైతం అబద్ధమాడారు. అది అబద్ధమని స్వయంగా నిరుద్యోగులే తిరస్కరిస్తున్నా ధోరణి మారటం లేదు. ఒక్క ఉద్యోగమిచ్చినట్లు రుజువు చేసినా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి అసలు రాజకీయాలనే వదిలివేయగలనని కేటీఆర్ పలుమార్లు సవాలు చేసినా ప్రభుత్వ పెద్దల నుంచి స్పందన లేదు. ఇది చాలదన్నట్లు, రాబోయే 90 రోజుల్లో 'మరో 30 వేల' ఉద్యోగాలిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జూలై 26న ప్రకటించారు. ఆ విధంగా జరుగుతుందనుకున్నా ఇంకా లక్షా డెబ్బై వేల ఉద్యోగాలు, వాటి గడువుకు కేవలం 72 రోజుల సమయం మిగులుతాయి. ఇంతకుముందే, అసలు ఏడాది గడువంటూ మొదలైన నెలన్నరకే సీనియర్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జనవరి 24న మాట్లాడుతూ, చదువుకున్న వాళ్లందరికీ ఉద్యోగాలు సాధ్యం కాదని, అర్హులైన వారికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు మాత్రం ఇవ్వగలమని స్పష్టం చేశారు. ప్రభుత్వపు అసలు ఆలోచనలు బయటపెట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో ఒక్క ఉద్యోగమైనా ఇవ్వక యువతీ యువకులను మోసం చేసిందంటూ కాంగ్రెస్‌తో పాటు మేధావులు సాగించిన ప్రచారంలోని నిజానిజాలను పక్కన ఉంచుదాం. కానీ, ఆ పార్టీ వారు, ఈ మేధావులు కలిసి నిరుద్యోగులకు హామీ ఇచ్చిన ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కాంట్రాక్టు ఒప్పందం అమలుతీరు ఇంత దగాకోరుతనంగా ఎందుకున్నట్లు? నిరుద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వం స్పందించదు సరే. మేధావుల పెదాలు ఎందుకు విప్పుకోవటం లేదు?

> **రైతాంగం విషయానికి వస్తే, మ్యానిఫెస్టోలో వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట 9 అంశాలు, 'వ్యవసాయము-రైతు సంక్షేమం' పేరిట మరికొన్ని ఉన్నాయి. వీటిలో, అధికారానికి వచ్చిన 'వెంటనే' చేసేవి, సత్వరం చేసేవి, క్రమక్రమంగా చేసేవి మొత్తం మూడు విధాలుగా ఉన్నాయి. వీటి అమలు ఏ విధంగా ఉన్నదో రైతులు రాష్ట్రవ్యాప్తంగా మాట్లాడుతున్నారు.**

ఒకే ఉదాహరణ చెప్పాలంటే, మ్యానిఫెస్టో ప్రకారం రైతు భరోసా పథకం రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు వంద రోజుల్లోనే అమలు కు తేవటంతో పాటు వరికి బోనస్ ఇవ్వాలి. అన్ని పంటలకు ఇవ్వగలమని తర్వాత ప్రకటించారు. ఇవేవీ 100 కాదు గదా 250 రోజులైనా అమలుకాకపోవటమే గాక, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ నెల 6న మాట్లాడుతూ ఈ పని ఇప్పట్లో జరిగేది కాదని సూచించారు. అసలు ప్రభుత్వం ఇంతవరకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల లెక్కలైనా తేల్చలేదు. రైతుబంధుపై అసెంబ్లీలో చర్చ అన్నారు. మంత్రుల కమిటీతో అన్ని జిల్లాలలో అభిప్రాయ సేకరణ అన్నారు. ఏవీ జరగలేదు.

సంక్షేమాల మాటైతే చెప్పనే అక్కరలేదు. ఉదాహరణకు 100 దినాలు కాదు గదా 250 గడిచినా ఎవరి పింఛన్లూ పెరగలేదు. పలు ఇతర హామీల అమలు అసలు మొదలు కాకపోగా రెండు మూడు మాత్రం పేరుకు ఆరంభించి పక్కన పెట్టారు. నిధులు కష్టమని ముందే తెలిసినా, కేవలం ఓట్ల కోసం మభ్యపెట్టి మోసగించారని ప్రజలకు అర్థం కావటం మొదలైంది. తాము చేస్తున్నది మోసమని ముందే తెలియని అమాయకులు కాదు కాంగ్రెస్ వారు. అదే పద్ధతిలో, కాంగ్రెస్‌తో కలిసి తాము కూడా మోసం చేస్తున్నట్లు ముందే గ్రహించలేని అమాయకులా జెండా మేధావులన్నది ప్రశ్న. ఇటువంటి నిజాయితీ రహితులు, ఇప్పటికీ నోరు విప్పనివారిని మేధావులనగలమా?

సర్కార్‌పై ఉద్యోగుల జంగ్ సైరన్

▸ మొదటిపేజీ తరువాయి...

జేఏసీలో భాగస్వామ్యమయ్యాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి మొత్తం 36 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. వీటి పరిష్కారానికి చొరవ చూపాలని, లేదంటే 15 రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామని అల్టిమేటం జారీచేసింది. సర్కారు స్పందించి వెంటనే తమను చర్చలకు పిలవాలని లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించింది. టీఈజేఏసీ ఆవిర్భావంతో పాటు 15 మందితో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న పీఆర్టీయూ టీజీ సైతం ఇదే జేఏసీలో భాగస్వామ్యమైంది. ఈ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ సైతం ఎంప్లాయిస్ జేఏసీ సమావేశానికి హాజరయ్యారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, గ్రూప్ -1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రెసా ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ, తాహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, టీఆర్టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, టీటీయూ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, టీపీటీయూ అధ్యక్షుడు రాధాకృష్ణ, వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోల్కొండ సతీష్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మమ్మల్ని పిలిచిన.. చర్చించిన దాఖలాల్లేవు



ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసమే జేఏసీగా ఏర్పడ్డాం. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 15 రోజుల్లోనే పెండిగ్ డీఏలు విడుదల చేస్తామని చెప్పారు. మెరుగైన పీఆర్సీ ఇస్తామన్నారు. సీపీఎస్‌ను రద్దుచేస్తామన్నారు. పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని హామీనిచ్చి మ్యానిఫెస్టోలో పెట్టారు. 9 నెలలు కావొస్తున్నా ఒక్కటంటే ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. గతంలో రెండు డీఏలు పెండింగ్‌లో ఉంటేనే సమ్మెకు దిగిన సందర్భాలున్నాయి. ఇప్పుడు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మరో డీఏను సర్కారు త్వరలోనే బాకీ పడబోతున్నది. ఇది ఉద్యోగులు తెచ్చిన ప్రభుత్వమని రేవంత్‌రెడ్డి పలుమార్లు అన్నారు. కానీ, ఇంతవరకు ఉద్యోగులను పిలిచి సమస్యలపై చర్చించిన దాఖలాలేవు. అమెరికా పర్యటన నుంచి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలి. లేదంటే రాబోయే 10-15 రోజుల్లో జేఏసీని పటిష్టంచేసి, జిల్లాలు తిరిగి మా కార్యాచరణ ప్రకటిస్తాం. మరో ఉద్యమానికి పిలుపునిస్తాం. ముందుగా జిల్లాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కార సభలు నిర్వహిస్తాం. ఆ తర్వాత నల్లబ్యాడ్జీలతో నిరసనలు, మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలుంటాయి. అయినా ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు ప్రభుత్వం అన్యాయం తలపెడితే ఏ ఉద్యమానికైనా మేం సిద్ధమే.

– మారం జగదీశ్వర్, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్

ఒకటో తేదీన కొన్నిశాఖల్లో జీతం వస్తలేదు



ఉద్యోగులకు సంబంధించి వందల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆగస్టు 15 తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని, మమ్మల్ని చర్చలకు పిలుస్తామని మౌఖికంగా ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. సమయం దగ్గరపడుతున్నదని కాబట్టి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు అనుసరిస్తున్న ఈ కుబేర్, టోకెన్ విధానాన్ని రద్దుచేయాలి. కొత్త ప్రభుత్వంలో మొదటి తేదీనే జీతాలిస్తామన్నారు. కానీ కొన్ని శాఖల్లో మొదటి తేదీన జీతాలు రావడంలేదు. ఐకేపీ, అంగన్‌వాడీ, ఆశ, ఈజీఎస్ ఉద్యోగులంతా ఏకమయ్యాం. మేమంతా జేఏసీగా ఏర్పడ్డామంటేనే మా కార్యాచరణ రూపొందిస్తున్నామని అర్థం. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, సర్వీస్ రూల్స్ ఏర్పాటుతో సగం సమస్యలు, సీఎస్‌తో సమావేశం పెడితే మరో సగం సమస్యలు పరిష్కారమవుతాయి. జేఏసీని చర్చలకు పిలిస్తే అనేక సమస్యలు పరిష్కారమయ్యే అవకాశముంది. మా న్యాయమైన, చట్టబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

– ఏలూరి శ్రీనివాస్‌రావు, ఎంప్లాయీస్ జేఏసీ సెక్రటరీ జనరల్

ఏకీకృత సర్వీస్‌రూల్స్ రూపొందించాలి



సీపీఎస్ రద్దు సహా టీచర్ల అనేక పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. అత్యంత కీలకమైన ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను రూపొందించాలి. మోడల్ స్కూల్, ఎయిడెడ్, గురుకుల టీచర్లకు ఒకటో తేదీన జీతాలు అందడంలేదు. వీరికి 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి. సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

తక్షణమే కొత్త పీఆర్సీ వేయాలి



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ నాంది పలికింది. ఉమ్మడి ఏపీలో పనిచేసినట్టుగానే జేఏసీ మరింత ప్రభావశీలంగా పనిచేయాల్సిన అవసరమున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక వాగ్దానాలిచ్చారు. అనేక సమస్యలు పరిష్కరిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారు. వాటిని ప్రభుత్వం పరిష్కరించే దిశగా చొరవచూపాలి. పీఆర్సీ గడువు ముగిసి 13 నెలలైంది. తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని కొత్త పీఆర్సీ వేయాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.

– చావ రవి, టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మోడల్ స్కూల్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న టీచర్లు

నల్ల బ్యాడ్జీలతో మోడల్ స్కూల్ టీచర్ల నిరసన

010 పద్దు ద్వారా వేతనాలు, బదిలీలు చేయాలని డిమాండ్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 12: తమకు ఏండ్ల తరబడి బదిలీలు చేపట్టడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మోడల్ స్కూల్ టీచర్లు సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. తమకు బదిలీలు లేక ఒకే పాఠశాలలో 11 ఏండ్లుగా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. 010 పద్దు ద్వారా వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బాలరాజు, అంజయ్య, శోభారాణి, రేణుక, జ్యోతి, సరిత, ప్రభాకర్, శివకుమార్‌రెడ్డి ఉన్నారు.

విద్యారంగాన్ని గాడినపెట్టాలి



టీచర్ల బదిలీలు, పదోన్నతులిచ్చారు సంతోషం. కానీ ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యారంగాన్ని ప్రభుత్వం గాడినపెట్టాలి. విద్యాశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉండటం, ఇతర పనుల్లో ముఖ్యమంత్రి బిజీగా ఉండటంతో విద్యాశాఖకు సంబంధించిన అనేక ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే విద్యాశాఖను సీఎం వదిలించుకుని ప్రత్యేక మంత్రికి కేటాయించాలి.

–వై అశోక్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

భవిష్యత్తు కార్యాచరణ అవసరం



ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ అవసరం. అనేక మండలాలకు ఎంఈవోలు లేరు. ఆరేడు మండలాలకో ఎంఈవో చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. జూనియర్ లెక్చరర్, బీఈడీ, డైట్ కాలేజీ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలి. అన్ని జిల్లాలకు డీఈవోలు లేరు. ఇన్‌చార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు. పాఠశాలల పర్యవేక్షణ దెబ్బతింటున్నది. అన్ని జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలను నియమించాలి.

– సదానందంగౌడ్, ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కారుణ్య నియామకాలు చేపట్టాలి



ఎన్నికల సమయంలో రెవెన్యూశాఖలో బదిలీలు చేపట్టారు. ఎన్నికలు ముగియగానే వారిని వెనక్కి తీసుకురావాల్సి ఉండె. తహసీల్దార్లతో పాటు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను ఒక జిల్లాలో పనిచేస్తున్న వారిని మరో జిల్లాకు బదిలీచేశారు. ఇతర శాఖల్లో విలీనం చేసిన వీఆర్వోలను పాత సర్వీసుతో సహా తిరిగి రెవెన్యూశాఖలోనే కొనసాగించాలి. వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలి.

– వంగ రవీందర్‌రెడ్డి, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు

సర్కారు ముందు ఉద్యోగుల డిమాండ్లు ఇవే!

- సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి.
- ఉద్యోగుల చందాతో కూడిన ఈహెచ్ఎస్ అమలుచేయాలి.
- బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదలచేయాలి.
- ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలుచేయాలి.
- గచ్చిబౌలి టీఎన్జీవోకు రెండో ఫేజ్‌లో కేటాయించిన 101.02 ఎకరాల స్థలంపై సొసైటీకి యాజమాన్య హక్కులు కల్పించాలి.
- భాగ్యనగర్ టీఎన్జీవో సొసైటీకి శేరిలింగంపల్లి మండలం సర్వే నంబర్ -36, 37 గోపన్‌పల్లిలో ఇండ్ల స్థలాలకు సంబంధించిన మెమోను రద్దుచేయాలి.
- ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితి వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.
- సచివాలయంలోకి హెచ్‌వోడీల నుంచి 12.5శాతం కోటాను అమలు చేసి ఉద్యోగులను పంపించాలి.
- జీవో-317లోని లోపాలను సవరించాలి. పాత ఉద్యోగులకు పాత సీనియార్టీని కొనసాగించాలి. అంతర్‌జోనల్, స్పౌజ్‌బదిలీలు చేపట్టాలి.
- మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలుచేయాలి.
- కొత్త జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త కేడర్ స్ట్రెంథ్ మంజూరుచేయాలి.
- రంగారెడ్డి కలెక్టరేట్ ఉద్యోగులకు పూర్వపు 24శాతం హెచ్ఆర్ఏను మంజూరుచేయాలి.
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలి.
- పాత పీఆర్సీలోని పెండింగ్ బిల్లులను క్లెయిమ్ చేసుకునేందుకు గడువు 2026, మార్చి 31 వరకు పొడగించాలి.
- రాష్ట్రంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీలు ఏర్పాటు చేసి, కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- రీ అపాయింట్‌మెంట్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ సర్వీసును నిలిపివేయాలి.
- ఉద్యోగుల మీద కక్షసాధింపులు, తనిఖీలను నిలిపివేయాలి.
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను 1, 2, 3, 4 గ్రేడ్లుగా విభజించి క్యాడర్ స్ట్రెంథ్ ఏర్పాటు చేయాలి. పంచాయతీ కార్యదర్శుల సర్వీసును అపాయింట్‌మెంట్ తేదీ నుంచి క్రమబద్ధీకరించాలి.
- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన వారిని తిరిగి వారి స్థానాలకు పంపాలి.
- వైద్యవిధాన పరిషత్తు, గ్రంథాలయాలు, మార్కెటింగ్, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలి.
- ప్రత్యేక నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి.
- ఏసీబీ కేసు, ఇతర క్రమశిక్షణ కేసుల్లో సస్పెండైన ఉద్యోగులను ఒకసారి రివ్యూ కమిటీని ఏర్పాటు చేసి, ఆ తర్వాత తప్పక విధుల్లోకి తీసుకోవాలి.
- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఉన్నత చదువుల కోసం ఆన్‌డ్యూటీ సౌకర్యంతో కూడిన సెలవులిచ్చే జీవో 342ను పునరుద్ధరించాలి.
- ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీ చేసిన తాసిల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తాసిల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను పూర్వ జిల్లాలకు బదిలీచేయాలి.
- వీఆర్ఏలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- ఇతరశాఖల్లోకి పంపిన వీఆర్‌వోలను తిరిగి రెవెన్యూశాఖలోకి ఆప్షన్ల ద్వారా తీసుకొచ్చి సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలి.
- ఉస్మానియా యూనివర్సిటీలో ఓపీఎస్/ సీపీఎస్ అమలుకు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను కెప్ట్ ఇన్ అబయన్స్‌లో పెట్టిన ఉత్తర్వులను రద్దుచేయాలి.
- పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి.
- గరుకుల, మోడల్ స్కూల్ టీచర్లు సహా అందరు ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీనే వేతనాలివ్వాలి.
- జిల్లాలకు డీఈవో, నియోజకవర్గాలకు డిప్యూటీ ఈవో, ఎంఈవో పోస్టులను మంజూరుచేయాలి.
- సమగ్రశిక్ష వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల ఉద్యోగుల సహా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- 2004, జనవరి 5 కంటే ముందు నోటిఫికేషనిచ్చి తర్వాత నియమతులైన ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి.

ఇంటి భోజనానికి గుర్తింపు

నర్సంపేటలోని హోటల్‌కు భారత సర్కారు అవార్డు

నర్సంపేట, ఆగస్టు 12: వరంగల్ జిల్లా నర్సంపేట నడిబొడ్డున ఉప్పలయ్య అనే వ్యక్తి 30 ఏండ్ల నుంచి నడిపించిన హోటల్‌కు ఇప్పుడు భారత ప్రభుత్వ గుర్తింపు లభించింది. అక్కడ దొరికేది రుచికరమైన, నాణ్యమైన ఇంటి భోజనం. తక్కువ ధరలకే లాభాపేక్ష లేకుండా అందిస్తున్నారు. ఇల్లే హోటల్‌గా నడిపిస్తున్నారు. ఈ హోటల్‌కు భారత ప్రభుత్వం (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజినల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ ద్వారా అవార్డు వచ్చింది. సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌లో భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లారు. సోమవారం వారు మళ్లీ వచ్చి హోటల్‌లో ఇదే నాణ్యత కొనసాగించాలంటూ అవార్డును అందించారు. ఉప్పలయ్య మరణానంతరం అదే హోటల్‌ను ఆయన కుమారుడు శ్రీనివాస్ నడిపిస్తున్నారు. హోటల్‌లో కుటుంబ సభ్యులు మొత్తం వర్కర్లుగా ఉండి సొంతంగా వంటలు చేస్తారు. ఇక్కడ రోజూ 150 నుంచి 200 మంది భోజనం చేస్తున్నారు. సాదా భోజనానికి రూ.90 తీసుకుంటున్నారు. వెజ్, నాన్ వెజ్ కూడా ఉంటుంది.



వరంగల్ జిల్లా నర్సంపేటలోని హోటల్

అసైన్డ్ భూముల్లో వెంచర్

▸ మొదటిపేజీ తరువాయి...

పైగా అసైన్డ్, సీలింగ్ భూములను కొందరు చెరపట్టారు. బహిరంగంగానే వంద ఫీట్ల రహదారులు, ఇతరత్రా నిర్మాణాలు చేపడుతున్నారు. నెల రోజులుగా భారీ వెంచర్ పనులు దర్జాగా జరుగుతున్నా... రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం 'నోటీసులు ఇచ్చాం కదా!' అంటున్నారు. ఇదంతా రచ్చ జరుగుతుండటంతో సదరు వ్యక్తులకు రెవెన్యూ అధికారులే అధికారిక కబ్జాకు కొత్త మార్గాన్ని చూపుతున్నారు. రైతుల నుంచి పీవోటీ కింద భూములు సేకరించి... ఆ వ్యక్తులు ప్రభుత్వపరంగా కొనుగోలు చేసేందుకూ రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఉన్నారనే ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. మరి..పేదలకో న్యాయం? పెద్దోళ్లకు మరో న్యాయమా? అని సామాన్యుడు ప్రశ్నిస్తున్న ఈ కబ్జా బాగోతంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

గుట్టలను కరిగించి...

రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్-ఇబ్రహీంపట్నం మండలాల సరిహద్దున ఓ భారీ వెంచర్ రూపుదిద్దుకుంటుంది. వంద ఫీట్ల రహదారుల నిర్మాణమే కాకుండా పెద్ద పెద్ద గుట్టలను పిండి చేసి, చదును చేసేందుకు భారీ ఎత్తున యంత్రాలు కూడా మోహరించారు. సుమారు నెల రోజులకు పైగా అక్కడ పెద్ద ఎత్తున పనులు కొనసాగుతున్నాయి. తీరా.. ఆ భూములు ఏ పరిధిలోకి వస్తాయని ఆరా తీస్తే విస్మయకర అంశాలు వెలుగు చూశాయి. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబరు 189... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 281 పరిధిలోనే ఈ వెంచర్ తయారవుతుంది. ఇందులో నాగన్‌పల్లి పరిధిలోని భూములన్నీ ప్రభుత్వంతో పాటు పలువురు రైతులకు లావూనీ పట్టాల కింద పంపిణీ చేసినవిగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఇక.. అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని భూముల్లో కొంత మేర పట్టా భూమి కాగా.. మిగిలినదంతా సీలింగ్ పట్టా. అయినప్పటికీ అన్నింటినీ కలిపి దాదాపు 300 ఎకరాల్లో భారీ వెంచర్‌కు ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం నెల రోజులకు పైగా అక్కడ పెద్ద పెద్ద యంత్రాలతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

40-50 ఎకరాల్లో రోడ్డు, ఇతర నిర్మాణాలు...

ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబరు 189లో 179 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన పలువురు నిరుపేద రైతులకు వ్యవసాయం చేసుకునేందుకు భూమిని పంపిణీ చేసి లావణి పట్టాలు ఇచ్చారు. సదరు రియల్టర్లు చేస్తున్న వెంచర్‌కు వెళ్లాలంటే ఈ భూముల మీదుగానే వెళ్లాలి. దీంతో వెంచర్‌కు సంబంధించిన వ్యక్తులు రైతులతో రహస్యంగా ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. 99 సంవత్సరాల ప్రాతిపదికన లీజు ఒప్పందం చేసుకొని వారికి కొన్ని లక్షలు ముట్టజెప్పారు. ఇలా 40-50 ఎకరాల మేర లావణి పట్టా భూముల్ని ఒప్పందం చేసుకొని అందులో వంద ఫీట్ల రహదారుల నిర్మాణం చేపట్టారు. దీంతోపాటు సెక్యూరిటీ, ఇతరత్రా వాటి కోసం గదుల నిర్మాణాన్ని కూడా ప్రారంభించారు. తమకు ఎంత మేర భూమి కావాలనేది నిర్ధారించుకొని చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు ఇనుప రాడ్లనూ సరిహద్దుపై ఏర్పాటు చేశారు. దీనిపై గతంలోనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. లావూనీ పట్టా భూములను ఆయా రైతులు మాత్రమే సాగు చేసుకోవాల్సి ఉంటుంది. లేనట్లయితే ప్రభుత్వ స్వాధీనంలో ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులు రహస్యంగా వాటిని లీజు రాయించుకోవడంతో పాటు బహిరంగంగా నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. ఇప్పటికే కిలోమీటరుకు పైగా రహదారి నిర్మాణం కూడా పూర్తయింది. దీంతో రెవిన్యూ అధికారులు కొన్నిరోజుల కిందటే అక్కడికి వచ్చి విచారణ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఆ పనులు జరుగుతున్నాయని, ప్రభుత్వ భూమి కబ్జా అవుతుందని కిందిస్థాయి అధికారులు నివేదిక కూడా ఇచ్చారు. వాస్తవానికి వెంటనే అధికారులు రంగంలోకి దిగి పనులు నిలిపివేయాల్సి ఉండగా... కేవలం రైతులు, సదరు ప్రైవేటు సంస్థకు చెందిన రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అక్కడ యథేచ్ఛగా పనులు జరుగుతున్నా అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. మరోవైపు ఇబ్రహీంపట్నం మండలం అనాజీపూర్ గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 281లో దాదాపు 300 ఎకరాల వరకు భూములు ఉన్నాయి. ఇందులో కొంతమేర పట్టా ఉండగా... దాదాపు 80-100 ఎకరాల వరకు సీలింగ్ పట్టా భూములు ఉన్నాయి. దీంతో ఆ భూములను కూడా కలుపుకొని భారీ వెంచర్‌కు రంగం సిద్ధం చేశారు.

పెద్దల హస్తంతోనే పీవోటీ డ్రామా

నిరుపేద రైతులు వ్యవసాయం చేసుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను కొన్ని సందర్భాల్లో తిరిగి ప్రభుత్వం వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రజా ప్రయోజనాలతోపాటు ఆ భూముల్ని సదరు రైతులు దుర్వినియోగం చేసేందుకు ప్రయత్నించినపుడు అధికారులు పీవోటీ కింద సేకరిస్తారు. ఇక్కడ రైతులతో సదరు ప్రైవేటు సంస్థకు చెందిన వ్యక్తులు రహస్యంగా 99 సంవత్సరాల లీజు కొంద ఆ భూములను కొనుగోలు చేసినట్టు తెలిసింది. పైగా బహిరంగంగానే అసైన్డ్ భూముల్లో రహదారులు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో మీడియా, ఇతరులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. నోటీసులు ఇచ్చిన అధికారులు వాటి స్వాధీనానికి ప్రయత్నించినప్పటికీ.. ఈ వ్యవహారం వెనక ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఉండటంతో అధికారులు వెనక్కి తగ్గినట్టు విశ్వసనీయంగా తెలిసింది. స్థానికంగానైతే పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న వారితోపాటు వారి సోదరుల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని అధికారికంగానే చేసేందుకు పీవోటీ డ్రామా తెరపైకి తీసుకువస్తున్నట్టు తెలిసింది. రెవెన్యూ శాఖ అధికారులు పీవోటీ కింద రైతుల నుంచి ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటే... ప్రజా ప్రయోజనాల కోసమని సదరు ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వం నుంచి నామమాత్రపు రేటు ఆ భూముల్ని కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇందుకోసం అధికారుల సలహా, సహకారంతోనే భారీ స్కెచ్ వేసినట్టు తెలుస్తున్నది.



అనాజ్‌పూర్ గ్రామంలోని సర్వేనంబర్ 281లో గుట్టలను తొలగించిన దృశ్యం

నోటీసులు ఇచ్చాం...స్వాధీనం చేసుకుంటాం

ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 189లో గల ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేసినట్టు దృష్టికి వచ్చింది. ఈ భూమి అసైన్డ్ పొందిన రైతులకు, రియల్ ఎస్టేట్ సంస్థ యజమానులకు నోటీసులు ఇచ్చాం. గడువులోపు సరైన సమాధానం ఇవ్వకపోతే పీవోటీ కింద ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం. అనాజ్‌పూర్ గ్రామంలో కూడ సీలింగ్ పట్టాల క్రయ విక్రయాలపై కూడా విచారణ జరుపుతున్నాం. క్రయ విక్రయాలు జరిగినట్టు తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం.

– అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో

రాష్ట్రంలో హ్యుందాయ్ కార్ల మెగా టెస్ట్ సెంటర్

- వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు
- కొరియన్ కంపెనీలతో సీఎం రేవంత్ బృందం భేటీ
- త్వరలో తెలంగాణ రానున్న ఎల్ఎస్ కంపెనీ బృందం



దక్షిణ కొరియాకు చెందిన ఎల్ఎస్ గ్రూప్ చైర్మన్ కుజాయున్ బృందంతో సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): దక్షిణకొరియాకు చెందిన ఆటోమోటివ్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ తెలంగాణలో తమ వాహనాల మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించేందుకు ఆసక్తి వ్యక్తంచేసింది. పలు కొరియన్ కంపెనీలు వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తంచేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం తమ అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం దక్షిణ కొరియాకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు హ్యుందాయ్ మోటార్ కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. తెలంగాణలో కారు మెగా టెస్ట్ సెంటర్‌ను స్థాపించాలని కంపెనీ యోచిస్తున్నట్టు సీఎంవో కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీనిపై కంపెనీ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. దీంతోపాటు వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో యాంగాన్ చైర్మన్ కిహక్ సుంగ్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సోయాంగ్ సహా 25 భారీ జౌళి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు తెలంగాణలో టెక్స్‌టైల్ పరిశ్రమ అభివృద్ధికి ఉన్న సానుకూలతలను సీఎం వివరించగా.. పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ఆసక్తి కనబరిచాయి. దక్షిణ కొరియాలో అతి పెద్ద పారిశ్రామిక సంస్థ ఎల్ఎస్ కంపెనీ ప్రతినిధులు త్వరలో తెలంగాణలో పర్యటించనున్నారు. ఎల్ఎస్ గ్రూప్ చైర్మన్ కుజాయున్ బృందంతో సీఎం బృందం చర్చలు జరిపింది. సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం సియోల్‌లో పర్యటించనున్నది. బుధవారం ఉదయానికి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

విద్యార్థికి టీచర్ పనిష్మెంట్

జవాబు చెప్పలేదని కింద కూర్చోబెట్టిన టీచర్

ఎదులాపురం, ఆగస్టు 12: ఆదిలాబాద్ పట్టణం వెంకటరావు కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి సోమవారం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాడు. టీచర్ పనిష్మెంట్ ఇచ్చిందని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఎప్పటిలాగే తరగతులు జరుగుతున్నాయి. క్లాసులో టీచర్ సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రశ్నలు అడిగారు. జవాబు చెప్పని విద్యార్థిని పనిష్మెంట్ ఇచ్చి కింద కూర్చోబెట్టారు. దీనిని అవమానంగా భావించిన ఆ విద్యార్థి నేరుగా పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసుల ముందు తన గోడు వెల్లబోసుకున్నాడు. ఇంతలో సమాచారం తెలుసుకున్న విద్యార్థి తండ్రి హుటాహుటిన పోలీస్‌స్టేషన్ వచ్చి కుమారుడిని సముదాయించి ఫిర్యాదు చేయొద్దని తీసుకెళ్లాడు. దీంతో ఈ విషయం పాఠశాలలో, పోలీస్ స్టేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

గుండెపోటుతో టెన్త్ విద్యార్థిని మృతి

జ్యోతినగర్, ఆగస్టు 12: పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని సెయింట్‌క్లేర్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం సాహితి (15) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. బాలికకు రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ధన్వంతరి దవాఖానకు తరలించారు. నొప్పి ఎక్కువ కావడంతో వైద్యులు కరీంనగర్ దవాఖానకు రెఫర్ చేశారు. దీంతో అక్కడి నుంచి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. తండ్రి రాజలింగు రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగి.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

పెద్దవూర/ఆత్మకూరు/భూత్పూర్, ఆగస్టు 12: అప్పుల బాధలు భరించలేక రాష్ట్రంలో సోమవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అందులో ఒకరు నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి తండాకు, మరొకరు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన వారు ఉన్నారు. చింతపల్లి తండాకు చెందిన జటావత్ కృష్ణ (40) 5 ఎకరాలతోపాటు మరో మూడెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలను కాపాడుకునేందుకు ఇటీవల 8 బోర్లు వేయగా చుక్కనీరు పడలేదు. గతంలో పంట పెట్టుబడి కోసం రూ.10 లక్షల అప్పు చేశాడు. అవి తీరకపోవడంతో మనస్తాపం చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సాగర్‌లోని కమలానెహ్రూ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీరబాబు తెలిపారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన కడుదల సంపత్ (57)కు 4.30 ఎకరాల భూమి ఉంది. ఇందులో పత్తి వేయగా.. పంట పెట్టుబడి, ఇతర ఖర్చుల కోసం రూ.4 లక్షల అప్పు చేశాడు. నడుం నొప్పితో బాధపడుతూ.. వైద్యం కోసమూ అప్పులు చేస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. ఇంటి చుట్టుపక్కల వారు, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సంతోష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మరో రైతు మృతి

మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం మద్దిగట్లకు చెందిన రైతు మేకల లక్ష్మయ్య (62) ఆదివారం పొలం వద్ద నీరు పారించేందుకు బోరు మోటర్ వేసేందుకు స్టార్టర్ వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంట్ వైర్ కొద్దిగా తేలి ఉండగా గమనించకుండా ఆన్ చేసే క్రమంలో చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో రైతు కొడుకులు శివరాజ్, మల్లేశ్ పొలం వద్దకు వెళ్లి చూడగా.. అప్పటికే విగత జీవిగా కనిపించాడు. జిల్లా దవాఖానకు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

ఐఐటీ మద్రాస్ బెస్ట్

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఓవరాల్ క్యాటగిరీలో టాప్ ప్లేస్
- వరుసగా ఆరో ఏడాది అగ్రస్థానం
- బెస్ట్ యూనివర్సిటీగా ఐఐఎస్‌సీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: 'నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్' (ఎన్ఐఆర్ఎఫ్) తాజా ర్యాంకుల్లో ఐఐటీ-మద్రాస్ మరోమారు టాప్‌లో నిలిచింది. కేంద్ర విద్యాశాఖ పరిధిలోని 'ఎన్ఐఆర్ఎఫ్', దేశంలోని ఉన్నత విద్యాసంస్థల పనితీరు ఆధారంగా ఏటా వివిధ విభాగాల్లో టాప్-10 విద్యా సంస్థల పేర్లను విడుదల చేస్తున్నది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 10,885 విద్యా సంస్థల పనితీరును పరిశీలించి, 2024 ఏడాదికి ర్యాంకులను సోమవారం వెలువరించింది. 'ఓవరాల్', 'ఇంజినీరింగ్' రెండు విభాగాల్లోనూ వరుసగా ఆరోసారి ఐఐటీ-మద్రాస్ మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. 'ఓవరాల్' క్యాటగిరిలో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) రెండో స్థానంలో నిలవగా, యూనివర్సిటీల విభాగంలో ఐఐఎస్‌సీ వరుసగా 9వ సారి టాప్ ప్లేస్‌లో నిలిచింది.

ఓవరాల్‌గా.. టాప్-5

1.ఐఐటీ-మద్రాస్
2.ఐఐఎస్‌సీ-బెంగళూరు
3.ఐఐటీ-బాంబే
4.ఐఐటీ-ఢిల్లీ
5.ఐఐటీ-కాన్పూర్

టాప్-5- ఇంజినీరింగ్

1.ఐఐటీ-మద్రాస్
2.ఐఐటీ-ఢిల్లీ
3.ఐఐటీ-బాంబే
4.ఐఐటీ-కాన్పూర్
5.ఐఐటీ-ఖరగ్‌పూర్

టాప్-5- మేనేజ్‌మెంట్

1.ఐఐఎం-అహ్మదాబాద్
2.ఐఐఎం-బెంగళూరు
3.ఐఐఎం-కోజికోడ్
4.ఐఐఎం-ఢిల్లీ
5.ఐఐఎం-కలకత్తా

టాప్-5-మెడికల్

1.ఎయిమ్స్-ఢిల్లీ
2.పీజీఐఎంఈఆర్-చండీగఢ్
3.సీఎంసీ-వెల్లూర్
4.ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్-బెంగళూరు
5.జేఐపీజీఎంఈఆర్ -పుదుచ్చేరి

తెలంగాణ విద్యాసంస్థల డీలా

- గతేడాది కంటే తగ్గిన ర్యాంకులు
- ఉస్మానియా యూనివర్సిటీకి 70, జేఎన్టీయూహెచ్‌కు 88వ ర్యాంకులు
- ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఓయూకు 6వ స్థానం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు ఇచ్చే నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో తెలంగాణ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు వెనుకబడ్డాయి. చారిత్రక ఉస్మానియా వర్సిటీ, సాంకేతిక విద్యలో దేశంలోనే తొలి వర్సిటీ అయిన జేఎన్‌టీయూహెచ్‌ల ర్యాంకులు దిగజారాయి. ఇతర వర్సిటీలదీ అదే పరిస్థితి. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, కోర్సుల నాణ్యత, ప్లేస్‌మెంట్స్, ఆర్థిక వనరులు, పరిశోధన వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకులు కేటాయించారు. కేవలం తెలంగాణకు చెందిన మూడు సంస్థలు మాత్రమే దేశంలో పలు విభాగాల్లో టాప్-10 జాబితాలో నిలిచాయి. ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఐఐటీ హైదరాబాద్ 3వ ర్యాంకు. ఫార్మసీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(నైపర్) 2వ ర్యాంకు, న్యాయ విద్యాసంస్థల్లో నల్సార్ లా యూనివర్సిటీ 3వ ర్యాంకు సాధించాయి.

తగ్గిన ఓయూ, జేఎన్టీయూ ర్యాంకులు

ఓవరాల్ క్యాటగిరిలో ఉస్మానియా వర్సిటీకి 2023లో 64వ ర్యాంకు వస్తే, ఈసారి ఇది 70కి పడిపోయింది. విశ్వవిద్యాలయాల వారీగా నిరుడు 36 ర్యాంకు ఉంటే, ఈసారి 43కు పడిపోయింది. జేఎన్టీయూ హైదరాబాద్‌కు గత ఏడాది 83 ఉంటే, ఈసారి 88కు పడిపోయింది. ఐఐఐటీ హైదరాబాద్ ర్యాంకు మెరుగయ్యింది. గతంలో 84 ర్యాంకు రాగా, ఈసారి 74వ ర్యాంకు దక్కింది. కళాశాలల స్థాయిలో వందలోపు ఏ ఒక్క కళాశాలకూ చోటు దక్కలేదు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో ఈసారి కొత్తగా రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలు, స్కిల్ యూనివర్శిటీలు, ఓపెన్ యూనివర్శిటీలకు కూడా ర్యాంకులు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల విభాగంలో 50 యూనివర్శిటీలు పోటీపడగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 6వ స్థానం లభించింది.

రాష్ట్రంలోని ప్రధాన విద్యాసంస్థల ర్యాంకులు

ఓవరాల్ ర్యాంకులు..

సంస్థ	2023	2024
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	21	25
ఎన్ఐటీ వరంగల్	53	53
ఉస్మానియా యూనివర్సిటీ	64	70
ఐఐటీ హైదరాబాద్	14	12

ఇంజనీరింగ్ విద్యలో...

ఐఐటీ హైదరాబాద్	8	8
ఎన్ఐటీ వరంగల్	21	21
ట్రిపుల్ ఐటీ హైదరాబాద్	45	47
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	71	70
జేఎన్‌టీయూహెచ్	83	88
ఎస్ఆర్ యూనివర్సిటీ, వరంగల్	98	98



విశ్వవిద్యాలయాల వారీగా..

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	10	17
ఉస్మానియా యూనివర్సిటీ	36	43
ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్	84	74

వర్షపాతాన్ని కచ్చితంగా అంచనా వేసే టెక్నాలజీ

భువనేశ్వర్, ఆగస్టు 12: వర్షపాతాన్ని కచ్చితంగా అంచనావేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసినట్టు 'ఐఐటీ-భువనేశ్వర్' ప్రకటించింది. వెదర్ రిసెర్చ్, ఫోర్‌కాస్టింగ్ (డబ్ల్యూఆర్ఎఫ్) మోడల్‌లో వచ్చిన అవుట్‌పుట్‌ను డీప్ లెర్నింగ్ మోడల్‌తో అనుసంధానం చేయటం ద్వారా కొత్త సాంకేతికతను రూపొందించినట్టు ఓ ప్రకటనలో తెలిపింది. పెద్ద ఎత్తున వరదలు సంభవించే అస్సాం, భారీగా వర్షాలు కురిసే ఒడిశాలలో కొత్త టెక్నాలజీ పనితీరును అధ్యయనం చేసినట్టు తెలిపింది.

16న 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ప్రయోగం

బెంగళూరు, ఆగస్టు 12: ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఈవోఎస్-08 ప్రయోగం వాయిదా పడింది. ఆగస్టు 16న ఈ ప్రయోగాన్ని చేపడుతున్నట్టు ఇస్రో సోమవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. 175.5 కిలో గ్రాములున్న ఈ శాటిలైట్ అంతరిక్షంలో ఒక ఏడాది కాలం తన సేవల్ని అందిస్తుంది. భూమిపై శాటిలైట్ ఆధారిత నిఘా, విపత్తు, పర్యావరణ పర్యవేక్షణ, అగ్ని ప్రమాదాలు, పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్లలో విపత్తుల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని ఈవోఎస్-08 శాటిలైట్ అందిస్తుంది.

1.3 లక్షల మంది టెకీలపై వేటు!

- ఈ ఏడాది ఇప్పటి వరకు ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య ఇది
- ఐటీ రంగంలో ఆగని తొలగింపులు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగుల తొలగింపుల పర్వం కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,30,000 మందికి పైగా ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఈ లేఆఫ్‌ల ట్రెండ్ ఇప్పట్లో నెమ్మదించేలా కనిపించడం లేదు. ఆర్థికపరమైన సవాళ్లు, పోటీ ఒత్తిళ్లతో పాటు కొత్త మార్కెట్ మార్పులను అనుసరించాల్సి రావడం వంటివి ఉద్యోగుల తొలగింపునకు ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. లేఆఫ్స్.ఎఫ్‌వైఐ డాటా ప్రకారం ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 397 కంపెనీల్లో 1,30,482 మంది ఉద్యోగాలు పోయాయి. మరోవైపు పలు కంపెనీలు ఉద్యోగాల కోత బాటలో నడుస్తున్నాయి. మరో రౌండ్ లేఆఫ్‌లకు సిస్కో కంపెనీ సిద్ధమవుతున్నట్టు నివేదికలు వస్తున్నాయి. ఈ ఏడాది మొదట్లో చేపట్టిన 4 వేల ఉద్యోగాల కంటే ఈ దఫా అధికంగా కోతలు ఉండే అవకాశం ఉన్నదని రాయిటర్స్ నివేదించింది. సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి అధిక వృద్ధి ఉండే రంగాలపై దృష్టి సారించే వ్యూహంలో భాగంగా సిస్కో ఈ చర్య చేపడుతున్నట్టు తెలిసింది. జూలైలో ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకొనే ప్లాన్‌ను చిప్ తయారీ సంస్థ ఇంటెల్ ప్రకటించింది. 2025 నాటికి కంపెనీ స్థిరత్వం సాధించేందుకు వ్యయ తగ్గింపులో భాగంగా ప్రస్తుతం కంపెనీలో ఉన్న శ్రామిక శక్తిలో 15 శాతానికి పైగా అంటే 15,000 మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపే యోచనలో ఉన్నట్టు సమాచారం.



భారతీయ కంపెనీల్లోనూ..

మైక్రోసాఫ్ట్‌లో గత రెండు నెలల కాలంలో నిశ్శబ్దంగా దాదాపు వెయ్యి మందిని తొలగించినట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అన్అకాడమీ, వేకూల్ వంటి భారత కంపెనీలు లేఆఫ్‌ల బాటలో పయనిస్తున్నాయి. ఉద్యోగుల తగ్గింపునకు సంబంధించి ఆయా సంస్థలు ఇప్పటికే ప్రకటనలు చేశాయి. అన్అకాడమీ 250 మందిని, వేకూల్ 200 మందిని తొలగించనున్నట్టు ప్రకటించాయి. మరోవైపు ఐటీ ఇండస్ట్రీతో పాటు ఇతర రంగాల్లోనూ ఈ ట్రెండ్ కొనసాగుతున్నది. భారత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో దాదాపు 42,000 ఉద్యోగులకు ఉద్వాసన పలికారు.

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల తొలగింపు ఇలా..

	ఉద్యోగాల కోతలు	కంపెనీలు
2022	1.65 లక్షలు	1,065
2023	2.62 లక్షలు	1,190
2024	1.30 లక్షలు	397

సెబీ చీఫ్‌పై మరిన్ని ఆరోపణలు

- బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయని ఆమె బహిరంగంగా ఒప్పుకొన్నారు
- తన కన్సల్టింగ్ సంస్థల క్లయింట్ల వివరాలు వెల్లడించాలి
- మాధవి పురీ బచ్‌పై హిండెన్‌బర్గ్ మళ్లీ ఆరోపణలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: తమ ఆరోపణలు ఖండిస్తూ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురీ బచ్, ఆమె భర్త ధావన్ చేసిన సంయుక్త ప్రకటన పలు కొత్త సంక్లిష్ట ప్రశ్నలు లేవనెత్తుతున్నదని అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. మాధవి బచ్ స్పందన ద్వారా అనామక బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయన్న విషయాన్ని బహిరంగంగా ధ్రువీకరిస్తున్నారని పేర్కొన్నది. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని, సెబీ విశ్వసనీయతను దెబ్బతీయడంతోపాటు వ్యక్తిత్వ హననానికి ప్రయత్నిస్తున్నట్టు ఉన్నాయని సెబీ చీఫ్ మాధవి బచ్ ఆదివారం ప్రకటన విడుదల చేసిన కొద్ది గంటల తర్వాతనే హిండెన్‌బర్గ్ ఎక్స్‌లో వరుసగా పలు పోస్టులు పెట్టింది. వారి స్పందనలో పలు ముఖ్యమైన అంగీకారాలు ఉండటంతోపాటు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని పేర్కొన్నది. బెర్ముడా/మారిషస్ ఫండ్స్‌లో పెట్టుబడులను తన భర్త చిన్ననాటి స్నేహితుడు నడుపుతున్నాడని ఆమె ధ్రువీకరించారని, ఆయన ఆ సమయంలో అదానీ గ్రూపులో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారని వెల్లడించింది. భారత్‌తో పాటు సింగపూర్‌లోని ఆమె కన్సల్టింగ్ సంస్థలు డీల్ చేస్తున్న క్లయింట్ల వివరాలను స్పష్టంగా వెల్లడించాలని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది. 2024, మార్చి 31 నాటికి తాజా షేర్ హోల్డింగ్ లిస్టు ప్రకారం 2017లో తాను సెబీ సభ్యురాలిగా అయిన తర్వాత తన భర్త 2019లో టేకోవర్ చేసిన అగోరా అడ్వైజరీ లిమిటెడ్(ఇండియా)లో 99% మాధవి బచ్ పేరుపైనే ఉన్నాయని, ప్రస్తుతం ఈ సంస్థ యాక్టివ్‌గానే ఉన్నదని, లక్షల రూపాయల మేర కన్సల్టింగ్ ఆదాయం పొందుతున్నదని హిండెన్‌బర్గ్ తెలిపింది. అగోరా పార్ట్నర్స్ సింగపూర్‌లో 2022, మార్చి 16 వరకు 100% షేర్ హోల్డర్‌గా ఆమె ఉన్నారని పేర్కొన్నది. సెబీ చైర్‌పర్సన్‌గా నియమితులైన రెండు వారాల తర్వాత తనే తన షేర్లను భర్త పేరుపై బదిలీ చేశారని వెల్లడించింది. సెబీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు మాధవి బచ్ తన భర్త పేరుపై ఏ ఇతర వ్యాపారాల్లో ఉన్నారనే ప్రశ్నలు వస్తున్నాయని హిండెన్‌బర్గ్ పేర్కొన్నది.



జేపీసీ వేయకుంటే దేశవ్యాప్త ఆందోళనలు

సెబీ చీఫ్‌పై ఆరోపణలు తీవ్రమైన అంశమని, జేపీసీ దర్యాప్తునకు కేంద్రం అంగీకరించకుంటే దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హెచ్చరించారు. అదానీ గ్రూపునకు ప్రధాని మోదీ సహకరిస్తున్నారని ఆరోపించారు. మోదీ సర్కార్ చెప్పే 'అమృత్‌కాల్'లో ఏ సంస్థ కూడా పవిత్రంగా లేకుండా పోయిందని జైరాం రమేశ్ విమర్శించారు. అదానీ గ్రూపు ఆర్థిక అవకతవలపై దర్యాప్తు విషయంలో సెబీ రాజీపడినట్టు కనిపిస్తున్న క్రమంలో దర్యాప్తును సీబీఐ లేదా సిట్‌కు అప్పగించాలన్నారు. సెబీ సమగ్రతను పునరుద్ధరించేందుకు చైర్‌పర్సన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చే యత్నాలు

జేపీసీ వేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తిరస్కరించారు. భారత ఆర్థిక వ్యవస్థ బలహీనపడాలని, స్టాక్ మార్కెట్ పడిపోవాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని ఆరోపించారు. పెద్ద కుట్రలోనే భాగంగా హిండెన్‌బర్గ్ ఆరోపణలు, విపక్షాలు విమర్శలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, మోదీ సర్కార్‌ను అస్థిరపరిచే ప్రయత్నాల వెనుక హిండెన్‌బర్గ్‌లో ఇన్వెస్టర్‌గా ఉన్న బిలియనీర్ జార్జి సోరోస్ ఉన్నారని ఆరోపించారు.

ఓఎస్‌లో లోపాలు గుర్తిస్తే మిలియన్ డాలర్లు

ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్

న్యూఢిల్లీ: ఎవరికీ అన్యాయం చేయకుండా మిలియనీర్ కావాలనుకుంటున్నారా? ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ సరికొత్త బౌంటీ ఆఫర్ మీ కోసమే. మీరు చేయాల్సిందల్లా దాని ఆపరేటింగ్ సిస్టం (ఓఎస్)లోని అతిపెద్ద సమస్యను కనిపెట్టడమే. ఈ పనిని విజయవంతంగా చేస్తే మిలియన్ డాలర్లు మీ సొంతమవుతాయి. మొబైల్ సెక్యూరిటీ ప్రోగ్రాంలో భాగంగా శాంసంగ్ ఈ ఆఫర్‌ను ప్రకటించింది. డేటాను వెలికి తీయడం, పరికరాలను అన్‌లాక్ చేయడం, అనధికారిక అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేయడం వంటి భద్రతాపరమైన లోపాలతోపాటు ఓఎస్ దుర్బలత్వానికి సంబంధించిన సమస్యలను గుర్తించిన వారికి ఈ రివార్డు ఇవ్వనున్నట్టు శాంసంగ్ తెలిపింది. కనిపెట్టిన లోపం తీవ్రత ఆధారంగా రివార్డు ఉంటుంది. శాంసంగ్ హార్డ్‌వేర్ సెక్యూరిటీ సిస్టంలోని సరికొత్త నాక్స్ వాల్ట్ విజయవంతంగా హ్యాక్ చేయడం, రిమోట్ కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేయడం ద్వారా టాప్ ప్రైజ్ అయిన మిలియన్ డాలర్లు సొంతం చేసుకోవచ్చు. అలాగే, అన్‌లాక్ చేయడం, డేటాను దొంగిలించడం, గెలాక్సీ స్టోర్ నుంచి కాకుండా ఇతర సోర్సుల నుంచి యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం వంటి వాటికి కూడా అవార్డులు ప్రకటించింది.

దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

- హత్యాచార ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- రాష్ట్రాల్లో వైద్య సేవలకు అంతరాయం

కోల్‌కతా/న్యూఢిల్లీ, ఆగస్టు 12: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల రెసిడెంట్ డాక్టర్లు సోమవారం ఢిల్లీతో సహా దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో పలు రాష్ట్రాల్లోని దవాఖానల్లో పలు వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ఓపీ సేవలు, అత్యవసరం కాని సర్జరీలు నిలిచిపోయాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్, ఆర్‌ఎంఎల్ ఇతర ప్రభుత్వ దవాఖానల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. జూనియర్ డాక్టర్ల విధుల బహిష్కరణతో పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా దవాఖానల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. తమ సహచర వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి చేత నిష్పాక్షిక దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధితురాలి పోస్టుమార్టం నివేదికతోపాటు హత్యాచారం జరిగిన మెడికల్ కాలేజీ సెమినార్ హాల్ సమీపంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అన్ని దవాఖానల్లో వైద్యుల భద్రతకు కేంద్రం ప్రొటోకాల్ విడుదల చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది.



నాగర్‌కర్నూల్‌లో జూడాల కొవ్వొత్తుల ర్యాలీ

ఆదివారానికి పరిష్కరించకుంటే సీబీఐకి

వచ్చే ఆదివారం నాటికి పోలీసులు కేసును పరిష్కరించలేకుంటే కేసును సీబీఐకి బదిలీ చేస్తామని సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. సోమవారం బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులకు మరణశిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా, బాధితురాలు ఆత్మహత్య చేసుకుని మరణించిందని తొలుత దవాఖాన అసిస్టెంట్ సూపరింటెండెంట్ బాధితురాలి కుటుంబానికి ఫోన్ చేసి తెలిపినట్టు తెలిసింది. దీంతో అతడిని పోలీసులు విచారణకు పిలిచారు.

నీకు కూడా అలాగే జరుగుతుంది..

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌కు ఏం జరిగిందో నీకూ అదే జరుగుతుందని శుక్రవారం రాత్రి బెంగాల్‌లోని పుర్బ బర్ధమాన్ జిల్లాలో ఓ పౌర వలంటీర్ ఓ ప్రభుత్వ దవాఖాన వైద్యురాలిని బెదిరించడం సంచలనంగా మారింది.

గూగుల్ సర్వీసుల్లో అంతరాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో సోమవారం గూగుల్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. జీమెయిల్, సెర్చ్, గూగుల్ డ్రైవ్, యూట్యూబ్ ఇతర సర్వీసులు నిలిచిపోయాయంటూ గూగుల్ యూజర్లు ఫిర్యాదులు చేశారు. అమెరికాలో ఉదయం 9 గంటలకు గూగుల్ సర్వీసులు ప్రభావితమైనట్టు తెలుస్తున్నది. సర్వీసులు నిలిచిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. లాస్ఏంజెల్స్, న్యూయార్క్ సిటీలో సర్వీసుల అంతరాయం ఎక్కువగా జరిగినట్టు డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ మ్యాప్ పేర్కొన్నది. ఈ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో వచ్చే అంతరాయాలను పర్యవేక్షిస్తుంటుంది. గూగుల్ సేవల అంతరాయానికి సంబంధించి అమెరికా, యూకే, ఐరోపా, ఆసియా, దక్షిణ అమెరికా దేశాలకు చెందిన యూజర్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులు పెట్టారు. కొంత సేపటికే సర్వీసులు యథాతథంగా పనిచేస్తున్నాయని కొంత మంది పేర్కొన్నారు. కాగా, ఈ అంతరాయానికి సంబంధించి గూగుల్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల క్రౌడ్ స్ట్రైయిక్ కారణంగా విండోస్‌లో తీవ్ర సమస్య తలెత్తిన నేపథ్యంలో తాజాగా గూగుల్ సమస్య ఎదురుకావడం గమనార్హం.



టీటీడీకి 21 కోట్ల విరాళం

తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానానికి పంజాబ్ పారిశ్రామికవేత్త రాజిందర్ గుప్తా భారీ విరాళం ఇచ్చారు. టీటీడీ ఆదివారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ప్రాణాంతక వ్యాధులతో బాధపడే పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించే ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు ఆయన రూ.21 కోట్లు విరాళం ఇచ్చారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి చెక్కును అందజేశారు. టీటీడీ నిర్వహిస్తున్న దవాఖానలు, ప్రసూతి దవాఖానల్లో ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ పథకం అందుబాటులో ఉంది.

బ్రాడ్‌కాస్టింగ్ బిల్లుపై వెనక్కుతగ్గిన కేంద్రం

సంప్రదింపుల తర్వాత కొత్త ముసాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రసార సేవల నియంత్రణ బిల్లుపై కేంద్రం వెనక్కు తగ్గింది. ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న ముసాయిదాపై డిజిపబ్, ఎడిటర్స్ గిల్డ్ వంటి సంస్థల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఈ ముసాయిదా తయారీలో డిజిటల్ మీడియా సంస్థలు, సామాజిక సంస్థలను సంప్రదించలేదని ఆరోపించాయి. దీంతో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సోమవారం కీలక ప్రకటన చేసింది. ముసాయిదాపై అక్టోబరు 15 వరకు సంప్రదింపులు జరుపుతామని, సూచనలు తీసుకుంటామని ప్రకటించింది. సంప్రదింపుల తర్వాత కొత్త ముసాయిదాను ప్రచురిస్తామని పేర్కొన్నది. కాగా, ఈ ముసాయిదా డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ద్వారా వార్తల ప్రసారంపై ఆంక్షలు విధించేలా, ఇండిపెండెంట్ జర్నలిస్టుల గొంతు నొక్కేలా ఉందనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.

2036 నాటికి స్త్రీ, పురుష నిష్పత్తి మెరుగుదల

న్యూఢిల్లీ: మన దేశంలో స్త్రీ, పురుష సమానత్వంలో ఆశాజనక ధోరణి కనిపిస్తున్నదని కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. 2036నాటికి ప్రతి 1,000 మంది పురుషులకు 952 మంది మహిళలు ఉంటారని అంచనా వేసింది. 2011నాటి లెక్కల ప్రకారం, ప్రతి వెయ్యి మంది పురుషులకు 943 మంది మహిళలు ఉండేవారని తెలిపింది. 2011నాటి జనాభాలో మహిళల సంఖ్యతో పోల్చితే, 2036లో ఎక్కువ మంది మహిళలు ఉంటారని అంచనా వేసింది. 2011నాటి జనాభాలో 48.5 శాతం మంది మహిళలు ఉన్నారని, 2036నాటికి జనాభా 152.2 కోట్లకు చేరుతుందని, దీనిలో మహిళల జనాభా 48.8 శాతానికి పెరుగుతుందని వివరించింది. 15 ఏళ్ల లోపు బాలల సంఖ్య 2011లో కన్నా 2036లో తగ్గుతుందని, సంతానోత్పత్తి తగ్గడమే దీనికి కారణమని పేర్కొంది.

బీహార్ గుడిలో తొక్కిసలాట

ఏడుగురి మృతి

జహనాబాద్: బీహార్‌లోని జహనాబాద్ జిల్లాలో ఉన్న బాబా సిద్ధేశ్వర్ నాథ్ దేవాలయంలో ఆదివారం రాత్రి 11.30 గంటలకు తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మహిళలు సహా ఏడుగురు మరణించగా, 16 మంది గాయపడ్డారు. వీరిలో అత్యధికులు కన్వర్ భక్తులని జిల్లా కలెక్టర్ అలంకృత పాండే తెలిపారు. దేవాలయంలోని భద్రతా సిబ్బంది సత్వరమే స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారని చెప్పారు.

రాకాసిని పారదోలారు

విద్యార్థుల విప్లవం ఇది: యూనస్

ఢాకా: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న మహమ్మద్ యూనస్, ఆ దేశంలో విద్యార్థుల నిరసనలపై ప్రశంసలు కురిపించారు. మాజీ ప్రధాని షేక్ హసీనాను రాకాసితో పోల్చారు. 'విద్యార్థులు దేశంలో తెచ్చిన విప్లవంతో రాకాసిని పారదోలారు. మీరు (విద్యార్థులు) సాధించింది అసమాన్యమైంది. మీరంటే నాకెంతో గౌరవం. అందుకే మీ ఆదేశాలను పాటించా'అని యూనస్ అన్నారు. మరోవైపు, దేశం విడిచి వెళ్లిన మాజీ ప్రధాని షేక్ హసీనాను తిరిగి స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

అణువిద్యుత్తు కేంద్రంపై ఉక్రెయిన్ దాడి!

- జపోరిజియా ప్లాంట్‌లో తప్పిన పెను ప్రమాదం
- ప్రస్తుతం మూసేసి ఉన్న కేంద్రం
- రష్యానే దాడి చేసుకుందన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రం



మాస్కో, ఆగస్టు 12: రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. తమ నియంత్రణలోని జపోరిజియా అణువిద్యుత్తు కేంద్రంపై ఉక్రెయిన్ దాడి చేసిందని రష్యా ఆరోపించింది. కేంద్రంలోని కూలింగ్ వ్యవస్థ ఉన్న ప్రాంతంలో ఉక్రెయిన్ మానవరహిత వైమానిక వాహనం(యూఏవీ) ఆదివారం రాత్రి దాడి చేయడంతో మంటలు వ్యాపించినట్టు రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. ఈ దాడికి పాల్పడి ఘోరమైన తప్పు చేసిన వారి పేరును ప్రకటించాల్సిందిగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ)ను రష్యా పట్టుబట్టనున్నట్టు పేర్కొన్నది. కాగా, పలు పేలుళ్ల తర్వాత అణువిద్యుత్తు కేంద్రంలోని వాయవ్య ప్రాంతం నుంచి దట్టమైన పొగ రావడం తమ నిపుణులు చూసినట్టు ఐఏఈఏ సైతం ధృవీకరించింది. కాగా, ప్రస్తుతం ఈ కేంద్రంలోని ఆరు యూనిట్లు మూసేసి ఉన్నందున పెను ప్రమాదం తప్పిందని ఈ కేంద్రం కమ్యూనికేషన్స్ డైరెక్టర్ యెవ్జెనియా యషిన తెలిపారు. కాగా, ఉక్రెయిన్‌ను బ్లాక్‌మెయిల్ చేయడానికి రష్యానే ఈ దాడి ఉద్దేశపూర్వకంగా చేసుకుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు.


సురక్షిత ప్రాంతాలకు సరిహద్దు ప్రజలు

ఉక్రెయిన్ సరిహద్దున ఉన్న రష్యాలోని బెల్గోరడ్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను రష్యా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నది. సురక్షిత ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేశామని, వెంటనే ప్రజలు అక్కడకు చేరుకోవాలని స్థానిక ప్రభుత్వం ప్రజలకు తెలిపింది.

ధూళితో మార్స్‌ని వేడెక్కించి..!

నివాసయోగ్యంగా మార్చేందుకు శాస్త్రవేత్తల ప్రణాళిక

న్యూయార్క్: మానవులు నివసించేందుకు అంగారక గ్రహం కొంత అనువుగా ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ సైతం 2050 నాటికి అంగారకుడిని నివాసయోగ్యంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఈ గ్రహంపై విపరీతంగా ఉండే చలి వాతావరణం ఈ ఆలోచనలకు సవాల్ విసురుతున్నది. ఈ నేపథ్యంలో అమెరికాలోని నార్త్‌వెస్టర్న్, గ్లాస్గో యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు ఓ వినూత్న ప్రతిపాదన చేశారు. అంగారకుడిని వేడి చేసి, అక్కడి వాతావరణాన్ని మానవులు నివసించేందుకు అనుకూలంగా మార్చవచ్చని అంటున్నారు. అంగారకుడిపై ఉండే ధూళిని పెద్ద ఎత్తున వాతావరణంలోకి పంపించడం ద్వారా ఈ గ్రహానికి వేడిని గ్రహించే శక్తి పెరుగుతుందని వీరు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఎలాగైతే భూమికి నీటి ఆవిరి, కార్బన్ డయాక్సైడ్ పని చేస్తుందో, అలాగే అంగారకుడిపై అక్కడి ధూళిని వాతావరణంలోకి పంపించడం ద్వారా వేడి చేయవచ్చని తెలిపారు. ఇనుము, అల్యూమినియంతో కూడిన ధూళిని ఒక సెకనుకు 10 లీటర్ల చొప్పున వాతావరణంలోకి పంపించడం ద్వారా ఒక దశాబ్దంలో -85 ఫారన్‌హీట్ డిగ్రీల నుంచి 86 ఫారన్‌హీట్ డిగ్రీలకు అంగారకగ్రహంపై ఉష్ణోగ్రతను మార్చవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం ఏడాదికి 2 కోట్ల టన్నుల ధూళి కణాలు కావాలని, వీటికి కావాల్సిన ముడి పదార్థాలు అంగారకుడిపైనే దొరుకుతాయి కాబట్టి సులువుగా తయారుచేయవచ్చని తెలిపారు.





ఏథెన్స్‌ను కమ్మేసిన కార్చిచ్చు

ఏథెన్స్ (గ్రీస్), ఆగస్టు 12: గ్రీస్ రాజధాని ఏథెన్స్‌ను కార్చిచ్చు చుట్టుముట్టింది. భారీ స్థాయిలో మంటలు నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో ఏథెన్స్‌లోని ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి.. మంటలను ఆర్పేందుకు 500 మంది అగ్నిమాపక సిబ్బందిని మోహరించారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమైన కార్చిచ్చు.. 20 గంటలు గడిచినా అదుపులోకి రావటం లేదు. ఇప్పటికే 150కిపైగా అగ్నిమాపక యంత్రాలు, 30 వరకు నీళ్లు చిమ్మే విమానాలను రంగంలోకి దించారు. పొగకు చాలామంది అస్వస్థతకు గురై దవాఖానల్లో చేరారు. బలమైన గాలులు వీయటంతో మంటలు వేగంగా ఏథెన్స్‌ను సమీపిస్తున్నాయని ఆ దేశ మంత్రి వాసిలిస్ కికిలియాస్ వెల్లడించారు. ఒక్కోచోట మంటలు 90 అడుగుల ఎత్తుతో దూసుకొస్తున్నాయని వివరించారు. 2018లోనూ ఇలాంటి కార్చిచ్చే గ్రీస్‌లో అల్లకల్లోలం రేపింది. ఆ సమయంలో సముద్ర తీరంలో ఉన్న మాటి నగరం మొత్తం బూడిదైపోయింది. దాదాపు వంద మందికి పైగా మరణించారు. గ్రీస్ వాతావరణం వేడిగా ఉండటం వల్ల ఇక్కడ కార్చిచ్చు సాధారణం అయిపోయింది.



హిండెన్‌బర్గ్-2 దెబ్బ

నష్టాల్లో అదానీ గ్రూప్ షేర్లు | మెజారిటీ స్టాక్స్ డీలా

ఒక దశలో రూ.1.13 లక్షల కోట్ల సంపద ఆవిరి • సెబీ చీఫ్ రహస్య పెట్టుబడుల కలకలం

ముమ్మందు మరిన్ని భారతీయ సంస్థలపై అమెరికా షార్ట్-సెల్లర్ల గురి?

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశీయ స్టాక్ మార్కెట్లలో అదానీ గ్రూప్ షేర్లు మరోమారు మూకుమ్మడిగా కుప్పకూలాయి. శనివారం మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ దంపతులపై అమెరికా షార్ట్-సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో సోమవారం ఈక్విటీ మార్కెట్లు షేక్ అయ్యాయి. ఈ క్రమంలోనే ఆరంభంలో భారీ నష్టాల దిశగా సూచీలు పయనించాయి. అదానీ గ్రూప్‌నకు చెందిన 10 సంస్థల షేర్లు పెద్ద ఎత్తున క్షీణించాయి. ఫలితంగా అదానీ గ్రూప్ మార్కెట్ విలువ ఒక్కసారిగా దాదాపు రూ.1.13 లక్షల కోట్లు (13.4 బిలియన్ డాలర్లు) హరించుకుపోయింది. అయితే సమయం గడుస్తున్నకొద్దీ అటు సూచీలు, ఇటు షేర్లు తిరిగి కోలుకున్నాయి. అయినప్పటికీ మెజారిటీ షేర్లు నష్టాలకే పరిమితం కావడం గమనార్హం. అంబుజా సిమెంట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ స్వల్పంగా లాభపడ్డాయి. మిగతా 8 షేర్లు 4.14 శాతం నుంచి 0.65 శాతం మేర దిగజారాయి. దీంతో ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు రూ.22,064 కోట్ల నష్టం వాటిల్లింది. ఇక మొత్తంగా చూసినట్టైతే బీఎస్ఈలోని 11 అదానీ గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లపైనే. కాగా, సెబీ చీఫ్ మాధవి పురి, ఆమె భర్త ధవల్ బచ్.. బెర్ముడా, మారిషస్‌ల్లోని ఫండ్లలో పెట్టుబడులు పెట్టారని, అవి అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ కనుసన్నల్లో నడుస్తున్నవంటూ హిండెన్‌బర్గ్ ఓ 'విజిల్‌బ్లోయర్' డాక్యుమెంట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ అక్రమాలపై సెబీ విచారణ తూతూ మంత్రంగా సాగిందని ఆరోపించిన సంగతీ విదితమే. అయితే వీటిని ఆదివారం బచ్ దంపతులు కొట్టిపారేశారు. అదానీ గ్రూప్ సైతం వీరితో తమకెలాంటి వాణిజ్య సంబంధాల్లేవని స్పష్టం చేసింది. గత ఏడాది జనవరిలో అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడిందంటూ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన నివేదిక.. భారతీయ స్టాక్ మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టించినది తెలిసిందే. అదానీ కంపెనీల మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్లకుపైగా పడిపోయింది.

భారతీయ సంస్థలపైనే గురి?

ఏడాదిన్నర క్రితం అదానీ గ్రూప్ ప్రధాన లక్ష్యంగా తొలి రిపోర్టును విడుదల చేసిన హిండెన్‌బర్గ్.. ఇప్పుడు దానికి కొనసాగింపుగా రెండో నివేదికను తెచ్చింది. ఈ నేపథ్యంలో ఈ తరహా రిపోర్టులు మరిన్ని భారతీయ సంస్థలపై రావచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. హిండెన్‌బర్గ్ వంటి ఇంకొందరు అమెరికా షార్ట్-సెల్లర్లు ఈ దిశగా రిసెర్చ్ చేస్తున్నారన్న అభిప్రాయాలను వారు వెల్లడిస్తుండటం సర్వత్రా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. మొత్తానికి భారతీయ సంస్థలపైనే షార్ట్-సెల్లర్ల గురి ఉందన్నది స్పష్టంగా తెలుస్తున్నది. దీంతో బడా కార్పొరేట్ కంపెనీల్లో ప్రకంపనలు మొదలవుతున్నాయి. మార్కెట్ అక్రమాలు, డొల్ల కంపెనీలు, నిధుల గోల్‌మాల్, కేంద్ర ప్రభుత్వ పెద్దలు-ఉన్నతాధికారుల హస్తం అన్నింటిపైనా షార్ట్-సెల్లర్లు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

స్వల్ప నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 56.99 పాయింట్లు పడిపోయి 79,648.92 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 20.50 పాయింట్లు కోల్పోయి 24,347 వద్ద స్థిరపడింది. అయితే ఒకానొక దశలో సెన్సెక్స్ 479.78 పాయింట్లు, నిఫ్టీ 155.40 పాయింట్లు దిగజారాయి. సెన్సెక్స్ షేర్లలో అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, ఎస్బీఐ, నెస్లే షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. రంగాలవారీగా యుటిలిటీస్, ఎఫ్ఎంసీజీ నిరాశపర్చాయి. ఆసియా మార్కెట్లలో కొరియా, హాంకాంగ్ లాభాల్లో, చైనా నష్టాల్లో ముగిశాయి.

రిస్క్‌లో ఎంఎఫ్ పెట్టుబడులు!

అదానీ సంస్థల్లోకి రూ.42వేల కోట్లు

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణల నేపథ్యంలో అదానీ గ్రూప్ సంస్థల షేర్లలో వివిధ మ్యూచువల్ ఫండ్స్ పెట్టిన పెట్టుబడులు ప్రమాదంలో పడ్డాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయిప్పుడు. ముఖ్యంగా రిటైల్ మదుపరుల్లో టెన్షన్ మొదలైంది. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన మొత్తం 11 అదానీ గ్రూప్ సంస్థల్లో ఎన్డీటీవీ మినహా మిగతా 10 కంపెనీల్లో మ్యూచువల్ ఫండ్స్ ద్వారా జరిగిన పెట్టుబడులు వాల్యూ రిసెర్చ్ వివరాల ప్రకారం ఈ ఏడాది జూలై ఆఖరు నాటికి రూ.41,814 కోట్లుగా ఉన్నాయి. అయితే టాప్-5 సంస్థల్లోని పెట్టుబడులే రూ.41వేల కోట్లుగా ఉండటం గమనార్హం. ఇందులో అత్యధికంగా అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో రూ.13,024 కోట్ల మేర ఉన్నాయి. అత్యల్పంగా సంఘీ ఇండస్ట్రీస్ రూ.5.95 కోట్లుగా ఉన్నాయి.

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు	విలువ (రూ.కోట్లలో)
అదానీ పోర్ట్స్	13,024.22
అంబుజా సిమెంట్స్	8,999.25
ఏసీసీ	7,668.38
అదానీ ఎంటర్‌ప్రైజెస్	7,290.63
అదానీ పవర్	4,027.77



బీఎస్ఈలో అదానీ షేర్ల నష్టాలు (%)

సంస్థ	ఆరంభంలో	ముగింపులో
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	17	3.70
అదానీ టోటల్ గ్యాస్	13.39	4.03
ఎన్డీటీవీ	11	3.08
అదానీ పవర్	10.94	0.65
అదానీ గ్రీన్ ఎనర్జీ	6.96	1.12+
అదానీ విల్మర్	6.49	4.14
అదానీ ఎంటర్‌ప్రైజెస్	5.50	1.09
అదానీ పోర్ట్స్	4.95	2.02
అంబుజా సిమెంట్స్	2.53	0.55+
ఏసీసీ	2.42	1.55

'వాణిజ్య దౌత్యవేత్తలు కీలకం'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ మార్కెట్‌లో వాణిజ్య దౌత్యవేత్తల పాత్ర కీలకంగా మారిందని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో 'విదేశీ వాణిజ్యం-పెట్టుబడులు' అంశంపై ఓ అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ నెల 30దాకా జరిగే ఈ కార్యక్రమానికి ఈజిప్టు నుంచి 14 మంది అగ్రశ్రేణి దౌత్యవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ.. గ్లోబల్ మార్కెట్‌లో తాజా పోకడలు నిపుణుల అవసరాన్ని పెంచుతున్నాయన్నారు. దేశాల మధ్య దౌత్య, రాజకీయ సంబంధాలను పెంపొందించడంలో భౌగోళిక, వ్యూహాత్మక పరిస్థితులూ ప్రధానమేనన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ హెడ్ డాక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

బీటీలో భారతీ గ్లోబల్‌కు 24.5% వాటా

డీల్ విలువ రూ.33,500 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బ్రిటన్‌కు చెందిన బహుళజాతి టెలికం సంస్థ బీటీ గ్రూప్‌లో సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన భారతీ గ్లోబల్‌కు 24.5 శాతం వాటా దక్కుతున్నది. డీల్ విలువ దాదాపు రూ.33,500 కోట్లు (4 బిలియన్ డాలర్లు). కాగా, బీటీ గ్రూప్‌లోని ఆల్టీస్ నుంచి 9.99 శాతం వాటాను వెంటనే కొనేస్తున్న భారతీ.. మిగతా వాటాను రెగ్యులేటరీ అనుమతులు వచ్చాక సొంతం చేసుకోనున్నది. అధిక రుణ భారం నేపథ్యంలోనే ఈ వాటాను ఆల్టీస్ అమ్ముకుంటున్నది. ఇదిలావుంటే టాటా, మహీంద్రా, వెల్‌స్పన్ తర్వాత బ్రిటీష్ సంస్థల్లో వాటాలను పొందిన భారతీయ సంస్థగా భారతీ ఎంటర్‌ప్రైజెస్ నిలిచింది.

5 నెలల కనిష్టానికి ఐఐపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ జూన్‌లో 5 నెలల కనిష్టాన్ని తాకుతూ 4.2 శాతంగానే ఉన్నది. జనవరి తర్వాత ఇప్పుడే ఆ స్థాయి గణాంకాలు నమోదయ్యాయని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. ఇక గనులు, విద్యుత్తు రంగాలు బాగున్నా.. కీలకమైన తయారీ రంగం నెమ్మదించింది.

జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.54%

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల ఐదేండ్ల కనిష్టానికి తగ్గింది. జూలైలో 3.54 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్‌వో ప్రకటించింది. 2019 సెప్టెంబర్‌లో 3.99 శాతంగా నమోదైంది. మళ్లీ ఇప్పుడే ఆ స్థాయి కంటే తక్కువకు చేరింది. ఇక అంతకుముందు నెల జూన్‌లో ఈ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం రేటు 5.08 శాతంగా ఉండగా, నిరుడు జూలైలో 7.44 శాతంగా ఉన్నది. ఆహార ద్రవ్యోల్బణం కొంతమేర అదుపులోకి రావడం కలిసొచ్చింది. మరోవైపు తాజా గణాంకాలతో ఆర్బీఐ రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లను తగ్గిస్తుందన్న ఆశలు చిగురిస్తున్నాయి.

డిపాజిట్ వాపస్

ముంబై, ఆగస్టు 12: డిపాజిట్ చేసిన 3 నెలల్లోగా అత్యవసర పరిస్థితి అంటూ డిపాజిటర్లు వస్తే ఆ మొత్తాన్నీ వెనక్కి ఇచ్చేయాల్సిందేనని ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్బీఐ సోమవారం స్పష్టం చేసింది. అయితే వడ్డీ చెల్లింపులుండవు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది.

పీఎన్‌బీ బ్రెయిలీ కార్డ్

పీఎన్‌బీ.. అంతః దృష్టి బ్రెయిలీ డెబిట్ కార్డును అందుబాటులోకి తెచ్చింది. చూపు లేని వారికోసం దీన్ని పరిచయం చేసింది. రూపే నెట్‌వర్క్‌పై ఇది లభిస్తుంది.

అప్‌ట్రెండ్‌లో బంగారం-వెండి

- **4 రోజుల్లో తులం రేటు రూ.1,310 పైకి**

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.270 ఎగిసి రూ.70,580ని తాకింది. 22 క్యారెట్ రూ.250 ఎగబాకి రూ.64,700గా నమోదైంది. దీంతో గడిచిన నాలుగు రోజుల్లో తులం మేలిమి పుత్తడి ధర రూ.1,310 పెరిగినట్టైంది. ఆభరణాల పసిడి సైతం రూ.1,200 పుంజుకున్నది. ఇక ఢిల్లీలో 99.9 స్వచ్ఛత కలిగిన గోల్డ్ రేటు రూ.200 పుంజుకొని రూ.72,350గా ఉన్నది. 99.5 స్వచ్ఛతతో ఉన్నది రూ.72,000గా నమోదైంది. ఇదిలావుంటే వెండి ధర రూ.1,000 అందుకుని రూ.83,500ను చేరింది.



హైదరాబాద్‌లో రూ.87,500 పలికింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు గోల్డ్ రేటు 8.40 డాలర్లు పెరిగి 2,481.80 డాలర్లుగా ఉన్నది. ఔన్సు వెండి 28.01 డాలర్లుగా నమోదైంది. కొనుగోలుదారులు, ఆభరణాల తయారీదారుల నుంచి పెరిగిన డిమాండే ధరలను పరుగులు పెట్టిస్తున్నాయని మార్కెట్ వర్గాలు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు.



జహీరాబాద్ ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్



ఫార్మాసిటీకి భూములు ఇవ్వబోమని తెగేసి చెప్తున్న మహిళా రైతులు

ఇంద్రకీలాద్రిపై 23న వరలక్ష్మి వ్రతాలు


ఆర్జిత సేవా టికెట్ 1,500 • తెల్లరేషన్‌కార్డు ఉంటే ఉచితం:ఈవో

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ఏపీలోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 23న సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రామరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రూ.1,500 ఆర్జితసేవా టికెట్ ఉన్న భక్తులతో వ్రతం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తెల్లరేషన్ కార్డు కలిగి ముందస్తు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా వ్రతాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొనే మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరుబాట

- న్యాల్‌కల్‌లో రైతులకు తెలియకుండా భూసర్వే
- అక్రమంగా భూములు గుంజుకుంటే ఊరుకోం
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్
- బాధిత రైతులకు సంఘీభావం

న్యాల్‌కల్, ఆగస్టు 12: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీకి వ్యతిరేకంగా రైతుల పక్షాన పోరాడుతామని జహీరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ భరోసా ఇచ్చారు. నిమ్జ్‌లో భాగంగా వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమానికి వారు మద్దతు తెలిపి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే న్యాల్‌కల్ మండలాన్ని నిమ్జ్ పారిశ్రామిక ప్రాంతం పేరుతో నాశనం చేశారని ధ్వజమెత్తారు. మళ్లీ కొత్తగా 2,000 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు భూములను గుంజుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా భూసర్వే చేపట్టి రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు, రైతులకు అండగా ఉండి వారి పక్షాన ఫార్మాసిటీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం ఫార్మాసిటీలో కోల్పోతున్న రైతుల భూములను పరిశీలించారు. ఫార్మాసిటీని ఏర్పాటు చేయవద్దని కోరుతూ జహీరాబాద్ ఆర్డీవో రాజుకు రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు నారాయణ, రవీంద ర్, నాయకులు రవికుమార్, సుభాశ్‌గుప్తా, నర్సింహారె డ్డి, విజయ్‌కుమార్, గుండప్ప, సంగ్రాంపటేల్, శ్రీకాంత్‌రెడ్డి, మారుతీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సన్‌ఫ్లవర్ విత్తనాలు, మొక్కలు

హెక్టార్‌కు 1,800 కిలోల దిగుబడి

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 12: స్వల్ప పెట్టుబడి, నీటి వినియోగంతో అధిక దిగుబడినిచ్చే రెండు కొత్త రకాల పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) వంగడాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఐఎస్ఎస్-300, ఐఎస్ఎఫ్-15 పేరుతో వీటిని డాక్టర్ జీడీ సతీశ్ కుమార్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం కనుగొన్నది. ఐసీఏఆర్-ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ మాధూర్ సోమవారం తన చాంబర్‌లో వీరిని అభినందించారు. ఐఎస్ఎస్-300 రకం హెక్టార్‌కు దాదాపు 1,800 కిలోల దిగుబడినిస్తుంది. దీనిలో 38% వరకు నూనె ఉంటుందని వివరించారు.

తమిళనాడులో బీఆర్ఎస్ బృందం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సోమవారం తమిళనాడులో పర్యటించింది. బాల్క సుమన్ నేతృత్వంలోని బృందం చెన్నైలోని డీఎంకే ప్రధాన పార్టీ కార్యాలయంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, మాజీ ఎమ్మెల్యే శేఖర్‌తో భేటీ అయ్యారు. డీఎంకే పార్టీ నిర్మాణం, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ విధివిధానాలు, ప్రస్తుత రాజకీయాల్లో ఆ పార్టీ ఎంచుకున్న మార్గాలు, సిద్ధాంతలపై సుదీర్ఘంగా చర్చించారు. రెండు రోజులపాటు తమిళనాడులోని పలు జిల్లాల్లో డీఎంకే పార్టీ కార్యాలయాలను సందర్శించను న్నారు. బీఆర్ఎస్ బృందంలో ఆంజనేయగౌడ్, తుంగ బాలు, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చెన్నైలోని డీఎంకే కార్యాలయంలో బీఆర్ఎస్ బృందం

అంతరాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ల అరెస్ట్

14 కోట్ల విలువైన 13.5 కిలోల హషీష్ ఆయిల్ స్వాధీనం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ఏపీ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు పెద్ద మొత్తంలో హషీష్ ఆయిల్ (గంజాయి నూనె)ను స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను హయత్‌నగర్ పోలీసులతో కలిసి ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.14 కోట్ల విలువైన 13.5 కిలోల హషీష్ ఆయిల్‌తోపాటు రూ.2 వేల నగదు, 2 మొబైల్ ఫోన్లు, కిలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయినవారిలో విశాఖ జిల్లా లువ్వసింగి గ్రామానికి చెందిన వంచురాబ్బ కొండబాబు, వంచురాబ్బ బాలకృష్ణ ఉన్నారని, వీరిద్దరూ అన్నదమ్ములని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్ సోమవారం వెల్లడించారు. నిందితులు ఈ నెల 11న హైదరాబాద్‌కు వచ్చారని, ఓఆర్ఆర్ సమీపంలోని పెద్ద అంబర్‌పేటలో ఓ హోటల్ వద్ద రిసీవర్ల కోసం ఎదురు చూస్తూ పోలీసులకు పట్టుబడ్డారని వివరించారు.

- ఈ ఏడాది ఇప్పటికే 1.3 లక్షల మంది టికీలపై వేటు!
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ మద్రాస్ టాప్
- సెబీ చీఫ్‌పై హిండెన్‌బర్గ్ మరిన్ని ఆరోపణలు
- 2036 నాటికి స్త్రీ, పురుష నిష్పత్తి మెరుగుదల
- టీటీడీకి పంజాబ్ వ్యక్తి రూ. 21 కోట్ల విరాళం

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మంగళవారం TUESDAY 13.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 69 ‖ వెల (Price) రూ.6.50 | అష్టమి

మంగళవారం, సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-43. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: అష్టమి ఉదయం 9-32 వరకు, తదుపరి నవమి. నక్షత్రం: విశాఖ ఉదయం 10-45 వరకు, తదుపరి అనురాధ. వర్జ్యం: పగలు 2-59 నుంచి సాయంత్రం 4-41 వరకు. రాహుకాలం: పగలు 3-31 నుంచి సాయంత్రం 5-06 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-32 నుంచి ఉదయం 9-32 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-13 నుంచి రాత్రి 11-58 వరకు. అమృతకాలం: రాత్రి 1-10 నుంచి రాత్రి 2-52 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



సర్కార్‌పై ఉద్యోగుల జంగ్ సైరన్

డీఏ ఎప్పుడు? పీఆర్సీ ఏదీ?

- తెలంగాణ ఉద్యమం తర్వాత తొలిసారి ఉద్యోగ జేఏసీ ఏర్పాటు
- చేతులు కలిపిన రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు
- 53 సంఘాల సంయుక్త ప్రకటన.. హామీల అమలుకు డిమాండ్

ఉమ్మడి పాలనలో ఆత్మగౌరవం దక్కక.. విధి నిర్వహణలో అవహేళనలు, ద్వితీయ శ్రేణి పౌరులుగా అవమానాలు ఎదుర్కొన్న ఉద్యోగులు తెలంగాణ మలిదశ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారు. ఉద్యోగ సంఘాలన్నింటినీ ఏకం చేసి జేఏసీగా ఏర్పడి రాజకీయ పార్టీలతో సమానంగా ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించారు. పెన్‌డౌన్‌లు, నల్లబ్యాడ్జీలతో నిరసనలను కొనసాగించడమే కాకుండా సకలజనుల సమ్మెలో కీలకపాత్ర వహించారు. పోరాట ఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణలో అధికారం చేపట్టిన కేసీఆర్, చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగులకు 44శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఇతర డిమాండ్లను పరిష్కరించారు. పదేండ్లపాటు ఫ్రెండ్లీ గవర్నమెంట్‌తో స్వర్ణయుగాన్ని చూసిన ఉద్యోగులు, గత ఎన్నికల్లో తమకు హామీలిచ్చి మరిచిన కాంగ్రెస్ సర్కార్‌పై జంగ్ సైరన్ మోగించేందుకు సిద్ధమయ్యారు.

ప్రధాన డిమాండ్లు..

- సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ అమలు చేయాలి
- నాలుగు బకాయి డీఏలను విడుదల చేయాలి
- ఉద్యోగులందరికీ మొదటి తేదీనే జీతాలివ్వాలి
- ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలి
- ఆదాయ పన్ను పరిమితికోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి
- కారుణ్య నియామకాలు చేపట్టాలి
- రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవద్దు
- అక్రమ కేసులు ఎత్తేయాలి. తనిఖీలు ఆపేయాలి
- కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- జీవో 342ను పునరుద్ధరించాలి
- వీఆర్‌ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తేవాలి
- పెన్షనర్ల కోసం డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : తమతో వెంటనే చర్చించి, సమస్యలు పరిష్కరించకుంటే రేవంత్ సర్కారుతో తాడో పేడో తేల్చుకుంటామని రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉద్యమానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంపై గుర్రుగా ఉన్న ఉద్యోగ సంఘాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి జేఏసీగా ఆవిర్భవించాయి. సోమవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో ఎంప్లాయీస్ జేఏసీ ఆవిర్భావ సమావేశం జరిగింది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, టీచర్, ఔట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘాలు, పెన్షనర్లకు సంబంధించిన 53 సంఘాలు సమావేశానికి హాజరై › 6వ పేజీలో



జటావత్ కృష్ణ (ఫైల్)



కడుదల సంపత్(ఫైల్)

ఇద్దరు రైతుల ఆత్మహత్య

నల్లగొండ, హనుమకొండ జిల్లాల్లో విషాదం

అప్పులు తీర్చలేక ఒకరు

వడ్డీలు కట్టలేక మరొకరు బలవన్మరణం › 6

ఇసుక లారీకి 6 వేల లంచం!

లోడింగ్ పేరుతో మరో వెయ్యి

పనిచేయని ఆన్‌లైన్ వ్యవస్థ

బాట్ సాఫ్ట్‌వేర్‌తో అక్రమంగా బుకింగ్ › 12

రేషన్ బియ్యం సరఫరాకు 'రైస్ ఏటీఎం'లు!

ఒడిశాలో పైలట్ ప్రాజెక్టు › 11

త్వరలో రాష్ట్రంలోనూ ఏటీఎంలు

సన్నాహాలు చేస్తున్న ప్రభుత్వం

ఢిల్లీలో డీలర్లకు రహస్య శిక్షణ

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ

జనగామ జిల్లా గుడికుంట తండాలో ప్రత్యేకాధికారిగా విధులు

జీపీ బిల్లుల కోసం లంచం అడిగిన గోపాల్

రూ.6 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ › 3



రాజన్న సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్‌లో గురుకుల విద్యార్థి అనిరుధ్ తల్లిదండ్రులను పరామర్శిస్తున్న కేటీఆర్

గురుకులానికి పట్టని దళిత విద్యార్థిని

పాఠశాల మూడో అంతస్తు నుంచి పడిన బాలిక.. నడుముకు గాయం

తమకు సంబంధం లేదని బాలిక తల్లితో లేఖ రాయించుకున్నట్టు ప్రచారం › 2

ములుగు గురుకులంలో 9న ఘటన

8వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులు

పాలకుర్తి గురుకులంలో ఘటన › 2

పాఠశాల వంటమనిషి అసభ్య ప్రవర్తన

ప్రశ్నిస్తే ప్రిన్సిపాల్ నిర్లక్ష్య సమాధానం

గురుకులాల్లో మృత్యుఘోష

8 నెలల్లో గురుకులాల్లో 36మంది చనిపోయారు.. కుటుంబానికో ఉద్యోగమిచ్చి ఆదుకోవాలి: కేటీఆర్

ఈ సర్కారుతో తల్లిదండ్రులకు గర్భశోకం

- విద్యార్థుల సంరక్షణ బాధ్యత ప్రభుత్వం చూసుకోవాలి
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ వేస్తాం
- గురుకులాల పనితీరుపై సూచనలిస్తాం : కేటీఆర్
- పెద్దాపూర్ గురుకులంలో పాముకాటుతో చనిపోయిన అనిరుధ్ కుటుంబసభ్యులకు పరామర్శ.. ఆర్థికసాయం

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): 'పిల్లల తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చొద్దు. గురుకులాల్లో చదువుతున్న ఆరున్నర లక్షల మంది విద్యార్థులకు తల్లి, తండ్రి అన్నీతానై చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. పాముకాటుతో చనిపోయిన అనిరుధ్‌లాంటి పరిస్థితి ఏతల్లిదండ్రులకూ రాకూడదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎనిమిదినెలల్లో రాష్ట్రంలోని గురుకులాల్లో 36 మంది విద్యార్థులు చనిపోయారని, వారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని, ఈ విషయంలో ప్రభుత్వం రాజకీయ భేషజాలకు పోవద్దని › 2వ పేజీలో


50 వేల కోట్ల అప్పు

కేవలం 8 నెలల్లో రేవంత్ తెచ్చింది..

60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వాలు కలిపి చేసిన అప్పు **72,658 కోట్లు**

తెలంగాణ కూడా శ్రీలంకలాగే తయారయ్యింది. ఇలా అప్పులు చేసుకొంటూ పోతే, ఎలా?

-సీఎం కాకముందు మే 19, 2022న హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రేవంత్




సీఎం రేవంత్ ఒక్కడే 8 నెలల్లో చేసిన అప్పు **50,118 కోట్లు**

నిమిషానికి అప్పు : రూ. 14.5 లక్షలు

గంటకు : రూ. 8.7 కోట్లు

రోజుకు : రూ. 210 కోట్లు

నెలకు : రూ. 6,264 కోట్లు



ఇదే ధోరణి కొనసాగితే ఐదేండ్లు ముగిసే నాటికి కాంగ్రెస్ సర్కారు చేసే అప్పు **3.75 లక్షల కోట్లు**

ఒక్క ప్రాజెక్టు లేదు.. ప్రజా సంక్షేమమూ లేదు

- రేవంత్ హయాంలో అప్పుల కుప్పగా తెలంగాణ
- తెచ్చిన అప్పు ఎటు పోతుందో తెలియని సందిగ్ధం
- బీఆర్ఎస్‌పాలనలో తెచ్చిన ప్రతిపైసా వినియోగం
- మౌలిక వసతుల కల్పనకు, సంక్షేమానికి పెద్దపీట
- పదేండ్లలో గణనీయంగా పెరిగిన రాష్ట్ర సంపద
- తలసరి, జీఎస్డీపీ, రాబడి అన్నింటా రాష్ట్రం టాప్

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ)/(స్పెషల్ టాస్క్ బ్యూరో): 'తెలంగాణ సంసారం అప్పుల పాలైంది. ఈ అప్పుల సంసారాన్ని ఒక్కొక్కటిగా సరిదిద్దుకొంటూ వస్తున్నా'.. గత నెలలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలివి. అయితే, ముఖ్యమంత్రి తాను చెప్పినట్టు అప్పుల నుంచి తెలంగాణను తెరిపిన పడేయడం › 5వ పేజీలో

అధికారం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు

రైతుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు: జేపీ



- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సమతూకం
- సంక్షేమం, అభివృద్ధి నడుమ సమతుల్యత › 5
- రాష్ట్రంలో మౌలిక సౌకర్యాలు మెరుగుపడ్డాయి
- పెట్టుబడులూ భారీగా వచ్చాయి: జయప్రకాశ్

కట్టింది మేము.. కటింగ్ మీదా?



తెలంగాణ భవన్‌లో రుణ మాఫీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న హరీశ్. చిత్రంలో సత్యవతి రాథోడ్, క్రాంతి కిరణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు

సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ పదేండ్ల కృషికి నిదర్శనం. ఖమ్మం జిల్లాకు గోదావరి నీళ్లు అందించాలని ఎంతో చిత్తశుద్ధితో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును కడితే తామే కట్టినట్టు కాంగ్రెస్ వాళ్లు కటింగ్‌లు ఇస్తున్నరు. ప్రాజెక్టు ప్రారంభ సన్నాహక సమావేశాల్లో కాంగ్రెస్ మంత్రులు పోటీ పడి మరీ నెత్తి మీద నీళ్లు చల్లుకుంటున్నరు. - హరీశ్‌రావు

- క్రెడిట్ కొట్టేసేందుకు కాంగ్రెస్ ఆపసోపాలు
- సీతారామ పంప్‌హౌస్‌ల్లో పది పైసల పనైనా చేశారా?
- ఏడు నెలల పాలనలోనే భూసేకరణ చేసి కట్టింర్రా?
- ఇందిరాసాగర్‌ను రీడిజైన్ చేసి సీతారామ నిర్మించినం
- 67 టీఎంసీలతో ఖమ్మం జిల్లాలో రెండు పంటలకు నీళ్లు
- 75 కోట్లతో 1.50 లక్షల ఎకరాలకు నీళ్లిస్తున్నామంటున్న డిప్యూటీ సీఎం భట్టికి నోబెల్ ఇవ్వచ్చు : హరీశ్ ఎద్దేవా

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ కృషి ఫలితమేనని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు స్పష్టంచేశారు. సీతారామ క్రెడిట్‌ను కొట్టేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఆపసోపాలు పడుతున్నదని, కాంగ్రెస్ మంత్రులకు రిబ్బన్ కటింగ్ చేసే అవకాశంవస్తే, ప్రాజెక్టునే కట్టినట్టు కటింగ్ ఇస్తున్నారని ఎద్దేవాచేశారు. 'కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 90శాతం పూర్తిచేసింది.. దాన్ని కేవలం ప్రారంభించేది మాత్రమే మీరు' అంటూ దుయ్యబట్టారు. సీతారామ ద్వారా ఖమ్మం జిల్లాలో రెండు పంటలకు › 3వ పేజీలో



రాష్ట్రంలో హ్యుందాయ్ కార్ల మెగా టెస్ట్ సెంటర్

- వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు › 11
- తెలంగాణపై దక్షిణ కొరియా కంపెనీల ఆసక్తి
- కొరియన్ కంపెనీలతో సీఎం రేవంత్ బృందం భేటీ
- అమెరికా నుంచి దక్షిణ కొరియా చేరుకున్న సీఎం
- త్వరలో తెలంగాణ రానున్న ఎల్ఎస్ కంపెనీ బృందం

- రాహుల్‌కు ఒక సూటి ప్రశ్న

'మేఘా'పై ఎందుకు మెతక వైఖరి!

- 10 రోజులైనా 'సుంకిశాల'పై చర్యలేవి?
- తెలంగాణలో మీ సర్కారు తీరు ఓకేనా?
- కాంగ్రెస్ అగ్రనేతకు కేటీఆర్ సూటి ప్రశ్న › 11

సుంకిశాల చక్రం తిప్పిందెవరు?

- మునకను 'నమస్తే తెలంగాణ' బయటపెట్టిన రోజే ఇంజినీర్లతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి
- తెల్లారే సందర్శనకు వెళ్తానని చివరి నిమిషంలో రద్దు
- చిన్న ఘటన అంటూ స్వరం మార్చిన మంత్రులు
- ఏజెన్సీదే తప్పిదమన్న జలమండలి.. చర్యలు శూన్యం
- జరిగి పది రోజులైనా ఏ ఒక్కరూ సమీక్షించని వైనం
- చిన్న ప్రకటనకే పరిమితమైన ఇన్‌చార్జి మంత్రి పొన్నం
- ఎట్టకేలకు ఇంజినీర్ల వివరణ కోరిన జలమండలి ఎండీ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ఘటన.. ప్రభుత్వ, అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని కండ్లకు కట్టినట్టు చూపింది. ఇంత పెద్ద సంఘటన జరిగినా ప్రభుత్వం కాదు కదా.. జలమండలి, పురపాలకశాఖ ఉన్నతాధికారులకూ పూర్తిస్థాయి వివరాలు తెలియకపోవటం గమనార్హం. ఘటన వెలుగులోకి వచ్చినపుడు ప్రభుత్వంలోని కొందరు పెద్దల హడావుడి.. ఆపై క్రమంగా వ్యవహారాన్ని కప్పిపుచ్చుతూ చోటుచేసుకున్న పరిణామాలు.. అనేక అనుమానాలకు తావిస్తున్నట్టు అధికార యంత్రాంగంలో తీవ్ర › 11వ పేజీలో

అసైన్డ్ భూముల్లో వెంచర్

- బహిరంగంగానే వంద ఫీట్ల రహదారుల నిర్మాణం
- అసైన్డ్‌దారుల నుంచి 99 ఏండ్లకు లీజు ఒప్పందం
- కొందరు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు
- నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న రెవెన్యూ శాఖ
- తెర వెనుక ప్రభుత్వ పెద్దలున్నారని ప్రచారం
- పీవోటీ కింద కొనుగోలు చేసేందుకూ భారీ స్కెచ్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): సర్కారు భూమిలో ఓ నిరుపేద గుడిసె వేసుకుంటే అధికార యంత్రాంగం రాత్రికి రాత్రి బుల్డోజర్లతో వాటన్నింటినీ నేలమట్టం చేస్తుంది. నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వమంటే.. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే నోటీసులు ఏంది? అంటూ కనీసం గుడిసెలోని సామాను తీసుకునే సమయం కూడా ఇవ్వరు. కానీ రంగారెడ్డి జిల్లాలో రెండు మండలాల సరిహద్దున వంద ఎకరాలకు › 6వ పేజీలో



నాగన్‌పల్లిలోని సర్వే నంబర్ 189లో గల ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా వెంచర్‌లోకి వేసిన రోడ్డు

గని కార్మికుల పీఎఫ్.. కాంట్రాక్టర్ జేబుల్లోకి?

సింగరేణిలో కుంభకోణం

- శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికుల పీఎఫ్ ఎగవేత
- ప్రసాద్ సుశీ హైటెక్ ప్రాజెక్ట్స్ మాయాజాలం
- 15 కోట్ల మేర కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ మాయం
- కొత్తగూడెం జీవీఆర్ ఓసీపీలోనూ ఇదే తంతు
- పరోక్షంగా సహకరిస్తున్న సింగరేణి అధికారులు
- 17 ఓసీపీల్లో వందల కోట్ల అక్రమాలు? › 2

బల్లి, తొండ, ఉడుత పాయె.. ఈ సారి ఉడుము వంతు!

- బోడుప్పల్ సీపీఆర్ఐలోకి ఉడుము
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- వెంటనే ఉప్పల్ ఫీడర్ నుంచి పునరుద్ధరణ
- ఫీడర్ మరమ్మతులు చేస్తున్న అధికారులు



ఉప్పల్ సమీపంలోని సీపీఆర్ఐ ప్రాంగణంలో ఉన్న బ్రేకర్‌లోకి వచ్చిన ఉడుము

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు రోజుకో సమస్య వస్తున్నది. ఇప్పటివరకు బల్లి, తొండ, ఉడుత విద్యుత్ అంతరాయానికి కారణం కాగా ఈసారి ఉడుము వంతొచ్చింది. బోడుప్పల్ సమీపంలోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీపీఆర్ఐ) ప్రాంగణంలోని ఒక బాక్సులోని బ్రేకర్‌లోకి ఉడుము వెళ్లడంతో పీఅండ్‌టీ కాలనీ 11కేవీ ఫీడర్ ట్రిప్ అయింది. దీంతో ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 4-5 నిమిషాలపాటు ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని, వెంటనే ఉప్పల్ ఫీడర్ పరిధి నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని హబ్సీగూడ సర్కిల్ ఎస్ఈ పీ బ్రహ్మం తెలిపారు. విద్యుత్ పరిశోధన కేంద్రమైన సీపీఆర్ఐలోనే ఈ ఘటన జరగడంతో లోపల విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతిందని, దాన్ని అక్కడి అధికారులు గుర్తించి సరిచేస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో 'రైస్ ఏటీఎం'లు?

- కొత్తగా రేషన్ బియ్యం పంపిణీ
- ప్రయోగాత్మకంగా ఒడిశాలో అమలు
- రాష్ట్రంలో ఏర్పాటుకు సన్నాహాలు
- 20 మంది డీలర్లకు ఢిల్లీలో శిక్షణ



హైదరాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ):రాష్ట్రంలో 'రైస్ ఏటీఎం'లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతున్నది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే దాదాపు 20 మంది రేషన్ డీలర్లను ఢిల్లీకి పంపి, శిక్షణ ఇప్పించినట్టు తెలిసింది. రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని మార్చడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైస్ ఏటీఎంను ప్రవేశపెట్టింది. 3 రోజుల క్రితం ఒడిశాలో ప్రయోగాత్మకంగా దీన్ని ప్రారంభించారు. దశలవారీగా దేశమంతటా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే తెలంగాణలోనూ రైస్ ఏటీఎంలను ప్రవేశపెట్టనున్నట్టు తెలిసింది.

ఎలా పనిచేస్తుందంటే..

ఏటీఎం నుంచి డబ్బులు తీసుకునేందుకు పిన్ నంబర్ ఎంటర్ చేసినట్టుగా రైస్ ఏటీఎంలో రేషన్‌కార్డు నంబర్‌ను ఎంటర్ చేయగానే కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా రేషన్ బియ్యం వస్తాయి. రైస్ ఏటీఎంలను ఏర్పాటు చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. అందుకే రైస్ ఏటీఎంల ఏర్పాటు అంశాన్ని గోప్యంగా ఉంచుతున్నది. ఇటీవల దాదాపు 20 మంది రేషన్ డీలర్లను ఢిల్లీకి తీసుకెళ్లి రహస్యంగా శిక్షణ ఇప్పించినట్టు సమాచారం. కానీ, విషయం బయటకు తెలియడంతో మల్టీస్టోర్ షాపులను కొనసాగించేందుకు అవసరమైన శిక్షణ ఇప్పించినట్టు అధికారులు చెప్తున్నారు. దీంతో ఆ మాత్రం దానికి ఢిల్లీ వరకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఏమొచ్చిందని పలువురు రేషన్ డీలర్లు ప్రశ్నిస్తున్నారు.

సుంకిశాల చక్రం తిప్పిందెవరు?

మొదటిపేజీ తరువాయి...

చర్చ జరుగుతున్నది. అసలు సుంకిశాల వ్యవహారానికి సంబంధించి పురపాలకశాఖలో ఎవరు చక్రం తిప్పారు? అనేది ప్రధాన అంశంగా మారింది. తొలుత అంతా తానై అన్నట్టు వ్యవహరించిన ప్రభుత్వ పెద్ద.. ఒక్కసారిగా తనకు సంబంధం లేనట్టుగా వ్యవహరించటం ఓ ఉన్నతాధికారిని కాపాడే ప్రయత్నంలో భాగమేనని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఇప్పటిదాకా ఘటనపై ఎలాంటి సమీక్ష నిర్వహించకపోవటంతో పాటు ఏజెన్సీ, ఇంజినీర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేలా, చిన్న సంఘటనగా చిత్రీకరించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఏజెన్సీపై ఎందుకు చర్య తీసుకోవటం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఇప్పటి దాకా సమీక్షే లేదు

నల్లగొండ జిల్లాలోని సుంకిశాల పథకంలో రిటైనింగ్ వాల్ నిలువునా కుప్పకూలిన ఘటనపై తెరవెనుక నాటకీయంగా పావులు కదులుతున్నాయి. ఇంత పెద్ద ఘటన జరిగినా ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి తెలియకపోవటంపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవంగా ఈ వ్యవహారం పురపాలకశాఖ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం ఆ పోర్ట్‌ఫోలియో సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నది. ఆయన అందుబాటులో లేనందున పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి రంగంలోకి దిగి, సమీక్షించాల్సి ఉన్నది. కానీ అదేమీ జరగలేదు. 'నమస్తే తెలంగాణ' ఈ సంఘటనను ఈ నెల 8న వెలుగులోకి తెచ్చింది. అదే రోజు సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జలమండలి ఎండీతో పాటు ఇతర ఇంజినీర్లను పిలిపించుకొని మాట్లాడారు. అంటే



సీఎం అందుబాటులో లేనందున డిప్యూటీ సీఎం రంగంలోకి దిగారని అనుకోవచ్చు. మరుసటి రోజు సుంకిశాలకు మంత్రులు ఉత్తమ్, తుమ్మలతో కలిసి భట్టి వెళ్తున్నారంటూ మీడియాకు అధికారికంగానే సమాచారం వచ్చింది. కానీ చివరి నిమిషంలో భట్టి ఆ పర్యటనకు దూరంగా ఉండటం గమనార్హం. సీఎం అందుబాటులో లేనందున ప్రభుత్వపరంగా వ్యవహారాన్ని భుజాన వేసుకున్నారని అనుకున్నా.. మరుసటి రోజు చివరి నిమిషంలో పర్యటన రద్దు చేసుకోవటంతో పాటు ఇప్పటివరకు ఈ వ్యవహారంపై సమీక్ష కూడా చేయలేదు. ఘటనను గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేసేందుకే తీవ్రంగా ప్రయత్నం జరిగింది. జలమండలి అధికారిక వివరణతో అది బూమరాంగ్ అవడంతో మిన్నకుండిపోయినట్టు తెలుస్తున్నది. తాను పర్యటనకు వెళితే సంఘటన వ్యవహారం మరింత కొనసాగింపుగా మారుతుందనే ఉద్దేశంతోనే భట్టి సుంకిశాల పర్యటనకు దూరంగా ఉన్నారనే వ్యాఖ్యలు వినిపించాయి. అటు తుమ్మల, ఇటు ఉత్తమ్.. ఇద్దరూ జరిగిందేదో జరిగింది, ఏజెన్సీదే బాధ్యత. ప్రభుత్వంపై భారం లేదంటూ, దాన్ని చిన్న సంఘటనగా చిత్రీకరించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. మరుసటి రోజు నుంచి అటు ఇంజినీర్లు, ఇటు ఏజెన్సీ.. ఎవరిపైనా చర్య తీసుకోలేదు. పైగా ఈ సంఘటనపై వేసిన త్రిసభ్య కమిటీ వెంటనే నివేదిక ఇస్తుందని చెప్పినా నిర్ణీత గడువు ఇచ్చారా? లేదా? అనేది వెల్లడించలేదు. కమిటీ వేసి ఐదు రోజులైనా ఇప్పటివరకు నివేదిక కూడా రాలేదు. కేవలం ముగ్గురు ఇంజినీర్లకు మెమోలు జారీ చేసి, వారి నుంచి సంజాయిషీ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వ్యవహారాన్ని పూర్తిగా మూసివేసేందుకే వేగంగా అడుగులు పడుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా ఒక ఉన్నతాధికారిని వెనకేసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే డిప్యూటీ సీఎం తొలుత హడావుడి చేసి ఆపై మిన్నకుండిపోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ వ్యవహారంలో అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఘటనపై విచారణ కమిటీ వేస్తామని అందరి కంటే ముందుగా ప్రకటించిన పొన్నం ప్రభాకర్.. ఇన్‌చార్జి మంత్రి హోదాలో కనీసం సమీక్ష చేయకపోవటం, సంబంధిత ఇంజినీర్లతో మాట్లాడటం గానీ చేయలేదు. జలమండలి ఇంజినీర్లతో మాత్రమే కమిటీ ఏర్పాటుచేసి బాధ్యులందరినీ కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమిటీనైనా స్పష్టత ఇస్తుందా?

సుంకిశాల ఘటనపై జలమండలి అధికారులు ఇచ్చిన వివరణలో స్పష్టంగా ఇది ఏజెన్సీ తప్పిదమేనని పేర్కొన్నారు. కానీ ఇది నాన్‌ఈపీసీ కింద అప్పగించిన పనులు అనే వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. ఈపీసీ అంటే ఏజెన్సీనే సర్వే, డిజైన్ రూపొందించి, పనులు పూర్తి చేసి, ప్రాజెక్టును ప్రభుత్వానికి అప్పగిస్తుంది. ఇందులో సంబంధిత శాఖ ఇంజినీర్ల పాత్ర ఉండదు. కానీ నాన్‌ఈపీసీ పనుల్లో ఏజెన్సీ పనులు మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. కీలక నిర్ణయాలన్నీ ఇంజినీర్లే తీసుకుంటారు. పనుల్లో వినియోగించే స్టీల్, సిమెంట్‌ను సైతం ఇంజినీర్లు ధ్రువీకరించిన తర్వాతే వినియోగిస్తారు. ఈ క్రమంలో మధ్యస్థ సారంగాన్ని జలమండలి ఇంజినీర్లు చెప్తేనే ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఏజెన్సీ స్వతహాగా చేయడానికి వీలుండదు. అంతేకాదు.. మంత్రుల బృందం పర్యటన సందర్భంగా కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘటన జరిగినప్పటికీ పథకం పూర్తి కాలేదని, పూర్తి చేసి అప్పగించాల్సిన బాధ్యత ఏజెన్సీపైనే ఉంటుందని, ప్రభుత్వంపై భారం ఉండదని వెల్లడించారు. ఇలా ఈపీసీ పనుల్లోనే జరుగుతుంది. సుంకిశాల నాన్‌ఈపీసీ అయినప్పటికీ ప్రభుత్వం, ఇంజినీర్లు తమకేం సంబంధం లేదన్నట్టు వ్యవహరించటం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. త్రిసభ్య కమిటీనైనా.. నాన్‌ఈపీసీ అని చెప్తుందా? లేక ఏజెన్సీదే బాధ్యత అంటూ చేతులు దులుపుకుంటుందా? అన్నది వేచి చూడాల్సిందే.

10 రోజులైనా 'సుంకిశాల'పై చర్యలేవి?

- 'మేఘా'పై ఎందుకు మెతక వైఖరి
- అసలు మీ తెలంగాణ కాంగ్రెస్ ఉద్దేశమేంటి?
- రాహుల్‌గాంధీని ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): సుంకిశాల గోడ కూలిన ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రమాదం జరిగి 10 రోజులు కావొస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కాంట్రాక్టు సంస్థే కారణమైతే దాన్ని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ వేయాలని ఇప్పటికే కోరినట్టు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన కాంట్రాక్ట్ ఏజెన్సీ మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థ పట్ల ఎందుకంత మెతక వైఖరి ప్రదర్శిస్తుందో సమాధానం చెప్పాలని నిలదీశారు.

ఇంజినీర్ల వివరణ కోరిన ఎండీ

సుంకిశాల ఘటనతో జలమండలి మేల్కొన్నది. సంస్థ ఈడీ డాక్టర్ ఎం సత్యనారాయణ, ఈఎన్సీ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌తో కమిటీ వేస్తూ ఎండీ అశోక్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.నిర్లక్ష్యంగా అధికారులను ప్రాథమికంగా గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఘటనకు తమదే బాధ్యత అని ఏజెన్సీ చెప్పినప్పటికీ.. కమిటీ నివేదిక అంటూ సదరు కాంట్రాక్టర్‌పై చర్యల విషయంలో తాత్సరం చేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు

సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణం, ప్రమాద ఘటన వెనుక అధికారుల లోపాలను ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. గతంలో జలమండలి చేపట్టిన హడ్కో తాగు, మురుగునీటి ప్రాజెక్టు, 21 చోట్ల ఎస్టీపీ పనులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగాయి. సీసీ కెమెరాలను ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేసి ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీలు పర్యవేక్షించారు. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో మాత్రం అధికారులు ఇవేవీ చర్యలు తీసుకోలేదు. దీంతో ఘటన జరిగిన తర్వాత మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలకు జలమండలి ఉపక్రమించింది. త్వరలోనే సుంకిశాల తాగునీటి ప్రాజెక్టు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు.

బీజేపీ మత్తులో మందకృష్ణ

- ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం: చెన్నయ్య

హైదరాబాద్ (ఖైరతాబాద్) ఆగస్టు 12: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మాల ప్రజాప్రతినిధులపై విషంకక్కుతున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్న య్య ఆరోపించారు. హైదరాబాద్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే మాదిగల్లో అక్షరాస్యత లేని, అభివృద్ధి చెందని కుటుంబాలకు సమాన అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వర్గీకరణ అనే ది చివరకు రిజర్వేషన్ల రద్దుకే దారి తీస్తుందని తెలిపారు. బీజేపీ, ఏపీ సీఎం చంద్రబాబు మత్తులో నుంచి మందకృష్ణ బయటకు వచ్చి దళితుల ఐక్యతకు కృషి చేయాలన్నారు. వర్గీకరణను అడ్డుకొని తీరుతామని, సుప్రీం కోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా త్వరలోనే జాతీయస్థాయిలో ఆందోళనలు చేపడుతామని వెల్లడించారు.

సుప్రీం తీర్పు ఏ కులానికీ వ్యతిరేకం కాదు

- మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు12 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఏ కులానికీ వ్యతిరేకం కాదని మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ తీర్పులో సామాజిక న్యాయం కనిపిస్తున్నదని చెప్పారు. ఎస్సీల్లోని అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు రావాలనే అంబేద్కర్, పూలే కోరుకున్నారని వెల్లడించారు. సుప్రీం తీర్పులో కూడా ఇదే విషయం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పుడు ఎస్సీల్లోని అన్నికులాల మేధావులందరూ కలిసి చర్చించుకుని, ఇప్పటి వరకు అవకాశాలు రాని వారికి అవకాశాలు రావడానికి ఏం చేయాలో ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉన్నదని సూచించారు. 15 శాతమున్న రిజర్వేషన్‌ను 20 శాతానికి పెంచుకోవడానికి కలిసి పోరాడుదామని కోరారు.

రెండేండ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాలో 4 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఉద్దేశించిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను వచ్చే రెండేండ్లలో పూర్తిచేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి.. సోమవారం ఒహాయోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మానుఫ్యాక్చరింగ్ కంపెనీని సందర్శించి సీఈవో లాక్ హోంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టన్నెల్ తవ్వకానికి ఉపయోగించే అధునాతన నిర్మాణ యంత్ర సామగ్రిని సీఈవో లాక్‌హోం మంత్రికి వివరించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు బేరింగ్ సమస్యతోపాటు ఇతర మరమ్మతుల వల్ల ఆగిపోయాయని, పరికరాలను వీలైనంత త్వరగా అందించాలని సీఈవోను మంత్రి కోమటిరెడ్డి కోరారు. గ్రీన్ చానల్ అమలులో ఉన్నందున పనులు జరిగిన 40 రోజుల్లోనే చెల్లింపుల అంశంపై మంత్రి వివరించారు. కార్యక్రమంలో సాగునీటి పారుదల శాఖ నల్లగొండ సీఈ వీ అజయ్‌కుమార్, జైప్రకాశ్ అసోసియేట్ కంపెనీ డైరెక్టర్ పంకజ్ గౌర్, రాబిన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు

గోల్కొండలో స్వాతంత్ర్య వేడుకలు

- పటిష్ఠ ఏర్పాట్లకు సీఎస్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోటపై పటిష్ఠ ఏర్పాట్లుచేయాలని అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ఆమె గోల్కొండ కోటను సందర్శించారు. వేడుకల్లో మన సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా సంప్రదాయ దుస్తులలో కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ తెలిపారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను సీఎస్ ఆదేశించారు.కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

బదిలీల్లో అక్రమాలపై గప్‌చుప్!

- వైద్యారోగ్య శాఖపై సర్కారుది విచిత్ర పరిస్థితి
- డీపీహెచ్ పరిధిలో బదిలీల రచ్చపై మౌనం
- విజిలెన్స్ విచారణ అంటూ మంత్రి హడావుడి
- ఇప్పటివరకు కనిపించని 'నష్టనివారణ' చర్యలు

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఆరంభ శూరత్వంగానే కనిపిస్తున్నది. వివిధ శాఖల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై తొలుత హడావుడి చేస్తున్నా, ఆ తర్వాత కిమ్మనని పరిస్థితి దాపురించింది. దీనికి ఇటీవల వైద్యశాఖలో జరిగిన బదిలీలపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ స్పందన నిదర్శనంగా నిలుస్తున్నది. వైద్యారోగ్యశాఖ పరిధిలో డీపీహెచ్ మినహా ఇతర ఏ విభాగంలోనూ ఆరోపణలు రాకపోవడం గమనార్హం. బదిలీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తామంటూ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హడావుడిగా ప్రకటన చేశారు. అయినా ఇప్పటివరకు నష్టనివారణ చర్యలు తీసుకోవడమే లేదు. కనీసం డీపీహెచ్ గానీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గత ప్రభుత్వం 2018లోనూ ఇదే తరహాలో బదిలీలు చేపట్టినా ఎలాంటి ఆరోపణలు రాలేదని ఉద్యోగులే గుర్తు చేస్తున్నారు. డీపీహెచ్ విభాగంలో నర్సింగ్ ఆఫీసర్లు మొదలు డిప్యూటీ డైరెక్టర్ వరకు దాదాపు అన్ని హోదాల్లోనూ బదిలీలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా నర్సింగ్ ఆఫీసర్ల బదిలీలు ఏకంగా కౌన్సెలింగ్‌ను బహిష్కరించి, కోఠిలో రాస్తారోకో చేసే స్థాయికి దారితీసింది. సీనియార్టీ జాబితా, వేకెన్సీ జాబితాలో తప్పులు దొర్లాయని నర్సులు ఆరోపించారు. దీంతో మొదట మార్పులు చేసి, రెండోసారి జాబితా విడుదల చేశారు. అయినా తప్పులు దొర్లడంతో మరోసారి రివైజ్ చేశారు. ముచ్చటగా మూడోసారి కూడా ఆరోపణలు రావడంతో ఏకంగా కౌన్సెలింగ్‌నే ఆపేశారు.

చనిపోయిన వ్యక్తినీ బదిలీ చేశారు!

ల్యాబ్ అసిస్టెంట్ల బదిలీలపైనా పలు ఆరోపణలు వచ్చాయి. ఫోకల్ టు నాన్ ఫోకల్ పాటించలేదని, సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉన్నదని ఆరోపణలొచ్చాయి. టీవీవీపీ ఉద్యోగులను డీపీహెచ్ ఉద్యోగులుగా మార్చి బదిలీ చేశారని, చనిపోయిన వ్యక్తిని కూడా బదిలీ చేశారన్న ఆరోపణలు ఇలా ఎన్నో వెల్లువెత్తాయి. డిప్యూటీ డైరెక్టర్ అడ్మిన్ బదిలీలను కండ్లు మూసుకొని చేశారనే స్థాయిలో ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌లో పనిచేస్తున్న అధికారులకు పక్క ఆఫీస్‌లో పోస్టింగ్‌లు ఇవ్వడం దుమారం రేపింది. అర్హత లేని సంఘాల నేతల సిఫారసు లేఖలపైనా దుమారం చెలరేగింది.

సీఎంవో ఆరా తీసినా విచారణేదీ?

వైద్యశాఖలో బదిలీల్లో జరిగిన రచ్చపై సీఎంవో ఆరా తీసినట్టు ఆనాడే వార్తలొచ్చాయి. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో నర్సింగ్ కౌన్సెలింగ్‌ను నిలిపివేసి, రోడ్డుపైకి వచ్చి నిరసన తెలపడానికి గత కారణలను తేల్చాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు నివేదిక అందిందని అప్పట్లో సచివాలయ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత వైద్య శాఖ బదిలీల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గత నెల 27న ప్రకటించారు. బదిలీల్లో అవకతవకలకు పాల్పడినట్టు తేలితే.. వారు ఏ స్థాయి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. తప్పిదాలకు పాల్పడినట్టు తేలితే చర్యలు తీసకుంటామని డీపీహెచ్ రవీందర్‌నాయక్ కూడా స్పష్టం చేశారు. కానీ రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి విచారణ జరగలేదు. ఈ వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉండటం వల్లే అటు ప్రభుత్వం గానీ, ఇటు ఆ శాఖ ఉన్నతాధికారులు గానీ గప్‌చుప్‌గా ఉన్నారని ఆరోపణలు వస్తున్నాయి.

కాంగ్రెస్‌లో మహిళలకు న్యాయమేది?

- జెండాలు మోసినవాళ్లకు గుర్తింపు లేదా?
- రాహుల్‌గాంధీ చెప్తున్న 'నారీ న్యాయ్' ఇదేనా?
- నిలదీసిన పార్టీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు



హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో మహిళలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్తున్న 'నారీ న్యాయ్' ఎక్కడ అమలవుతున్నదని నిలదీశారు. సోమవారం ఆమె గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'పార్టీ కోసం ఏండ్ల నుంచి పనిచేస్తున్నాను. మహిళా కాంగ్రెస్ తరఫున ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. కానీ నా లాంటి వాళ్లకు పార్టీలోగానీ, ప్రభుత్వంలోగానీ తగిన గుర్తింపు లభించడం లేదు. పార్టీలు మారిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఓడిపోయే గోషామహల్ సీటును నాకు అంటగట్టారు. తర్వాత పట్టించుకోవడమే మానేశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలైన నా ఫోన్‌కు స్పందన లేదంటే ఇక మిగతా వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి. ఇప్పటి వరకు ఎన్నో అవమానాలు ఎదురైనప్పటికీ వాటన్నింటిని దిగమింగాను. సరైన న్యాయం జరుగని నాలాంటి వాళ్లు ఎంతో మంది ఉన్నారు. ఓ సాటి మహిళకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకునే బాధ్యత దీపాదాస్ మున్షీకి లేదా? అసలు ఆమె ఫోన్ ఎత్తకపోవడానికి కారణమేంటి? పార్టీ మహిళా అధ్యక్షురాలికి ఇచ్చే గౌరవం ఇదేనా? పార్టీ జెండాలు మోసిన మా లాంటి వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని కేసీ వేణుగోపాల్‌లాంటి అగ్రనేతల దృష్టికి తీసుకెళ్తాను' అని పేర్కొన్నారు.


వ్యవసాయశాఖ బదిలీల్లో తీవ్ర జాప్యం

- మూడుసార్లు వాయిదా.. ఉద్యోగుల్లో అయోమయం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖ బదిలీల ప్రక్రియలో తీవ్ర జాప్యం కొనసాగుతున్నది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడింది. తాజాగా చేపట్టిన ప్రక్రియ కూడా నెమ్మదిగా సాగుతుండటంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జూలై 20 నాటికి బదిలీలకు ప్రభుత్వం గడువు విధించింది. ఈ గడువును పెంచిన ప్రభుత్వం జూలై 31 వరకు అవకాశం ఇచ్చింది. ఈ నెల 15లోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు.. ఇప్పటివరకు ఏఈవో, ఏవో బదిలీలను మాత్రమే పూర్తిచేశారు. ఆ తర్వాత నాలుగు రోజులుగా పైస్థాయి బదిలీలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో అసలు ఇప్పుడైనా బదిలీలు పూర్తవుతాయనే సందేహాలను ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ శాఖ బదిలీల ప్రక్రియలోనూ తీవ్ర గందరగోళం నెలకొన్నది. తప్పుల తడకగా సీనియార్టీ జాబితా రూపొందించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బదిలీ అయిన ఏఈవోలకు, ఏవోలకు బదిలీ అర్డర్లు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొనడంతో వారికి ఎదురుచూపులు తప్పడంలేదు.సందేహాలున్న ఉద్యోగులు వ్యవసాయశాఖ డైరెక్టరేట్ వస్తున్నా,డైరెక్టర్‌ను కలవడం గగనంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు కామధేనువుగా 'మెఘా'

బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి మెఘా ఇంజినీరింగ్ కంపెనీ కామధేనువుగా మారిందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫండ్ కోసమే మెఘా కంపెనీకి సీఎం రేవంత్‌రెడ్డి వంతపాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడారు.సుంకిశాల ప్రాజెక్టు కూలినా మెఘా కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని సీఎంను ప్రశ్నించారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత నిర్మాణ సంస్థదే అని వాటర్ బోర్డు చెప్తున్నదని గుర్తుచేశారు.కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని,పైగా అమృత్ స్కీమ్‌లోని పనులనూ ఆ సంస్థకే అప్పగించడం విడ్డూరమని అన్నారు. ఘటనపై న్యాయ విచారణ జరిపి కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టులో జరిగిన నష్టాన్ని పూర్తిగా కంపెనీ నుంచే రికవరీ చేయాలని, లేకపోతే కంపెనీపై, ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

దానంపై కేసు నమోదు

హైదరాబాద్ (వెంగళరావునగర్), ఆగస్టు 12: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 10న ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నందగిరి హిల్స్ గురుబ్రహ్మనగర్‌కు చేరుకుని ఆక్రమణదారులను రెచ్చగొట్టారని, ఎమ్మెల్యే సమక్షంలోనే ఆక్రమణదారులు పార్కు గోడను కూల్చి వేసినట్టు జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు..ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పోలీసులు దానంతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

అంతరించిపోతున్న ఏనుగు: మంత్రి సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): భూమిపై జీవించే హక్కు సకలజీవులకు ఉన్నదని మంత్రి సురేఖ చెప్పారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బెంగుళూరులో నిర్వహించిన ఓ సదస్సులో ఆమె మాట్లాడారు. అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఏనుగులు ఉండటం బాధాకరమన్నారు.ఏనుగులను కాపాడుకోవడానికి అందరం కృషి చేయాలని కోరారు.





సో'చల్' మోహనరంగా!

మంత్రుల పేషీల్లోగాడితప్పిన పాలన • సోషల్ మీడియా పోస్టులతో కాలక్షేపం

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్నారు.సీఎస్, ముఖ్యఅధికారులు పరివారంగా వెళ్లారు. దీంతో సచివాలయంలో మంత్రుల పేషీలు టీచర్ లేని తరగతి గదుల మాదిరిగా తయారయ్యాయని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రుల పేషీల్లో అధికారులు సోషల్‌మీడియా పోస్టులతో టైంపాస్ చేస్తున్న వైనం ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. సచివాలయంపై అంతస్తులో నిలబడి దిగిన ఫొటోలను ఐ అండ్ పీఆర్ మంత్రికి చెందిన అధికారిక ఖాతాలో పోస్ట్ చేశారు. మేథో పరీక్షకు చెందిన ఓ ప్రశ్నకు వైద్యారోగ్య శాఖ మంత్రి ఖాతా నుంచి సమాధానాలు పోస్ట్ అయ్యాయి. తెలంగాణ డిజిటల్ మీడియా ఖాతా నుంచి 'మా తోటలోకి నెమలి వచ్చింది' అంటూ ఫొటోలు హల్‌చల్ చేశాయి. ఇక 'వీటిని మీమీ భాషల్లో ఏమని పిలుస్తారు?' అంటూ బెండకాయల ఫొటోను ఓ వ్యక్తి ఎక్స్‌లో అప్‌లోడ్ చేస్తే దానికి 'బెండకాయలు' అంటూ సైబర్ క్రైమ్స్ పీఎస్ హైదరాబాద్ సిటీ పోలీస్ ఖాతా నుంచి సమాధానం వెళ్లడం అన్నింటికన్నా హైలెట్ అని నెటిజన్లు జోకులు వేస్తున్నారు. సార్లు ట్రిప్పుల్లో ఉంటే, అధికారులు సో'చల్' మోహనరంగా అంటూ కాలక్షేపం చేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'దేవాదుల'కు 45 కోట్లు


హైదరాబాద్, ఆగస్టు12 (నమస్తే తెలంగాణ): దేవాదుల ఎత్తిపోత పథకం నిర్వహణకు ప్రభుత్వం రూ.45 కోట్లకు పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. రెండేండ్లపాటు దేవాదుల ఫేజ్ 1, ఫేజ్ 1 సిస్టమ్ ఆపరేషన్ నిర్వహణకు ఈ అనుమతిని ఇచ్చింది.

నాయబ్ తాసిల్దార్ల సీనియార్టీ జాబితా ఇవ్వండి

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): నాయబ్ తాసిల్దార్ల సీనియార్టీ జాబితా రూపొందించాలని రెవెన్యూ శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఉమ్మడి జిల్లాల వారీగా, మల్టీ జోన్ల వారీగా జాబితాలను రూపొందించాలని సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు.

మందుపాతర పేలి ఆదివాసీ మహిళ మృతి

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 12: మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ మహిళ మృతిచెందింది.ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా దబ్బమర్కకు చెందిన ఆదివాసీ మహిళ కవాసి సుక్కీ సోమవారం మేకలు కాసేందుకు అడవికి వెళ్లింది. మందుపాతరపై కాలు మోపడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




మన శరీరంలోని అతి ప్రధానమైన అవయవాల్లో మూత్రపిండాలు ఒకటి. ఇవి మన శరీరంలో రక్తాన్ని శుద్ధిచేసి, మలిన పదార్థాలను మూత్రం ద్వారా బయటికి పంపిస్తాయి. నీటి సమతుల్యతను కాపాడటంతోపాటు రక్తపోటును కూడా నియంత్రిస్తాయి. ఎర్ర రక్తకణాల తయారీలోనూ కిడ్నీలది ముఖ్యపాత్ర. ఎముకల పటిష్టతను కాపాడుతాయి. ఇవి చెడిపోతే శరీరంలో రక్తశుద్ధి ప్రక్రియ కుంటుపడిపోయి రక్తం కలుషితమవుతుంది. దీంతో మనిషి మనుగడకే ప్రమాదం ఏర్పడొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో రోగి సాధారణ జీవితానికి కిడ్నీ మార్పిడి ఒక్కటే శాశ్వత పరిష్కారం.

మార్పిడే మంచి రక్ష

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో డయాలసిస్‌కు చెక్


మూత్రపిండాలను కబళించే జబ్బుల్లో మూలమైనది మధుమేహం. దీర్ఘ కాల అధిక రక్తపోటు కూడా కిడ్నీలను దెబ్బతీస్తుంది. మూత్రపిండాలు పాడైపోయిన వారికి మూత్రం ద్వారా ప్రొటీన్ ఎక్కువగా బయటికి వెళ్లిపోతుంది. డయాబెటిస్ మాత్రమే కాకుండా జన్యుపరమైన కారణాలతోపాటు మూత్రనాళ ఇన్ఫెక్షన్లను నిర్లక్ష్యం చేయడం, మూత్రపిండాల్లో రాళ్ల సమస్య ఉన్నవారిలోనూ కిడ్నీల సమస్య తలెత్తడానికి ఆస్కారం ఉంది. కాగా, వంశపారంపర్యంగా వచ్చే మూత్రపిండాల సమస్యలు కూడా 2 నుంచి 5 శాతం వరకు కిడ్నీల సమస్యలకు దోహదం చేస్తాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఎలాంటి చికిత్సలు అవసరం?



దీర్ఘకాలిక కిడ్నీల వైఫల్యం ఉన్న వాళ్లు సంబంధిత వైద్యులను తరచుగా సంప్రదిస్తూ ఉండాలి. వాళ్ల సూచనలను తు.చ. తప్పకుండా పాటించాలి. ఒకవేళ రక్తపోటు సమస్య (బీపీ) ఉంటే దాన్ని అదుపులో పెట్టుకోవాలి. నాణ్యమైన పోషకాహారం తీసుకోవాలి. ఇక మూత్రపిండాలు వాటి సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోతే మాత్రం శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ కుంటుపడుతుంది. కాబట్టి, రక్తం శుద్ధి చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాల్సి వస్తుంది. ఇలాంటి రోగులకు డయాలసిస్ లేదా మూత్రపిండాల మార్పిడి అవసరం పడుతుంది.

ముందుగా డయాలసిస్...



రోగికి విడువకుండా వాంతులు కావడం, నీరసం, ఆకలి మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్నప్పుడు డయాలసిస్ అవసరమని నిర్ధారించుకోవాలి. అయితే, కొంతమంది రోగుల్లో ఇలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. ఇలాంటివారికి నిర్వహించే పరీక్షల్లో సీరం క్రియాటినైన్ 8 ఎంజీకి, యూరియా 150 ఎంజీకంటే ఎక్కువగా నిర్ధారణ అయితే రోగి ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారకుండా డయాలసిస్ అత్యవసరం అవుతుంది. కానీ, వైద్యుల సూచనలు, సలహాల మేరకే ఈ ప్రక్రియను చేపట్టాలి.

రెండు రకాలు..

యంత్రం ద్వారా రక్తాన్ని శుద్ధి చేసే పద్ధతిని హీమో డయాలసిస్ అంటారు. ఈ ప్రక్రియలో కృత్రిమ కిడ్నీని వాడి రక్త శుద్ధి చేస్తారు. దీనికోసం తప్పనిసరిగా వారానికి మూడుసార్లు.. రోజు విడిచి రోజు డయాలసిస్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇక డయాలసిస్ చేయడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. అంతేకాదు, ఇంట్లోనే చేసుకోగలిగే డయాలసిస్ పద్ధతి కూడా అందుబాటులో ఉంది. దీన్ని పెరిటోనియల్ డయాలసిస్ అని పిలుస్తారు. ఈ ప్రక్రియలో కడుపులో ఉండే పెరిటోనియం అనే సన్నటి జల్లెడ లాంటి పొరకు మెత్తని ట్యూబ్‌ను చిన్నతోక ద్వారా అమరుస్తారు. ఈ గొట్టం ద్వారా ప్రత్యేకంగా తయారుచేసిన బ్యాగులోని ఫ్లూయిడ్స్‌ను కడుపులోకి పంపిస్తారు. రక్త శుద్ధి ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ పరికరాలను తీసేస్తారు. ఇలా రోజుకు అరగంట చొప్పున మూడు నుంచి నాలుగుసార్లు డయాలసిస్ చేసుకోవాలి.

డయాలసిసా... కిడ్నీ మార్పిడా?

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనేది అందరికి సాధ్యపడదు. దీనికి దాత అవసరం అవుతారు. దాత దొరికేవరకు రోగి కొన్నాళ్లపాటు లేదా తన జీవితాంతం డయాలసిస్ మీదే ఆధారపడాల్సి ఉంటుంది. కిడ్నీ వైఫల్యం ఉన్న రోగుల్లో డయాలసిస్ చేయించుకుంటున్నప్పటికీ దాదాపు 25 శాతం మంది వివిధ రకాల సైడ్ ఎఫెక్ట్స్ వల్ల మృత్యువాత పడుతున్నారు. డయాలసిస్‌లో ఉన్నప్పుడు రోగి గుండె వైఫల్యం చెందడం, లేదా తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు గురవడం లాంటి కారణాల వల్ల ప్రాణాలను కోల్పోతున్నారు. అందుకే, దీర్ఘకాల కిడ్నీ వైఫల్యం ఉన్నవారికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు మించిన ప్రత్యామ్నాయం లేదని చెప్పవచ్చు.

ఎలా సమకూరుతాయి?

రోగికి మూత్రపిండాలు అవసరమైనప్పుడు రెండు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఒకటి.. బతికి ఉన్నవారి (లైవ్ డోనార్) నుంచి కిడ్నీ సేకరించడం, రెండోది చనిపోయిన వారి (డిసీజ్డ్ డోనార్) నుంచి కిడ్నీ సేకరించడం. లైవ్ డోనార్‌లో కేవలం రక్త సంబంధీకుల నుంచి మాత్రమే కిడ్నీ సేకరించాల్సి ఉంటుంది. అలానే రోగి బ్లడ్ గ్రూప్ దాత బ్లడ్ గ్రూప్‌తో కలవాల్సి ఉంటుంది. ఇక కిడ్నీ దాతలకు అధిక రక్తపోటు, డయాబెటిస్, గుండెజబ్బులు, మెదడు జబ్బులు, కాలేయ వ్యాధులైన హెపటైటిస్– బి, సి లాంటివి ఉండకూడదు. ఒకవేళ రక్త సంబంధీకుల బ్లడ్ గ్రూప్ కలవకపోతే స్వాప్ రీనల్ లేదా ఏబీఓ ఇన్‌కంపాటిబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియలు కూడా అందుబాటులో ఉన్నాయి. అంటే ఇలాంటి సందర్భాల్లో ఇదే సమస్యతో బాధపడుతున్న మరొకరికి వారి రక్త సంబంధీకులు కిడ్నీ దానం చేయాలని అనుకుంటే, సరిపోతాయనుకుంటే ఒకరి దాతలు మరొకరికి పరస్పరం కిడ్నీలు దానం చేసే ప్రక్రియనే 'స్వాప్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఇచ్చిపుచ్చుకోవడం)' అంటారు. ఈ విధానంలో ఒక రోగి బంధువు కిడ్నీ మరొక దాత బంధువుకు, అక్కడి దాత కిడ్నీ ఇక్కడి రోగికి అమరుస్తారు.

లక్షణాలు

- కాళ్లవాపులు
- మొహం వాచినట్టు ఉండటం
- ఆకలి తగ్గడం
- ఆగకుండా వాంతులు కావడం
- నీరసంగా ఉండటం
- ఆయాసం
- రాత్రివేళల్లో తరచుగా మూత్రానికి వెళ్లాల్సి రావడం లేదా తక్కువ మూత్రం రావడం
- కొన్ని సందర్భాల్లో మూత్రంలో రక్తం పడటం మొదలైన లక్షణాలతో పాటుగా ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది కలగడం లేదంటే అపస్మారక స్థితికి చేరుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

బ్లడ్ గ్రూప్‌లు కలవకపోయినా..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, వైద్యుల్లో పెరుగుతున్న నైపుణ్యాలు ప్రస్తుతం బ్లడ్ గ్రూప్‌లు కలవకపోయినా కూడా కిడ్నీ మార్పిడికి అవకాశం కల్పిస్తున్నాయి. ఏబీఓ ఇన్‌కంపాటిబుల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అనే అత్యాధునిక వైద్య ప్రక్రియ ద్వారా దాత, స్వీకర్తలు వేర్వేరు బ్లడ్ గ్రూప్‌లు కలిగి ఉన్నా కిడ్నీ మార్పిడికి వీలవుతుంది. ఈ ప్రక్రియలో ప్రత్యేకమైన ప్లాస్మా ఫేరసిస్ పద్ధతిని అనుసరించి వేర్వేరు బ్లడ్ గ్రూపుల్లోని యాంటిజెన్‌ను కలిసేలా చేస్తారు. దాత, స్వీకర్తల బ్లడ్ గ్రూప్‌లు కలవకపోయినప్పటికీ ఏబీఓ ఇన్‌కంపాటిబుల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంలో కూడా ఫలితాలు కంపాటిబుల్ కిడ్నీ మార్పిడి మాదిరిగానే మెరుగ్గా ఉంటున్నాయి.

దానం సురక్షితమా?

కిడ్నీ దానం హానికరం కానేకాదు. ఒక కిడ్నీ దానం ఇచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరో కిడ్నీతో కూడా జీవితకాలాన్ని హాయిగా కొనసాగించవచ్చు. దైనందిన జీవితానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. యథావిధిగా ఉద్యోగాలు చేసుకోవచ్చు. డ్రైవింగ్, వ్యాయామం, ఆటలు, మిలిటరీ ఉద్యోగాలు కూడా నిరభ్యంతరంగా కొనసాగించవచ్చు. కిడ్నీ దాతకు భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలూ రావు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీకి అత్యాధునికమైన 'లాప్రోస్కోపిక్' వైద్య విధానం అవలంబిస్తారు. పైగా డాక్టర్లు కూడా కిడ్నీ దానం చేయడం వల్ల దాతకు ఎలాంటి నష్టం లేదని నిర్ధారించిన తర్వాతే మార్పిడికి మొగ్గుచూపుతారు.

దాతకు జాగ్రత్తలు...

సర్జరీ అనంతరం వైద్యుల సూచనల మేరకే దాత కొన్ని ఆరోగ్య సూత్రాలను విధిగా పాటించాల్సి ఉంటుంది. రోజువారీ పనుల్లో వెంటనే పాల్గొనకూడదు. వైద్యులు నిర్దేశించిన దానికంటే ఎక్కువ బరువులు మోయకూడదు. ఇలా నాలుగు వారాలపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మొదటి రెండువారాలు కొంచెం నీరసంగా ఉంటుంది. ఇలాంటప్పుడు ఎక్కువసేపు నిద్రపోవాలి లేదా రిలాక్స్ కావాలి. సాయంత్రాల్లో వాకింగ్ చేయడం ద్వారా కూడా మంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే సర్జరీ నిర్వహించిన భాగంలో కొంచెం వాపు లేదా నొప్పి కలగవచ్చు. కాబట్టి వదులుగా ఉండే దుస్తులు ధరించాలి. కొందరు కేవలం ఆరు వారాలకే కోలుకుని తమ దైనందిన జీవితంలో బిజీ అయిపోతారు. మరి కొంతమంది కోలుకోవడానికి మాత్రం ఇంకో రెండు మూడు వారాలు లేదంటే ఇంకొంచెం ఎక్కువ సమయం పట్టొచ్చు. శరీరం తత్వాన్ని బట్టి కోలుకోవడం ఆధారపడి ఉంటుంది. ఒకసారి కోలుకున్న తర్వాత ఇక కిడ్నీ మార్పిడికి చెందిన సమస్యలేమీ రావు. కాకపోతే మొదట్లోలాగా వారానికి, నెలకు కాకుండా ఏడాదికోసారి వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు నడుచుకోవాలి.

రోగికి జాగ్రత్తలు...

కిడ్నీ మార్పిడి తర్వాత రోగి చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యుల సూచనలను కచ్చితంగా పాటించాలి. రోగి ఇమ్యూనిటీ వ్యవస్థ ఇతరుల (దాత) అవయవాన్ని స్వీకరించడానికి వెంటనే సిద్ధపడదు. దీనికి చాలా సమయం పడుతుంది. కాబట్టి, సర్జరీ అనంతరం కొన్ని ప్రత్యేకమైన మందులు ఇవ్వడం ద్వారా రోగి ఇమ్యూనిటీ వ్యవస్థ అమర్చిన అవయవాన్ని శరీరం స్వీకరించేలా 'ఇమ్యూనోసప్రెసెంట్స్' మందులను రోజూ ఇస్తూ ఉంటారు. అలా కిడ్నీ పనితీరును ఎప్పటికప్పుడు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేసిన డాక్టర్ల బృందం క్షుణ్నంగా అధ్యయనం చేస్తూ ఉంటుంది. దవాఖాన నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కూడా రోగి మూడు నెలలపాటు వైద్యులను సంప్రదిస్తూనే ఉండాలి. ఆ తర్వాత రోగి పరిస్థితి మెరుగుపడుతున్న కొద్దీ డాక్టర్ల పర్యవేక్షణ అవసరం ఉండదు. అయినప్పటికీ వారి సూచనలను మాత్రం విధిగా పాటిస్తూనే ఉండాలి.



డాక్టర్. గుత్తా శ్రీనివాస్
సీనియర్ యూరాలజిస్ట్ & కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్

మంచి ఆహారం, రాత్రులు మంచినిద్ర తర్వాత కూడా కొంతమందిలో ఉదయం బద్ధకం, ఒత్తిడి, కుంగుబాటు, రోజంతా అలసిపోయిన లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. అత్యవసరమైన విటమిన్లు, కొన్ని పోషకాలు అందకపోతే ఇలా జరుగుతుంది. సాధారణంగా ఇలాంటి లక్షణాలు విటమిన్–బి12 లోపం వల్ల తలెత్తుతూ ఉంటాయి. సమస్యకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది.

రోజంతా అలసటా?

సంకేతాలు

- కుంగుబాటు, బలహీనత
- చర్మం పచ్చబడటం
- నాలుక ఎర్రబడటం లేదంటే పొక్కులు ఏర్పడటం
- నోట్లో పుండ్లు
- చూపు మందగించడం
- శ్వాసలో ఇబ్బంది
- తలనొప్పి, చెవుల్లో గుయ్యుమనే శబ్దాలు
- ఆకలి తగ్గిపోవడం

ఏం జరుగుతుంది?

విటమిన్– బి12 లోపం వల్ల నాడీ వ్యవస్థ, మెదడు బాగా ప్రభావితం అవుతాయి. ఈ విటమిన్ లోపించినప్పుడు ఎర్ర రక్తకణాలు తగ్గిపోతూ ఉంటాయి. దీంతో రక్తహీనత (ఎనీమియా) ముప్పు పెరుగుతుంది.దీంతో అలసట, బలహీనత, కుంగుబాటు మొదలైన లక్షణాలు కనిపిస్తాయి.

ఏ వ్యాధులు పీడిస్తాయి?



జ్ఞాపకశక్తి క్షీణత: విటమిన్– బి12 లోపం మెదడుపై పెద్ద ప్రభావాన్నే చూపుతుంది. ఇది జ్ఞాపకశక్తి క్షీణత, వృద్ధాప్యంలో డెమెన్షియా ముప్పును పెంచుతుంది. శారీరక, మానసిక అనారోగ్యాలు పెరుగుతాయి.

రక్తహీనత: రక్తహీనత, రక్త నష్టం, హిమోగ్లోబిన్ స్థాయులు పడిపోవడం సంభవిస్తాయి.

ఎముకల్లో నొప్పి: విటమిన్– బి12 తక్కువవడం వల్ల ఎముకల నొప్పి కూడా పెరుగుతుంది. అంతేకాకుండా నడుము, వెన్నులో నొప్పి కూడా పీడిస్తుంది.

నాడీ వ్యవస్థపై దుష్ప్రభావం: విటమిన్– బి12 లోపం తలెత్తినప్పుడు మన శరీరంలో ఉన్న మొత్తం నాడీ వ్యవస్థపై దుష్ప్రభావం పడుతుంది. రక్తం శరీరంలోని అన్ని భాగాలకు సవ్యంగా సరఫరా కాకపోవడంతో జీవితకాలం పట్టిపీడించే వ్యాధులు కూడా రావొచ్చు.

పొట్ట ఆరోగ్యం పదిలం!



రోగ నిరోధక వ్యవస్థ బలంగా ఉండాలంటే పొట్ట ఆరోగ్యం బాగా ఉండాలి. కాబట్టి, ఏది పడితే అది పొట్టలో వేసేసుకోకుండా.. జీర్ణవ్యవస్థ సంక్షేమం కోసం కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను ఎంచుకోవాలి. ఫైబర్ సమృద్ధిగా ఉన్నవి, ప్రొబయోటిక్ పదార్థాలను భోజనంలో భాగం చేసుకోవాలి. వీటివల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుంది. మొరంగడ్డ, పాలకూర, బీట్‌రూట్, క్యారట్ లాంటివి పొట్టకు మంచి చేసే ఫైబర్ గనులు. తాజా పండ్లలో కూడా ఫైబర్ ఎక్కువే. ధాన్యం కూడా బాగా మరాడించినవి కాకుండా ముతకవాటిని ఎంచుకోవాలి. యోగర్ట్, పెరుగు లాంటి ప్రొబయోటిక్ పదార్థాలు కూడా పొట్టలో బ్యాక్టీరియాకు మంచి మిత్రులు. వ్యాయామం శరీరాన్ని మాత్రమే కాదు పొట్టను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇక అతిగా మద్యం తాగడం శరీరానికి మాత్రమే కాదు, పొట్టలోని మంచి సూక్ష్మజీవులకూ చెరుపు చేస్తుంది. కాబట్టి, మద్యపానానికి దూరంగా ఉండటం మంచిది. మన ఆరోగ్యం పొట్ట– మెదడు అనుసంధానం మీద ఆధారపడి ఉంటుంది. అందుకే పొట్టను రెండో మెదడు అంటారు. అందువల్ల మానసిక ఒత్తిడిని దరిచేరనీయకూడదు. మల విసర్జన క్రమంలో మార్పులు, అసాధారణంగా బరువు తగ్గడం మలద్వారం నుంచి రక్తం పడుతున్నదంటే పొట్ట ఆరోగ్యంగా లేనట్టే. రోగ నిర్ధారణ, తగిన చికిత్స కోసం సంబంధిత వైద్యులను సంప్రదించాలి.

ప్రీమెచ్యూర్ బిడ్డకు.. కంటి పరీక్షలు ఎందుకు?

పిల్లల పెంపకం

నమస్తే డాక్టర్! మా పాప మూడు నెలలు ముందుగా జన్మించింది. పుట్టినప్పుడు కేవలం కిలో బరువుంది. ఇంక్యుబేటర్‌లో ఉంచారు. బిడ్డకు శ్వాస ఇబ్బంది తలెత్తింది. వైద్యుల సహకారంతో అన్ని రకాల చికిత్సలూ అందించాం. పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఆస్పత్రిలో ఉన్నప్పుడే బిడ్డకు రెండుసార్లు కంటి పరీక్షలు చేశారు. మళ్లీ చేయాలని చెబుతున్నారు. ప్రీమెచ్యూర్ బేబీకి ఇన్ని కంటి పరీక్షలు అవసరమా? భవిష్యత్తులో మా బిడ్డ కంటిచూపునకు ఏమైనా ఇబ్బంది తలెత్తే ప్రమాదం ఉందా? మేం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలియజేయగలరు.

• ఓ పాఠకురాలు

మూడు నెలలు ముందుగా పుట్టిన మీ అమ్మాయి.. ఆరోగ్యంగా ఇంటికి చేరడం ఆనందం కలిగించే విషయం. అయితే, ప్రీమెచ్యూర్ పిల్లలకు రకరకాల సమస్యలు ఉత్పన్నం అవుతూ ఉంటాయి. వాళ్లకు కంటి పరీక్షలు తప్పకుండా చేయించాల్సిందే! ఎందుకంటే.. కంటి వెనుక ఉండే కంటి తెర (రెటీనా) రక్తనాళాలు పిండస్థ దశలో ఎదిగి 36 వారాల వరకు, ఆ రక్తనాళాలు అభివృద్ధి చెందుతాయి. ప్రీమెచ్యూర్‌గా పుట్టిన బిడ్డకు రక్తనాళాలు పూర్తిస్థాయిలో వృద్ధి చెందవు. అవి క్రమంగా పెరుగుతుంటాయి. అయితే నెలల ముందుగానే పుట్టడం వల్ల రకరకాల కారణాల నేపథ్యంలో.. ఈ రక్తనాళాలు పెరగాల్సిన క్రమంలో కాకుండా, ఎగుడుదిగుడుగా పెరిగే అవకాశం ఉంటుంది. కొన్నిసార్లు అవి కంటిలో పల భారంగా మారి, రెటీనా తెరను లాగేయొచ్చు. దీన్నే రెటినల్ డిటాచ్‌మెంట్ అంటాం. అలాగే బ్లీడింగ్ కావొచ్చు. ఈ ఇబ్బంది ప్రధానంగా ప్రీమెచ్యూర్ పిల్లల్లో కనిపిస్తుంది. దీనిని రెటినోపతీ ఆఫ్ ప్రీమెచ్యూర్ అంటారు. ఈ బిడ్డలకు సరైన సమయంలో కంటి పరీక్షలు చేయించకపోతే.. ఏదైనా సమస్య ఉన్నా గుర్తించలేకపోవచ్చు. దాని పర్యవసానంగా వాళ్లు పూర్తిగా చూపు కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చు. ఇలాంటి ఇబ్బంది తలెత్తవద్దు అనుకుంటే.. బిడ్డకు క్రమం తప్పకుండా కంటిపరీక్షలు చేయించడం అవసరం. పరీక్షల ఫలితాల ఆధారంగా ఎగుడుదిగుడు రక్తనాళాలను గుర్తించొచ్చు. వాటికి ఇంజెక్షన్ ద్వారా గానీ, లేజర్ ద్వారా గానీ చికిత్స అందిస్తారు. ఇలా బిడ్డ చూపును కాపాడుకోవచ్చు. రెటినోపతి ప్రీమెచ్యూర్ అనేది నివారించదగ్గ అంధత్వం. కాబట్టి, మీ బిడ్డకు వైద్యులు సూచించినంత కాలం క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించండి.

అలాగే, హియరింగ్ టెస్ట్, కండరాలు, నరాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయో తెలుసుకునే.. డెవలప్‌మెంట్ అసెస్‌మెంట్ చేయించాలి. రెగ్యులర్ ఫాలోఅప్స్ అవసరం. ఇలా చేయడం వల్ల బిడ్డ శారీరకంగా, మానసికంగా ఎలాంటి సమస్యలు లేకుండా ఉంటుంది. ఏదైనా సమస్య ఉన్నా.. ముందస్తుగానే గుర్తించే వెసులుబాటు ఉంటుంది. సరైన చికిత్స అందించే అవకాశం ఏర్పడుతుంది.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

జింక్‌తో సింక్ అవుదాం

ఒక బిడ్డకు జన్మనిచ్చే శక్తి ఉన్న మహిళ.. నడివయసుకు వచ్చాక శక్తిచాలక అనారోగ్యంతో సావాసం చేస్తుంది. నలభైలో వచ్చే కీళ్ల నొప్పులతో అరవై దాకా బతుకీడుస్తుంది. యాభైలోనే రోగనిరోధక శక్తి ఉడిగిపోయి.. డెబ్బయ్ ఏండ్లు వచ్చేదాకా అవస్థలు పడుతుంది. ఇందుకు ప్రధాన కారణం నడి వయసులో శరీరానికి సరిపడా పోషకాలు అందకపోవడమే! విటమిన్స్, మినరల్స్‌తోపాటు జింక్ కూడా అతివ ఆరోగ్యంలో కీలకపాత్ర పోషిస్తుంది. శరీరంలో కొన్నిరకాల కీలకచర్యలు జరగడంలో ఈ ఖనిజం దోహదం చేస్తుంది. మహిళలకు ప్రతిరోజూ 9 మిల్లీగ్రాముల జింక్ అవసరం. ఇది రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. గాయాలను నయం చేస్తుంది. జింక్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు ఇవి. మీ డైట్ చార్ట్‌లో వీటికి చోటిచ్చి... ఆరోగ్యాన్ని పెంపొందించుకోండి.




మాంసాహారం, పౌల్ట్రీ ఉత్పత్తుల్లో జింక్ సమృద్ధిగా ఉంటుంది. మాంసాహారంతో పోలిస్తే.. శాకాహారంలో జింక్ లభ్యత తక్కువ. అయితే.. బ్రెడ్, చిక్కుళ్లు, కాయధాన్యాలు, పప్పు దినుసులు మొదలైన వాటిలో జింక్ లభిస్తుంది.




గుమ్మడి, పొద్దుతిరుగుడు గింజల్లో జింక్ అధికంగా లభిస్తుంది. ఈ గింజలను తినడం వల్ల మహిళల జీవక్రియకు అవసరమైన జింక్ అందుతుంది. రోగనిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది. హార్మోన్ స్థాయులు కూడా అదుపులో ఉంటాయి. వీటిని స్నాక్స్ రూపంలో, పెరుగు, సలాడ్స్‌లో కలిపి కూడా తినొచ్చు.

గుడ్డులో దాదాపు అన్ని పోషకాలు ఉంటాయి. ప్రొటీన్, విటమిన్లతోపాటు జింక్ కూడా వీటిలో దొరుకుతుంది. ఉడికించిన గుడ్డు గానీ, ఆమ్లెట్ రూపంలో అయినా తినొచ్చు.



డార్క్ చాక్లెట్‌లో జింక్ సమృద్ధిగా ఉంటుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యం, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. డార్క్ చాక్లెట్ తరచుగా తీసుకుంటే శరీరానికి అవసరమైన జింక్ లభిస్తుంది. 70% కోకో ఉన్న డార్క్ చాక్లెట్‌ను మితంగా తీసుకుంటే మంచిది.



జీడిపప్పు, బాదం పప్పు, వాల్‌నట్స్, పిస్తాలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్‌తో పాటు జింక్ తగిన మోతాదులో ఉంటుంది. ఇది మహిళల్లో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.


పాలు, పెరుగు, జున్ను, వెన్న లాంటి పాల ఉత్పత్తుల్లో జింక్, కాల్షియం లభిస్తాయి. ఇవి ఎముకలను దృఢంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

50 వేల కోట్ల అప్పు

> మొదటిపేజీ తరువాయి...

కాదు.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. రోజుకు సగటున రూ. 210 కోట్ల చొప్పున అప్పు చేస్తున్నారు. అలా అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రూ. 50 వేల కోట్లు అప్పు చేశారు. గడిచిన 60 ఏండ్ల ఉమ్మడి పాలనలో తెలంగాణకు సంబంధించి గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ. 72 వేల కోట్లుగా ఉండగా.. ఆ రికార్డును ఏడాదిలోనే అధిగమించేందుకు రేవంత్ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది. సరే.. చేసిన ఆ అప్పు ద్వారా సేకరించిన సొమ్మునైనా ప్రాజెక్టులు, ప్రజా సంక్షేమానికైనా ఖర్చు పెట్టారా? అంటే అదీ లేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల ద్వారా సేకరించిన ధనం.. ఎటు వెళ్తున్నదన్న ప్రశ్న యావత్తు తెలంగాణ సమాజంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్‌హయాంలో అప్పులు చేయడాన్ని ఓ పాపంగా వల్లెవేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి రాగానే అప్పులే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు. 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలన్నీ కలిపి తెలంగాణకు సంబంధించి రూ. 72,658 కోట్లు అప్పుగా చేస్తే, గడిచిన 8 నెలల పాలనలో రేవంత్ ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు అప్పులు చేయడమే దీనికి రుజువు. ఈ ఏడాది జూలై 24 నాటికి రూ.35,118 కోట్లు అప్పుగా తీసుకున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ సర్కారు వెల్లడించింది. అనంతరం.. రిజర్వు బ్యాంకు వద్ద ఈ నెల 6న రూ. 3 వేల కోట్లు అప్పు చేసింది. 13న (మంగళవారం) మరో రూ.3000 కోట్ల అప్పు తీసుకొనేందుకు చర్యలు చేపట్టింది. అంతక్రితం హెచ్‌డీసీవో నుంచి రూ. 3 వేల కోట్లు, ఎన్సీడీసీ నుంచి మరో రూ. 5 వేల కోట్లు ఇలా మొత్తంగా 8 నెలల్లో రేవంత్ ప్రభుత్వం రుణాలు రూ. 50,118 కోట్లకు చేరాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం రూ.62,012 కోట్లు రుణ సమీకరణ చేయనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. బహిరంగ మార్కెట్ నుంచి రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు అలా మొత్తంగా రూ. 62 వేల కోట్లు సమీకరించనున్నట్టు వివరించింది.



దుష్ప్రచారంతో పబ్బం

పదేండ్లపాలనలో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పులపాల్జేసిందని రేవంత్ ప్రభుత్వం తరుచూ దుష్ప్రచారాన్ని చేస్తున్నది. అయితే, తీసుకొచ్చిన అప్పులను చూస్తున్నారేగానీ, రాష్ట్రంలో పెంచిన ఆస్తుల విలువను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవట్లేదని తెలంగాణ మేధావులు అంటున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు తెచ్చిన అప్పులను పెట్టుబడిగా మార్చి.. భవిష్యత్తులో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆదాయ వనరుగా మారే ప్రాజెక్టుల్లోనో, ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థను ఏర్పాటు చేయడానికో వాడుతుంటాయి. ఉదాహరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు తీసుకొచ్చి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసింది. ఇవి ప్రత్యక్షంగా ప్రజలకు, పరోక్షంగా ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారాయి. రుణాల ద్వారా మిషన్ భగీరథ వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఇది ఆదాయ వనరు కాకపోయినా, ప్రజల జీవన స్థితిగతులను మార్చింది. ఇలాంటి పథకాలు, ప్రాజెక్టులను గత 8 నెలల్లో రేవంత్ ప్రభుత్వం ఒక్కటి కూడా ప్రకటించలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 వేల కోట్ల భారీగా అప్పులు చేసినప్పటికీ ఆ సొమ్మును దేనికి వెచ్చిస్తున్నదో ఎవరికీ అంతుచిక్కడం లేదు. రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయని రేవంత్ సర్కారు.. ఎంతో ఆర్భాటంగా చెప్పుకొంటున్న 'మహాలక్ష్మి' పథకానికీ నిధులు విదల్చడం లేదు. దీంతో అప్పుగా తీసుకొచ్చిన సొమ్ము ఎటు వెళ్తున్నదన్న చర్చ మొదలైంది.



సీఎం రేవంత్ ఒక్కడే 8 నెలల్లో చేసిన అప్పు

50,118 కోట్లు

సృష్టించిన సంపదపై నోరు మెదపరేం?!

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అప్పుల కుప్పగా మారిందంటూ దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గత పదేండ్లలో రాష్ట్ర సంపద ఎలా పెరిగిందో చెప్పడానికి మనసురావడం లేదు. వాస్తవానికి దేశంలోని అనేక రాష్ట్రాలు తెలంగాణ కంటే ఎక్కువ అప్పులు చేశాయి. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పరిమితికి లోబడే వ్యవహరించింది. ఇష్టారాజ్యంగా కాకుండా అవసరం మేరకే రుణాలు తెచ్చి ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధికి వెచ్చించిందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. 2023-24 నాటికి తెలంగాణ ప్రభుత్వం రూ.3.89 లక్షల కోట్ల రుణాలు సేకరించినట్టు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 5న లోక్‌సభలో వెల్లడించింది. ఇది తెలంగాణ జీఎస్డీపీలో 27.8 శాతానికి సమానమని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో పేర్కొన్నది. 2014లో స్వరాష్ట్రంగా ఏర్పడేనాటికి అన్ని రంగాల్లో అధ్వాన స్థితిలో ఉన్న తెలంగాణ.. 2024 నాటికి రాష్ట్ర బడ్జెట్, రెవెన్యూ రాబడులు, తలసరి ఆదాయం, జీఎస్డీపీ పెరుగుదల ఇలా అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలకు చేరింది. దీన్నిబట్టే గత పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ సంపద గణనీయంగా పెరిగినట్టు స్పష్టమవుతున్నది. ఇదే సమయంలో హద్దులు దాటి రెట్టింపు అప్పులు చేసిన రాష్ట్రాలు ఎన్నో ఉన్నాయి. ఈ జాబితాలో పశ్చిమ బెంగాల్ 37.1% అప్పులతో అగ్రస్థానంలో ఉన్నట్టు కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి దేశ అప్పు రూ.185 లక్షల కోట్లకు చేరుతుందని, ఇది జీడీపీలో 56.8 శాతానికి సమానమని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెట్‌లో పేర్కొన్నది.



రేవంత్ ప్రభుత్వం రుణాలు ఇలా..

తేదీ	రుణం (కోట్లలో)
13.08.2024	3000
06.08.2024	3000
30.07.2024	1000
25.07.2024	5000
23.07.2024	3000
16.07.2024	2000
02.07.2024	2000
25.06.2024	1000
18.06.2024	2000
04.06.2024	2000
14.05.2024	1000
07.05.2024	3000
23.04.2024	1500
09.04.2024	1500
02.04.2024	1000
26.03.2024	1718
19.03.2024	2000
12.03.2024	2000
05.03.2024	3000
05.03.2024	2000
13.02.2024	1000
06.02.2024	2000
23.01.2024	1000
16.01.2024	2000
19.12.2023	900
12.12.2023	500
మొత్తం	50,118

ఆదాయాన్ని పెంచడానికే అప్పుడు రుణాలు

స్వరాష్ట్రంగా ఏర్పడేనాటికి తెలంగాణ అప్పులు రూ.72,658 కోట్లుగా ఉన్నట్టు నిరుడు డిసెంబర్‌లో విడుదల చేసిన శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొన్నది. అంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి తెలంగాణపై ఉన్న రుణభారం అది. కేంద్రంలోనూ అంతే. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి దేశ అప్పు రూ.55 లక్షల కోట్లు. వాటిని ఆ తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం చెల్లించింది. కానీ, గత పదేండ్లలో దేశంపై ఏకంగా రూ.130 లక్షల కోట్ల రుణ భారాన్ని మోపింది. ఆ అప్పులను తర్వాతి ప్రభుత్వాలు చెల్లించాల్సిందే. అయితే, అప్పుల ద్వారా సేకరించిన ధనాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారన్న అంశమే ఇక్కడ ప్రధానం. 2014లో తెలంగాణ బడ్జెట్ రూ.లక్ష కోట్లు మాత్రమే. అప్పటి అప్పు బడ్జెట్‌లో 72 శాతంగా ఉన్నది. దీంతో రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం రుణాలను సేకరించి, ఆ నిధులను మూలధన వ్యయంగా ఖర్చు చేసింది. అటు మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఇటు భారీ ప్రాజెక్టులు, పథకాలు అమలు చేసింది. ఫలితంగా తెలంగాణ జీఎస్డీపీ, రాబడి, తలసరి ఆదాయం రెండున్నర రెట్ల మేరకు పెరిగాయి. అయితే, అప్పులను చేసుకుంటూపోతున్న రేవంత్ ప్రభుత్వం.. ఆ మొత్తాన్ని పథకాలకూ కాకుండా, మౌలిక సదుపాయాలకూ కాకుండా ఇంకా దేనికి వినియోగిస్తున్నదన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం.. ఆ మొత్తాన్ని గత బీఆర్ఎస్ సర్కారులాగే తెలంగాణ అభివృద్ధికి వినియోగించకపోతే..రాష్ట్రం దివాళా తీయడం ఖాయమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలు

- రైతుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సమతూకం
- పెట్టుబడులూ భారీగా వచ్చాయి: జయప్రకాశ్



హైదరాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జయప్రకాష్ నారాయణ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చి రైతుల అప్పులు తీర్చడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం అభివృద్ధిలో సమతూకం పాటించారని, మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, పెట్టుబడులు కూడా భారీగా వచ్చాయని ప్రశంసించారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడిన రోజు దేశంలో అతి ఎక్కువ మిగులు ఉన్న రాష్టంగా ఉండేదని, 14వ ఆర్థిక సంఘం నివేదికలో రూ.1.16లక్షల కోట్ల రెవెన్యూ మిగులు రాష్ట్రంగా చూపారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్-1గా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 31వేల కోట్లు అప్పులు తెచ్చి రైతుల అప్పులు తీరుస్తున్నారని, ప్రపంచంలోనే అనితర సాధ్యమైనదాన్ని సాధించినట్టు ప్రకటనలు ఇచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలా చేయడం ద్వారా అప్పులు సకాలంలో చెల్లించేవాడు మూర్ఖుడు.. ఎగ్గొట్టేవాడు తెలివిగలవాడు అనే సంకేతాలు ఇస్తున్నారా..? అని ప్రశ్నించారు. అంతేకాదు, రుణాలు తీసుకోండి.. మేము వచ్చాక మాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికలప్పుడు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇదేనా సమాజానికి మనం ఇచ్చే సంకేతం అని ప్రశ్నించారు. ఇలా చేయడం వల్ల రేపు రైతులకు రుణాలు వస్తాయా? బ్యాంకులు అప్పులు ఇవ్వకపోతే మళ్లీ రైతులు ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తుంది అన్నారు. రైతుల పేరు చెప్పి రైతులను భవిష్యత్తును ధ్వంసం చేస్తున్నాం.. సమాజాన్ని నాశనం చేస్తున్నాం, ఆర్థిక వ్యవస్థను పతనం చేస్తున్నాం అని జేపీ ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణలోని సమస్యలు తెచ్చిపెట్టుకున్నవని, స్వయంకృతాపరాధమని చెప్పారు. బంగారంలాంటిది ఉంటే దాన్ని సక్రమంగా ఉపయోగించుకోవడం కాకుండా అధికారం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయినా ఫరవాలేదనేలా వ్యవహరించారని అన్నారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే పచ్చటి రాష్ట్రంలో చిచ్చుపెట్టినవాళ్లవుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ బంగారు గుడ్డుపెట్టే బాతు వంటిది అయినందున ఇప్పటికైనా ఆర్థిక ఇబ్బందల నుంచి బయటపడడం సాధ్యమేనని స్పష్టం చేశారు. అవినీతి వల్ల, అసమర్థత వల్ల, మూర్ఖపు విధానాల వల్ల ఈ బంగారు బాతును చంపకుండా ఉంటే తెలంగాణను కాపాడుకోవచ్చని చెప్పారు.

జాబ్ క్యాలెండర్ అబద్ధం...

జాబ్ క్యాలెండర్ అంత పచ్చి అబద్ధం మరొకటి లేదని జయప్రకాష్ నారాయణ అన్నారు. వందమంది సమాజంలో పనిచేస్తుంటే అందులో ముగ్గురికే ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని, ఆ ముగ్గురు కూడా మనకి పనికొచ్చే పని చేయడంలేదని అన్నారు. కూర్చునే కుర్చీ దగ్గర్నుంచి, చేతికి పెట్టుకునే వాచీ, వేసుకునే బట్టల వరకు ఏవీ ప్రభుత్వం తయారు చేయడంలేదని అన్నారు. జాబ్ క్యాలెండర్ కేవలం డ్రామా అన్నారు. వంద ఉద్యోగాలకు లక్ష మంది పోటీ పడుతుంటే, వయో పరిమితి పెంపు ద్వారా రెండు లక్షల మంది పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. అయినా వస్తున్న ఉద్యోగాలు వంద మాత్రమేనని తెలిపారు. మిగిలినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ద్వారా అందరికీ ఉద్యోగాలు వస్తాయనడం పచ్చి అబద్ధమని స్పష్టంచేశారు.

కలెక్టర్ కన్నా ప్లంబర్ అవసరమే ఎక్కువ...

ఎక్కడో దూరంగా ఉన్న కలెక్టర్ కన్నా బాత్రూమ్ తూములో పూడికతీసే ప్లంబర్ చాలా మిన్న అని జేపీ చెప్పారు. కలెక్టర్ లేకుంటే ఎవరికైనా నష్టం జరిగిందా, కలెక్టర్ లేకపోవడంవల్ల నా బతుకు చిందరవందర అయిందనేవారు ఎక్కడైనా ఉన్నారా అని ప్రశ్నించారు. బాత్రూమ్ తూములో పూడిక తీయకపోతే మీరు బతకగలరా అని చెప్పారు.



తెలంగాణ భవన్‌లో రుణమాఫీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

రుణమాఫీపై గవర్నర్‌ను కలుస్తాం

- రుణమాఫీకాని రైతుల వివరాలు అందిస్తాం
- ఇప్పటికి 72వేల ఫిర్యాదులు
- ప్రభుత్వం దృష్టికీ తీసుకెళ్తాం: హరీశ్‌రావు
- తెలంగాణ భవన్‌లో హెల్ప్ లైన్ సెంటర్ పరిశీలన

తేదీ	ఫిర్యాదుల సంఖ్య
ఆగస్టు 6	26,864
ఆగస్టు 7	13,384
ఆగస్టు 8	8,216
ఆగస్టు 9	1,862
ఆగస్టు 10	3,304
ఆగస్టు 11	2,630
ఫోన్‌కాల్ ద్వారా	16,287
మొత్తం	72,547

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ రుణమాఫీ చేయాలని గవర్నర్‌ను కలవనున్నట్టు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఇప్పటి వరకు 72 వేల ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు. రుణమాఫీకానీ రైతుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన రుణమాఫీ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సోమవారం హరీశ్‌రావు పరిశీలించారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు, మేసేజ్‌లపై ఆరా తీశారు. ఈ వివరాలన్నింటినీ గవర్నర్‌కు, ప్రభుత్వానికి అందచేస్తామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులకు అండగా నిలిచేందుకు తెలంగాణ భవన్‌లో ఈనెల 6 నుంచి హెల్ప్‌లైన్ సెంటర్(నంబర్ 83748 52619)ను ప్రారంభించారు. హరీశ్‌రావు వెంట మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నే గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పెండింగ్.. బీఆర్ఎస్ రన్నింగ్

హస్తంపార్టీ హయాంలో దశాబ్దాలపాటు ప్రాజెక్టుల పనులు

- ఎస్సారెస్పీ స్టేజ్-2.. కృష్ణాబేసిన్ పథకాలే ఇందుకు నిదర్శనం
- ఏండ్ల తరబడి ముందుకుసాగని ఎల్లంపల్లి, మిడ్ మానేరు
- కేసీఆర్ సారథ్యంలోనే పరుగులు పెట్టిన అనేక ప్రాజెక్టులు
- నిర్ణీత గడువులోనే అనుమతులు సహా పనులన్నీ పూర్తి
- స్వల్పకాలంలోనే తుమ్మిళ్ల, భక్తరామదాసు, కాళేశ్వరం, పాలమూరు, సీతారామ పథకాలు కంప్లీట్

హైదరాబాద్, ఆగస్టు12 (నమస్తే తెలంగాణ): ప్రాజెక్టుల మంజూరుకు ఏండ్లు! ఆ తర్వాత సర్వేకోసం మరికొన్నేండ్లు! శంకుస్థాపనకు ఇంకొన్ని సంవత్సరాలు! ఆ తర్వాతైనా పనులు పూర్తవుతాయా? అంటే అదీ లేదు! అనుమతుల మాటంటారా.. ఆ ఊసన్నదే ఉండదు! ఎక్కడివక్కడే పెండింగ్! దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాజెక్టుల దుస్థితి ఇది! సూటిగా చెప్పాలంటే పెండింగ్ అనే పదానికే కాంగ్రెస్ జమానా చిరునామా! నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణను సాధించి పాలనా పగ్గాలు చేపట్టాక, మొట్టమొదటి నినాదమైన నీళ్లను రైతులకు అందించి మన భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. పెండింగ్ ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ జమానాలో రన్నింగ్ ప్రాజెక్టులుగా మారాయి. నిర్దేశిత గడువు, నిర్ణీత సమయానికి పూర్తయి సాగునీటి ఫలాలను రైతాంగానికి అందించాయి. ఏకకాలంలోనే పలు మేజర్ ప్రాజెక్టుల అనుమతులను కూడా సాధించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కింది.

ఎన్నో ప్రాజెక్టులు ఏండ్ల తరబడి..

కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టుల పనులన్నీ ఏండ్ల తరబడి కొనసాగాయి. కల్వకుర్తి, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలే ఇందుకు నిదర్శనంగా నిలిచాయి. ఈ ప్రాజెక్టుల సర్వే కోసం 1984లో జీవో జారీ చేయగా, ఐదేండ్ల తర్వాత సర్వే కోసం సర్కిల్ కార్యాలయం ఏర్పాటైంది. 1997లో సర్వే కోసం రూ.50 లక్షలు మంజూరు కాగా, 1999లో పరిపాలనా అనుమతులు వచ్చాయి. 2003లో టెండర్ల ప్రక్రియ పూర్తయి టీడీపీ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. మొత్తంగా ప్రాజెక్టు సర్వేకు 1984 జీవో జారీ చేస్తే 20 ఏండ్ల తర్వాత ఎన్నికల ముందు, తర్వాత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పనులు పూర్తి చేయలేదు. నిధుల కొరత, భూసేకరణ, అటవీ అనుమతులు, రైల్వే, రోడ్డు క్రాసింగ్, అంతర్రాష్ట్ర వివాదాలు, కాంట్రాక్టు సంస్థలతో వివాదాలు, కోర్టు కేసులు తదితర సాకులతో ప్రాజెక్టులను మూలకునెట్టింది. ఎత్తిపోతల పథకాల్లో సంక్లిష్టమైన పంప్‌హౌస్, సర్జ్‌పూల్‌ల నిర్మాణం, పంపులు, మోటర్లను బిగింపు, విద్యుత్ సరఫరా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్మిషన్ లైన్ల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ కాలువలకు కావాల్సిన భూసేకరణ సైతం పూర్తి చేయలేదు. రెండు ప్రాజెక్టులే కాకుండా కోయిల్‌సాగర్, రాజీవ్‌భీమా, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ స్టేజ్-2, వరద కాలువ, దేవాదుల ఎత్తిపోతలు ఇలా చెప్పుకొంటూ పోతే పూర్తికాని ప్రాజెక్టులు కోకొల్లలుగా ఉన్నాయి.

బీఆర్ఎస్ హయాంలో చకచకా..

రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సారథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ రన్నింగ్ ప్రాజెక్టులుగా మారాయి. ఇంజినీరింగ్ నిపుణులతో కూలంకషంగా సమీక్షించి సమస్యలు పరిష్కరించారు. క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిరంతర పర్యవేక్షణతో ప్రాధాన్యత క్రమంలో నిధులు సమకూర్చుతూ, అనుమతులను సత్వరమే జారీ చేస్తూ పనులను పరుగులు పెట్టించారు. కేవలం రెండేళ్లలోనే ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టు పనులను 50శాతం నుంచి 95 శాతం పూర్తిచేశారంటే కేసీఆర్ అకుంఠిత దీక్షను అర్థం చేసుకోవచ్చు. 2016-17లో కల్వకుర్తి ద్వారా 3.07 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ద్వారా 1.2 లక్షలు, భీమా ద్వారా 1.58 లక్షల ఎకరాలు, కోయిల్‌సాగర్ ద్వారా 8 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు.. మొత్తం నాలుగు ఎత్తిపోతల పథకాల ద్వారా 5 లక్షల ఎకరాలకు తొలిసారిగా సాగునీటిని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. క్రమంగా డిస్ట్రిబ్యూటరీల పనులను పూర్తి చేస్తూ నేడు ప్రాజెక్టుల కింద నికరంగా 10లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ఆర్డీఎస్ ఆయకట్టు కోసం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి కేవలం 11నెలల వ్యవధిలోనే పూర్తిచేశారు. బృహత్తర పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడమే కాకుండా ప్రధాన పనులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. గోదావరి బేసిన్‌లోనూ మిడ్‌మానేరు, ఎల్లంపల్లి ప్రాజెక్టులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. వరద కాలువ సజీవజల ధారగా మారింది. బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్ల కనిష్ఠ సమయంలోనే కేసీఆర్ సర్కార్ పూర్తిచేసింది. ఖమ్మం జిల్లాలో భక్తరామదాసు ప్రాజెక్టును 10నెలల్లోనే పూర్తిచేశారు. సీతారామ ప్రాజెక్టు పనులన్నీ పూర్తిచేసి ట్రయల్‌రన్‌కు సిద్ధం చేసిపెట్టారు. అనుమతులు సైతం ప్రస్తుతం తుదిదశలో ఉన్నాయి. ఇవీ గాక దశాబ్దాలుగా పెండింగ్ ప్రాజెక్టులుగా ముద్ర వేసుకున్న అనేక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కింది.



ప్రాజెక్టు	ఉమ్మడి జిల్లా	ప్రారంభం-పూర్తి	వినియోగంలోకి తెచ్చింది	అదనపు ఆయకట్టు (ఎకరాల్లో)
....కృష్ణాబేసిన్‌లో....				
జూరాల	మహబూబ్‌నగర్	1982-1995	టీడీపీ	1,30,000
కోయిల్‌సాగర్(లిఫ్ట్)	మహబూబ్‌నగర్	2000-2017	బీఆర్ఎస్	8000
రాజీవ్‌భీమా	మహబూబ్‌నగర్	2003-2016	బీఆర్ఎస్	1,58000
నెట్టెంపాడు	మహబూబ్‌నగర్	2005-2016	బీఆర్ఎస్	1.42000
కల్వకుర్తి	మహబూబ్‌నగర్	2003-2016	బీఆర్ఎస్	3,07,000
తుమ్మిళ్ల లిఫ్ట్	మహబూబ్‌నగర్	2018-2018	బీఆర్ఎస్	87000
పీఆర్ఎల్ఐఎస్	మహబూబ్‌నగర్	2015-2023	బీఆర్ఎస్	(డిస్ట్రిబ్యూటరీలు తవ్వాల్సి ఉంది)
....గోదావరి బేసిన్‌లో....				
వరద కాలువ	కరీంనగర్	1991-2019	బీఆర్ఎస్	51,000
ఎస్సారెస్పీ స్టేజీ- 2	వరంగల్	2002-2019	బీఆర్ఎస్	3,81,000
మిడ్‌మానేరు	కరీంనగర్	2005-2018	బీఆర్ఎస్	100000
ఎల్లంపల్లి	కరీంనగర్	2004-2016	బీఆర్ఎస్	54000
కాళేశ్వరం	కరీంనగర్	2016-2019	బీఆర్ఎస్	1.30,000 (కొత్తది మాత్రమే)
భక్తరామదాసు	ఖమ్మం	2016-2017	బీఆర్ఎస్	60,000
సీతారామ	ఖమ్మం	2017-2023	బీఆర్ఎస్	100000

'గడల' గుడ్ బై

శ్రీనివాసరావు వీఆర్ఎస్‌కు ప్రభుత్వం ఆమోదం



హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): మాజీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) గడల శ్రీనివాసరావు వైద్యారోగ్య శాఖలో తన ప్రస్థానానికి ముగింపు పలికారు. ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తును (వీఆర్ఎస్) ప్రభుత్వం ఆమోదించింది. 6 నెలల తర్వాత ఆయన వీఆర్ఎస్‌ను ఆమోదిస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఏడేండ్ల సర్వీస్ ఉండగానే గడల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ప్రజారోగ్య విభాగంలో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయనను గత నెల 27న మహబూబాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. కానీ ఆయన విధుల్లో చేరలేదు. గడల శ్రీనివాసరావు 2018 మే నుంచి 2023 డిసెంబర్ 20వరకు సుదీర్ఘ కాలం డీపీహెచ్‌గా కొనసాగారు.

కరోనా సమయంలో ఫుల్ క్రేజ్

గడల శ్రీనివాసరావు నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్నప్పుడే మాజీ సీఎం కేసీఆర్ ఆయన సమర్థతను గుర్తించారు. సీనియర్లను కాదని 2018 మే 28న డీపీహెచ్‌గా నియమించారు. స్వేచ్ఛగా పనిచేసుకునే అవకాశం ఇచ్చారు. విపత్తుల సమయంలో గడల సమర్థంగా పనిచేశారు. 2019లో డెంగ్యూ విజృంభించగా.. తక్కువ సమయంలోనే అదుపులోకి తీసుకురాగలిగారు. ఇక కరోనా విపత్తు సమయంలో గడల శ్రీనివాసరావు పేరు మార్మోగిపోయింది. నాటి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొవిడ్ నియంత్రణ, చికిత్స, వ్యాక్సినేషన్‌ను సమర్థంగా నిర్వహించారు. గడలకు బీఆర్ఎస్ ముద్ర ఉండటంతో కాంగ్రెస్ ఆయనను పక్కనబెట్టింది. దీంతో ఆయన వీఆర్ఎస్ తీసుకున్నారు.

డీసీసీబీలో రుణమాఫీ కుంభకోణం

వరంగల్ జిల్లాలో కదులుతున్న డొంక

నల్లబెల్లి, ఆగస్టు 12: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీసీసీ బ్యాంకులో భారీ రుణమాఫీ కుంభకోణం బయటపడుతున్నది. పోలీసులు విచారణ చేపట్టి తీగ లాగితే డొంక కదులుతున్నది. మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆధార్ నమోదును తప్పులతడకగా పంపించటంతో అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించలేదు. దీనిని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ మిస్‌మ్యాచ్ సమస్యను గుర్తించారు. మండలంలోని ఓ తండావాసులు గత ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా పాస్ పుస్తకాలు పోయినట్టు తహసీల్దార్ కార్యాలయంలో అప్లికేషన్ పెట్టి డూప్లికేట్ పొంది అక్రమంగా రుణాలు తీసుకున్నట్టు తెలిసింది. అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది, పాలకవర్గం కుమ్మక్కై అధిక రుణం మంజూరుచేసి వారికి పావు వంతు ఇచ్చి మిగతా డబ్బులను సీఈవో నేతృత్వంలో పంచుకున్నట్టు సమాచారం. నంది గామకు చెందిన భూక్యా రాములు రుణమాఫీ మంజూరులో అధికారుల చేతుల్లో మోసపోయానని చెప్తున్నాడు. తనకు గ్రామంలో 10 ఎకరాల భూమి ఉండగా, తనతో పాటు తన భార్య మమత పేరున పీఏసీఎస్ కార్యాలయంలో క్రాప్‌లోన్ కోసం దరఖాస్తు చేసుకోగా 2021లో రూ.4 లక్షలు రుణం మంజూరు చేశారని చెప్పారు. ఈ రుణాన్ని 2023లో మూడు దఫాలుగా రూ.2.50 లక్షలు సీఈవో ఇచ్చారని, మిగతా రూ.లక్షన్నర పీఏసీఎస్ సార్లే వాడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తన పేరున రూ.5 లక్షలకుపైగా అప్పు ఉన్నట్టు బ్యాంకులో చూపిస్తున్నదని ఆ దంపతులు వాపోయారు. వీరు ఆదివారం పీఏసీఎస్ అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన రైతు కొమ్ము రాజు రూ.75 వేలు రుణం తీసుకోగా వడ్డీతో కలిసి రూ.85 వేలు ఉన్నట్టు తెలిపారు. ఈ డబ్బులను 2023లో రెన్యువల్ చేసి 2024లో ఏకంగా రూ.1.96 లక్షల అప్పు ఉన్నట్టు బ్యాంకు అధికారులు చూపెట్టడంతో అవాక్కైన బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీఏసీఎస్ అధికారులపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్సై ప్రశాంత్‌బాబు విచారణ చేపట్టారు. విచారణలో సంబంధిత సీఈవో అప్రూవర్‌గా మారి బ్యాంకులో జరిగిన అక్రమాలను పోలీసులకు క్షుణ్ణంగా చెప్పటంతో డీసీసీ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగులోకి వస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న యోచనతో మండలంలోని అనేక మంది రైతుల పేరున అధికారులు పెద్దమొత్తంలో రుణం మంజూరు చేసి రూ.కోట్లు కాజేసినట్టు బహిర్గతం అవుతున్నది.



నందిగామ డీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై విచారణ చేస్తున్న ఎస్సై

'ఎట్ హోమ్' ఆహ్వానం అందుకున్న ఆకర్షణ



ఆకర్షణ

అమీర్‌పేట్, ఆగస్టు 12: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే సంప్రదాయ 'ఎట్ హోమ్' రిసెప్షన్ ఆహ్వానాన్ని అందుకున్నారు నగరానికి చెందిన ఆకర్షణ సతీశ్. బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ గ్రేడ్ చదువుతున్న ఆమె తాను స్వయంగా సేకరించిన 9,836 పుస్తకాలతో ఇప్పటివరకు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 15 గ్రంథాలయాలను నెలకొల్పడం విశేషం. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా తాను నిర్వహించే 'మన్ కీ బాత్'లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే సంప్రదాయ 'ఎట్ హోమ్' రిసెప్షన్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేకత కలిగి ఉన్న 23మందికి ఆహ్వానాలు అందగా, వారిలో నగరానికి చెందిన ఏకైక బాలిక ఆకర్షణ కావడం గమనార్హం.

రెండు లా కాలేజీల్లో అడ్మిషన్లు నిలిపివేత

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): వరంగల్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లా, కాకతీయ విశ్వవిద్యాలయం(వరంగల్), అనంత లా కాలేజీ(కూకట్‌పల్లి)లో న్యాయశాస్త్ర ప్రవేశాలు ఆపినట్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫు సీనియర్ న్యాయవాది రవిచందర్ హైకోర్టుకు నివేదించారు. మిగిలిన కాలేజీల్లో 5 నుంచి ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రారంభమైందని తెలిపారు. యూజీసీ నిబంధనలు ఉల్లంఘించడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. లా కాలేజీలు, నల్సార్ విశ్వవిద్యాలయం బకాయిలున్నాయని రవిచందర్ చెప్పడంపై చీఫ్ జస్టిస్, నల్సార్ వర్సిటీకి చాన్స్‌లర్‌గా ఉన్న కారణంగా వ్యాజ్యాన్ని విచారించేందుకు నిరాకరించారు. జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపడుతుందని చీఫ్ జస్టిస్ ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ గౌడ్

వైన్స్ అక్రమ సిట్టింగులను తొలగించాలి

- **బార్, రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్**

ఖైరతాబాద్, ఆగస్టు 12: రాష్ట్రంలోని వైన్ షాపుల వద్ద అక్రమ సిట్టింగులను తొలగించాలని బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంఅలో ఆయన మాట్లాడారు. జీవో 25 ప్రకారం వైన్‌షాప్ పర్మిట్ గది 100 చదరపు మీటర్లు ఉండాలని, ఎలాంటి బెంచీలు, కుర్చీలు, తినుబండారాలు లేకుండా నిర్వహించాలని పేర్కొన్నారు. వైన్స్‌కు, బార్లకు మధ్య ఉన్న దూరాన్ని పెంచి, బార్‌ల వైశాల్యంపై విధిస్తున్న అధిక పన్నును ఉపసంహరించుకోవాలని, కనీసం 700 చదరపు మీటర్ల వైశాల్యాన్ని పెంచాలని కోరారు. లైసెన్సు రెన్యువల్ విధానాన్ని ఐదేండ్లకోసారి చేపట్టాలని, బార్ రెంటల్ అగ్రిమెంట్ విధానాన్ని ట్రేడ్ లైసెన్స్ ఫీజులాగా రెంటల్స్‌పై స్టాంప్ డ్యూటీ రూపంలో తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామకృష్ణ, రాజు గౌడ్, నరసింహ గౌడ్, వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి తిరుపతయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శి నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీకి 6 వేల లంచం!

- **అలాగైతేనే బుకింగ్.. లేకుంటే లేదు**
- **లోడింగ్ పేరుతో మరో రూ.వెయ్యి**
- **ఒక్కో లారీపై రూ.7,000 అదనపు వసూలు**
- **పనిచేయని టీజీఎండీసీ ఆన్‌లైన్ వ్యవస్థ**
- **బాట్ సాఫ్ట్‌వేర్‌తో అక్రమంగా బుకింగ్**
- **వినియోగదారులపై తప్పని భారం**
- **కృత్రిమ కొరత సృష్టిస్తున్న అధికారులు**



టీజీఎండీసీ కార్యాలయంలో చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లారీ యజమానులు

హైదరాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): 'ఇసుక కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేదు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే ఇంటికే వస్తుంది' అంటూ టీజీఎండీసీ అధికారులు చెప్తున్న మాటలు బూటకమని తేలిపోయింది. ఒక్కో లారీ ఇసుక బుకింగ్‌కు రూ. 6 వేల లంచం సమర్పించుకుంటే తప్ప బుకింగ్ కావటం లేదు. లోడింగ్ పేరుతో మరో రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో ఈ మొత్తాన్ని లారీ యజమానులు వినియోగదారులపై మోపుతున్నారు. లంచాన్ని నిలువరించాలని కోరుతూ సోమవారం లారీ యజమానులు టీజీఎండీసీ కార్యాలయంలో ఆందోళన నిర్వహించి చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా టీజీఎండీసీ ద్వారా ప్రతి నెల సగటున వర్షాకాలంలో 20 లక్షల మెట్రిక్ టన్నులు, మిగిలిన కాలాల్లో 40 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ఇసుక విక్రయాలు జరుగుతాయి. బల్క్‌గా ఇసుకు తెచ్చుకునే బడా బిల్డర్లు తప్ప చిన్నాచితకా బిల్డర్లు, సొంతంగా ఇండ్లు నిర్మించుకునేవారు సహజంగానే సమీపంలోని ఇసుక లారీ అడ్డాల నుంచే ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. టీజీఎండీసీ ప్రతి టన్నుకు రూ.450 చొప్పున విక్రయిస్తుంటే, లారీ యజమానులు బుకింగ్ చేసుకొని స్టాక్‌యార్డుల నుంచి ఇంటికి చేర్చేందుకు ప్రస్తుతం టన్నుకు రూ.2,500చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కో లారీలో సుమారు 35 నుంచి 45 టన్నుల ఇసుకను తరలిస్తూ వినియోగదారుల నుంచి 35 టన్నులకు రూ.87,500, 45 టన్నులకు రూ.1,12,500 చొప్పున వసూలు చేస్తున్నారు. అంటే, ఒక్కో టన్ను ఇసుకపై లారీ యజమానులు రూ.2,000కుపైగా వినియోగదారులనుంచి వసూలు చేస్తున్నారు. ఇందులో రూ.1,000 రవాణా ఖర్చులు పోగా, మిగిలిన రూ.1,000లో లారీ యజమానుల లాభాలు, అధికారుల అమ్యామ్యాలు ఉంటున్నాయి. ప్రస్తుతం టీజీఎండీసీ ఆన్‌లైన్ ద్వారా బుకింగ్‌లు కావటం లేదు. కొన్ని ఎంపిక చేసిన మీసేవ కేంద్రాల్లో 'బాట్ సాఫ్ట్‌వేర్' ద్వారా బుకింగ్ చేసుకుంటేనే బుకింగ్ అవుతుందని లారీ యజమానులు చెప్తున్నారు. దీనికోసం ఒక్కో బుకింగ్‌కు రూ.5,000-6,000 అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. బుకింగ్‌లో సమస్యల వెనుక టీజీఎండీసీ అధికారుల పాత్ర ఉన్నదన్న ఆరోపణలున్నాయి. స్టాక్‌యార్డ్‌ల వద్ద ఇసుకను లారీలో లోడింగ్ చేయాల్సిన బాధ్యత టీజీఎండీసీ నియమించిన కాంట్రాక్టరుదే అయినా.. ఇసుక లారీల వద్ద లోడింగ్ పేరుతో అక్రమంగా రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారు.

లంచాలతో భారీగా పెరిగిన ఇసుక ధర

వర్షాకాలంలో ఇసుక తవ్వకంతోపాటు రవాణాలో కూడా ఇబ్బందులు ఉంటాయి కాబట్టి సహజంగానే ఇతర కాలాలతో పోల్చుకుంటే ఇసుక ధర టన్నుకు రూ.100 నుంచి రూ.200 ఎక్కువగా ఉంటుంది. బీఆర్‌ఎస్ హయాంలో వర్షాకాలంలో సైతం ఇసుక ధర రూ.1,500 దాటలేదు. కానీ ఇప్పుడు ఏకంగా రూ.2,500 చేరుకోవటం గమనార్హం. టీజీఎండీసీ వద్ద ధర యథావిధిగా టన్నుకు రూ.450 మాత్రమే ఉన్నప్పటికీ ఇసుక లారీలపై అధికారుల వేధింపులు, లంచాల వసూళ్లు ఎక్కువైపోవటంతో ఇసుక ధర టన్నుకు రూ.1,000 వరకు పెంచక తప్పటం లేదని లారీ యజమానులే చెప్తున్నారు. అలాగే, ఇసుక స్టాక్‌యార్డ్‌లకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయించాల్సిన టీజీఎండీసీ.. వాటిని పట్టించుకోవడంలేదు. దీనివల్ల లారీ యజమానులకు నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి.. ఆ భారాన్ని కూడా వినియోగదారులపైనే మోపుతున్నారు. ఇటీవల మావోయిస్టు వారోత్సవాల పేరుతో ఇసుక తరలింపును నిలిపివేశారు. దీంతో ఇసుకకు మరింత కొరత ఏర్పడింది. ఇలా రకరకాల కారణాలతో అధికారులే ఇసుకకు కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెరిగేందుకు దోహదపడుతున్నారు.

> **రాష్ట్రంలో ఇసుక రవాణా వివరాలు**
>
> - ఇసుక రీచ్‌లు 76 ఉండగా ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి 19
> - టీజీఎండీసీ ద్వారా వర్షాకాలంలో ప్రతి నెల సరఫరా - 20 లక్షల టన్నులు
> - ఇతర కాలాల్లో నెలకు - 30 నుంచి 40 లక్షల టన్నులు
> - టీజీఎండీసీ నిర్ధారించిన ఇసుక ధర టన్నుకు రూ.450
> - లారీ యజమానులు ప్రస్తుతం వసూలు చేస్తున్నది టన్నుకు రూ.2,500
> - బుకింగ్, లోడింగ్ పేరుతో అక్రమంగా ఒక్కో లారీ నుంచి అధికారులు వసూలు చేస్తున్న మొత్తం రూ.7,000
> - ఈ భారాన్ని నేరుగా వినియోగదారులపైనే వేస్తున్న లారీ యజమానులు

నిలిచిపోయిన రీచ్‌లతో మరింత కొరత

రాష్ట్రంలో 76 ఇసుక రీచ్‌లకుగాను ప్రస్తుతం 19 పనిచేస్తున్నాయి. ఎన్జీటీ కేసుల వల్ల కొన్ని నిలిచిపోగా, మరికొన్ని నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటం వల్ల ఇసుక తీయటం సాధ్యంకాక నిలిపివేశారు. మేడిగడ్డ బరాజ్ వద్ద ఇసుక తవ్వకాలకు టెండర్లు ఖరారైనప్పటికీ నదిలో వరద అధికంగా ఉండటంతో ఇసుక తవ్వకం ఇంకా ప్రారంభం కాలేదు. అధికారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరతకు తోడు రీచ్‌లు మూతపడటంతో డిమాండ్‌కు తగ్గంత ఇసుక సరఫరా కావటం లేదు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు తదితర ప్రాంతాల్లో స్థానిక రాజకీయ నాయకుల జోక్యంతో ఇసుక తవ్వకం, రవాణాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్తున్నారు.

ఇంటర్న్‌షిప్‌లో తెలంగాణ టాప్

- **జాతీయంగా రెండోస్థానంలో రాష్ట్రం**
- **96శాతం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్**
- **ఫ్రెషర్స్‌కు కంపెనీల ప్రోత్సాహకాలు**

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ఇంటర్న్‌షిప్.. చదువుకుంటూనే పరిశ్రమల పనితీరును తెలుసుకోవడం.. నైపుణ్యాలను ఆర్జించడం. పని ప్రాంతాల్లో ప్రత్యక్ష అనుభవాన్ని గడించడం. ఇలాంటి ఇంటర్న్‌షిప్‌లను అందిపుచ్చుకోవడంలో తెలంగాణ విద్యార్థులు అగ్రస్థానంలో ఉన్నారు. జాతీయంగా ఇంటర్న్‌షిప్స్ కల్పిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ 96శాతంతో టాప్ -2లో ఉంది. పక్కనే ఉన్న ఏపీ 98.33శాతంతో మొదటిస్థానంలో ఉంది. ఇదే విషయాన్ని ఇండియా స్కిల్ రిపోర్ట్ -2024 వెల్లడించింది. ఇటీవలీ కాలంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లోని ఫ్రెషర్స్‌కు త్వరగా ఉద్యోగావకాశాలు లభించడంలేదు. దీంతో గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించేందుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, పేస్‌బుక్ వంటి దిగ్గజ కంపెనీలు ఇంటర్న్‌షిప్‌లకు విలువనిస్తున్నాయి. వారికి మంచి స్టైపెండ్‌ను చెల్లిస్తున్నాయి. దీనికి కొనసాగింపుగా మంచి ప్లేస్‌మెంట్స్ కోసం విరివిగా ప్రోత్సహిస్తున్నాయి.

టాప్‌టెన్‌లో ఐదు దక్షిణాది రాష్ట్రాలే

జాతీయంగా ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తున్న టాప్ -10 రాష్ట్రాల్లో ఐదు దక్షిణాది రాష్ట్రాలే ఉండటం విశేషం. ఏపీ, తెలంగాణ 90శాతానికి పైగా, తమిళనాడు, కర్ణాటక, కేరళలు 88 నుంచి 84శాతం మధ్యలో ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ఐటీ పరిశ్రమ విస్తరించడం, మల్టీనేషనల్ కంపెనీలు దక్షిణాది రాష్ట్రాల్లోనే కొలువై ఉండటం కలిసొచ్చే అంశం. కంప్యూటర్ సైన్స్ నైపుణ్యం గల విద్యార్థులు అత్యధికంగా దక్షిణాదిలోనే ఉన్నారు. ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు సైతం ఉండటం కూడా అత్యధికంగా ఇంటర్న్‌షిప్‌లు ఉండటానికి ఓ కారణంగా చెప్పవచ్చు.

బీటెక్‌లో 5,039 సీట్లు ఖాళీ

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): బీటెక్ కోర్సుల్లో తుది విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత 5,039 సీట్లు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయి. ఎప్‌సెట్ తుది విడత సీట్లను సోమవారం కేటాయించారు. కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలో 93, యూనివర్సిటీల్లో 1,056, ప్రైవేట్ వర్సిటీల్లో 19, ప్రైవేట్ కాలేజీలో 3,871 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయి.

సెప్టెంబర్ 11 వరకు 'ఎన్‌ఎంఎంఎస్'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. వివరాలకు http :// bse. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

డీఎస్సీ 'కీ' విడుదలలో తాత్సారమేల..?

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్ల విడుదలలో తాత్సారమెందుకని..? డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. పరీక్షలు ముగిసి వారంరోజులు గడిచినా ఇంతవరకు ప్రాథమిక కీ విడుదల చేయకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి తార్కాణమని ఆరోపించారు.

'ఏకీకృత సర్వీస్ రూల్స్ వ్యతిరేకిస్తున్నాం'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): టీచర్ల ఏకీకృత సర్వీసు రూల్స్‌పై తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వీరాచారి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. గతంలో ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు అనుకూలంగా వచ్చిన జీవోలను కోర్టులు తిరస్కరించాయని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ టీచర్లను జిల్లా పరిషత్ పరిపాలనలోకి పంపించాలని డిమాండ్ చేశారు.



సచిన్,అంజలి పెండ్లిలో మలుపులు

మాస్టర్ అత్త అన్నాబెల్ పుస్తకంలో వెల్లడి

ముంబై: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అంజలి పెండ్లి అనేక మలుపులు తిరుగాయని అతని అత్త అన్నాబెల్ తాను రాసిన 'మై ప్యాసెజ్ టు ఇండియా' అనే పుస్తకంలో ప్రస్తావించింది. ఇందులో పలు ఆసక్తికర అం శాలను ఆమె వెల్లడించింది. '1950 ప్రాంతంలో మా కుటుంబం ఇంగ్లండ్ నుంచి భారత్‌కు వచ్చింది. కొన్నేండ్లకు అంజలితో సచిన్‌కు పరిచయం ఏర్పడింది. కొద్ది రోజుల వ్యవధిలోనే అతను అంజలిని ప్రేమిస్తున్నట్లు తెలిసింది. ఇదే విషయం మాట్లాడేందుకు సచిన్ మా ఇంటికి వచ్చాడు. అప్పుడు అతని వయస్సు 19 ఏండ్లు అనుకుంటా. అంజలి..పొడవాటి, అందమైన వ్యక్తిని పెండ్లి చేసుకుంటుదనుకున్నాం. కానీ వయసులో ఐదేండ్లు చిన్నవాడైన సచిన్‌తో వివాహానికి ఓకే అంటుందని అనుకోలేదు. అంజలి ఐదున్నర అడుగులు ఉంటుంది.. సచిన్ కూడా అంతే ఎత్తులో కనిపించాడు. ఇద్దరి ఎత్తులో పెద్ద తేడా లేదు. క్రికెటర్లు ప్లేబాయ్‌గా మారుతారనే ఆలోచన ఉండేది. కానీ సచిన్ విషయంలో అలా జరుగలేదు. వారి ప్రేమపై ఉన్న పవిత్రత అర్థం చేసుకున్నాం' అని రాసుకొచ్చింది.

యూటీటీకి శ్రీజ దూరం

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ)కి స్టార్ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ దూరమైంది. పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన శ్రీజ..తీవ్రమైన ఒత్తిడి కారణంగా యూటీటీలో ఆడటం లేదని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 22 నుంచి చెన్నై వేదికగా యూటీటీ లీగ్ మొదలుకాబోతున్నది.





లాస్ ఏంజెల్స్‌లో కలుద్దాం!


ఒలింపిక్స్‌కు ఘనంగా పారిస్ వీడ్కోలు • అలరించిన కళాకారుల విన్యాసాలు • ప్రత్యేక ఆకర్షణగా టామ్ క్రూజ్

విశ్వక్రీడల చరిత్రలో మునుపెన్నడూ చూడని విధంగా ప్రఖ్యాత సీన్ నది తీరం వెంబడి, ఆరుబయట ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టి ప్రపంచాన్ని అబ్బురపరిచిన 'పారిస్'.. ముగింపు వేడుకలనూ అదే స్థాయిలో నిర్వహించింది. గత నెల 25న అట్టహాసంగా మొదలైన ఒలింపిక్స్‌కు ఆదివారం (ఆగస్టు 11)తో తెరపడింది. స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మ్యూజిషియన్లు, కండ్లు మిరుమిట్లుగొలిపే లైటింగ్ షో, హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ విన్యాసాలు, కళాకారుల కళారూపాలు వెరసి 17 రోజుల పాటు సాగిన ఒలింపిక్స్‌కు ఫ్యాషన్ నగరి ఘనంగా వీడ్కోలు పలికింది. 2028 ఎడిషన్‌కు హాలీవుడ్ అడ్డా లాస్ ఏంజెల్స్ ముస్తాబవుతోంది.

పారిస్: నాలుగేండ్లకోసారి వచ్చే ప్రపంచ అతిపెద్ద క్రీడా పండుగ ముగిసింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా 17 రోజుల పాటు క్రీడాభిమానులను అలరించిన ఒలింపిక్స్‌కు ఆదివారంతో తెరపడింది. ఒలింపిక్ చరిత్రలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా సీన్ నదిలో ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించి 'ఔరా' అనిపించిన పారిస్.. ముగింపు వేడుకలనూ అదే స్థాయిలో మురిపించింది. ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు మొదలైన ఈ వేడుకలు అభిమానులను ఉర్రూతలూగించాయి. సుమారు 80వేల మంది హాజరైన ఈ ముగింపు కార్యక్రమంలో 270 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో అభిమానులను అలరించారు.

లియోన్ మర్చండ్‌తో మొదలై..

ఫ్రాన్స్ స్విమ్మింగ్ సంచలనం తాజా ఒలింపిక్స్‌లో ఏకంగా నాలుగు స్వర్ణాలు గెలిచిన లియోన్ మర్చండ్ వేదికపైకి ఒలింపిక్ జ్యోతిని తీసుకురావడంతో ఈ కార్యక్రమం మొదలైంది. అనంతరం ఐవోసీ అధ్యక్షుడు థామస్ బాచ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయల్ మాక్రన్ అభిమానులకు అభివాదం చేసి అథ్లెట్ల పరేడ్‌ను ప్రారంభించారు. భారత పతాకధారులుగా మను భాకర్, పీఆర్ శ్రీజేష్ వ్యవహరించారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన లైటింగ్ షో అభిమానులను కట్టిపడేసింది. ఫ్రెంచ్ బాండ్ ఫోనెక్స్, యూఎస్ గాయని హెచ్. ఈ.ఆర్ తమ పాటలతో జోష్‌ను పెంచారు.



టామ్ క్రూజ్ విన్యాసాలు

ముగింపు వేడుకల్లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. 'మిషన్ ఇంపాజిబుల్'లో అతడు చేసినట్టుగా స్టేడియం పైనుంచి వైర్ సాయంతో గాల్లో చేసిన విన్యాసాలకు ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అనంతరం పారిస్ మేయర్ అన్నె హిడల్గొ ఒలింపిక్ జెండాను థామస్ బాచ్‌కు ఇవ్వగా ఆయన లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బస్‌కు పాస్ అందజేయడంతో ఆ నగరంలో ఒలింపిక్ సందడి మొదలైంది.

బరువు బాధ్యత అథ్లెట్లు, కోచ్‌లదే

వినేశ్ ఫోగాట్ వివాదంపై ఐవోఏ చీఫ్ పీటీ ఉష వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువుతో అనర్హత వేటుకు గురైన స్టార్ వినేశ్ ఫోగాట్ వివాదం చిలికి చిలికి గాలివానలా మారుతూనే ఉన్నది. వినేశ్ బరువు విషయంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ దిన్షా పార్దివాలాను తప్పుపడుతున్న వేళ..జాతీయ ఒలింపిక్ అసోసియేషన్(ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష తీవ్ర స్థాయిలో స్పందించింది. బరువు బాధ్యత అనేది అథ్లెట్లు, కోచ్‌లు చూసుకోవాల్సిందని, ఇందులో డాక్టర్ల ప్రమేయం ఏమి లేదని స్పష్టం చేసింది. 'రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో లాంటి వెయిట్ మేనేజ్‌మెంట్ క్రీడల్లో బరువు నిర్దేశిత స్థాయిలో ఉన్నది చూసుకోవాల్సింది అథ్లెట్లు, కోచ్‌లు మాత్రమే. ఏదైనా గాయాలైతే వైద్యులు చికిత్స అందిస్తారు తప్ప.. బరువు విషయంలో వారికి ఎలాంటి పాత్ర ఉండదు' అని పేర్కొంది. 100 గ్రాముల అధిక బరువుతో వినేశ్ తాను పోటీలో ఉన్న 50కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్‌కు అర్హత కోల్పోయిన సంగతి తెలిసిందే.

ఈ కారణాల వల్లే..

వినేశ్ ఫోగాట్ అనర్హత వేటుకు గురి కావడంపై ఆమె లీగల్ టీమ్ పలు కారణాలను అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(సీఎస్‌ఏ) ముందుకు తీసుకువచ్చింది. 'అథ్లెటిక్స్ విలేజ్ నుంచి రెజ్లింగ్ పోటీలకు వేదికైన చాంప్ డీ మార్స్ ఎరీనాకు చాలా దూరం ఉంది. దీని వల్ల సరైన టైమ్‌లో బరువు తగ్గించుకోలేకపోయింది. దీనికి తోడు బౌట్‌ల మధ్య సరైన సమయం లేకపోవడంతో బరువు తగ్గించుకునేందుకు చాన్స్ లభించలేదు. అయినా శరీర బరువులో 100 గ్రాములు అంటే చాలా తక్కువ. ఉక్కపోత, వేసవి వాతావరణ నుంచి తట్టుకునేందుకు శరీరానికి నీరు అవసరమవుతుంది. ఒకే రోజు మూడు పోటీల్లో తలపడటం వల్ల మజిల్ మాస్ పెరుగుతుంది. బౌట్ ముగిసిన తర్వాత ఆహారం తీసుకోవాల్సి వస్తుంది' అని పేర్కొంది.

వినేశ్ కేసు తీర్పు నేడు

మంగళవారం ఫోగాట్ కేసులో సీఏఎస్ తీర్పు వెలువడే అవకాశాలు ఉన్నా యి. వినేశ్ తరపున ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపిస్తున్నారు.

'ప్రేమ నగరి' గుర్తుగా



'సిటీ ఆఫ్ లవ్'గా పిలుచుకునే పారిస్‌లో ఒలింపిక్స్ ఆడేందుకు వచ్చిన పలువురు క్రీడాకారులు ఆటలతో పాటు తమ జీవిత భాగస్వాములనూ కలుసుకున్నారు. 'ప్రేమ నగరి'లో 8 జంటలు తమ ప్రేమను వ్యక్తపరచడమూ ఒక రికార్డే. ఫ్రాన్స్ అథ్లెట్ అలీస్ ఫినౌట్, ఇటలీ జిమ్నాస్ట్ అలీస్సా, బ్రెజిల్ ట్రిపుల్ జంపర్ అల్మీర్, అమెరికా షాట్ పుటర్ పేటన్, అర్జెంటీనా హ్యాండ్‌బాల్ టీమ్ మెంబర్ పాబ్లో సిమెనెట్, యూఎస్‌ఏ రోయింగ్ గోల్డ్ మెడల్ విన్నర్ జస్టిన్ బెస్ట్, బ్యాడ్మింటన్ ప్లేయర్లు యా కియోంగ్, లియుచెన్.. పారిస్ వేదికగా వెడ్డింగ్ రింగ్‌లు ధరించాయి.

దులీప్ ట్రోఫీలో స్టార్ క్రికెటర్లు

బంగ్లాతో సిరీస్‌కు టీమ్‌ఇండియా సన్నాహకాలు

బెంగళూరు: దేశవాళీలో ప్రతిష్ఠాత్మక టోర్నీ అయిన దులీప్ ట్రోఫీలో టీమ్‌ఇండియాకు ఆడే అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లు పాలుపంచుకోనున్నారు. వచ్చే నెల 19 నుంచి స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెటర్లకు ఇది మంచి సన్నాహకంగా ఉపయోగపడుతుందని బోర్డు భావిస్తున్న తరుణంలో రోహిత్, కోహ్లీ, అశ్విన్, బుమ్రా, జడేజా, అక్షర్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్ వంటి స్టార్లు దులీప్ ట్రోఫీ ఆడనున్నట్టు సమాచారం. ఈ మేరకు భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతం గంభీర్ సైతం ఆటగాళ్లకు అల్టిమేటం జారీ చేసినట్టు బోర్డు వర్గాల ద్వారా తెలుస్తోంది. సెప్టెంబర్ 5 నుంచి 22 మధ్య జరుగబోయే దులీప్ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌లకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యమివ్వనుంది.

థోర్ప్‌ది ఆత్మహత్య!

సంచలన విషయాలు వెల్లడించిన భార్య



లండన్: ఇటీవలే మరణించిన ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహం థోర్ప్‌ది సహజ మరణం కాదని, బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆయన భార్య అమంద వెల్లడించింది.అమంద మాట్లాడుతూ..'గత కొన్నేండ్లుగా గ్రాహం తీవ్ర ఒత్తి డి, ఆందోళనతో బాధపడుతున్నాడు. గతంలో 2022 మేలో ఒకసారి ఆత్మహత్యకు యత్నించాడు. అప్పుడు చాలా రోజులు ఐసీయూలో ఉండి ప్రాణాలతో బయటపడ్డాడు. అయినా ఆ యన డిప్రెషన్ నుంచి బయటకు రాలేకపోయాడు. కుటుంబంగా మేం ఆయనకు ఎంతో అండగా నిలిచాం. మెరుగైన చికిత్సను అం దించాం. రెండేండ్ల నుంచి మానసిక కుంగుబాటులో కూరుకుపోయిన ఆయన ఆ బాధ నుంచి బయటపడలేక పోయారు' అని తెలిపింది.



హెచ్‌సీఏ వుమెన్స్ టీ10 లీగ్ షురూ

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) చరిత్రలో తొలిసారి మహిళా క్రికెటర్ల కోసం వుమెన్స్ టీ10 లీగ్‌ను ప్రారంభించినట్లు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన వుమెన్స్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ

గురుకులాల్లో మృత్యుఘోష


మొదటిపేజీ తరువాయి...

సూచించారు. రాష్ట్రంలోని గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనుభవం ఉన్న నాయకుడు, గతంలో గురుకులాల సెక్రటరీగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ వేసి ప్రభుత్వానికి నిష్పక్షపాతంగా సూచనలతో నివేదిక సమర్పిస్తామని చెప్పారు. నాలుగైదు రోజుల్లో కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 20 సంక్షేమ గురుకులాలను పరిశీలిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చనిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులంలో పాముకాటుతో చనిపోయిన ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన అనిరుధ్ కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించారు. కొడుకు మరణంతో విషాదంలో మునిగిన తల్లిదండ్రులు ప్రియాంక, కృష్ణారెడ్డిని కేటీఆర్ ఓదార్చి వివరాలు తెలుసుకున్నారు. రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ ఎనిమిదినెలల్లో గురుకులాల్లో కలుషిత ఆహారం తిని 500 మంది వరకు దవాఖానల్లో చేరినట్టు తెలిపారు.



బొప్పాపూర్‌లో విద్యార్థి అనిరుధ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

భువనగిరి, సూర్యాపేటలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. వానకాలం అయినందున గురుకులాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాములు, తేళ్లు రాకుండా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పెట్టే భోజనంపై కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. గురుకులాలను దత్తత తీసుకుంటే ఇలాంటి సమస్యలు తలెత్తవని ప్రభుత్వానికి సూచన చేశారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల రాజకీయాలు అసలే వద్దని, మనపిల్లలుగా చూసుకుంటూ వారి ప్రాణాలపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పిల్లలు బాగుండాలి, ప్రపంచంతో పోటీ పడాలన్న ఉద్దేశంతో కేసీఆర్ తెలంగాణ వ్యాప్తంగా వెయ్యి గురుకులాలు ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. గురుకులాలను ఇంటర్, డిగ్రీ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశామని చెప్పారు. పిల్లలకు ఆహార విషయంలో భరోసా ఇచ్చామని, తాము సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల శాఖ అధ్యక్షుడు వలస కృష్ణహరి, మార్కెట్ మాజీ అధ్యక్షుడు అందె సుభాష్, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీమేశ్ పాల్గొన్నారు.



రిటైర్డ్ జడ్జి శ్రీహరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్(ఇన్‌సెట్‌లో బండ శ్రీహరి)

మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్‌కు పితృవియోగం

మాజీ మంత్రి కేటీఆర్ తదితరుల పరామర్శ

చిక్కడపల్లి, ఆగస్టు 12: మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ తండ్రి, రిటైర్డ్ జడ్జి బండ శ్రీహరి (92) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ బాగ్‌లింగంపల్లిలో శ్రీహరి భౌతికదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎంఎన్ శ్రీనివాస్‌రావు, యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, నాయకులు దామోదర్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆర్ వివేక్, శ్రీధర్‌రెడ్డి, కల్యాణ్ నాయక్, ముదిగొండ మురళి, గోపీ, రాజు, టీవీ రాజు తదితరులు పాల్గొన్నారు. అంబర్‌పేట్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

విద్యార్థుల మరణాలు సర్కారు హత్యలే

పిల్లల కుటుంబాలకు న్యాయం చేయాలి.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్



జగిత్యాల, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలు, విద్యా సంస్థలు, వసతిగృహాల్లో చోటుచేసుకుంటున్న విద్యార్థుల మరణాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జగిత్యాలలో సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు అస్తవ్యస్తంగా మారాయని, కేసీఆర్ పాలనలో ఆదర్శంగా నిలిచిన గురుకులాలు, కాంగ్రెస్ వచ్చిన ఏడు నెలల్లోనే మృత్యుకేంద్రాలుగా తయారయ్యాయని ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల్లో 36 మంది విద్యార్థులు చనిపోవడం, దాదాపు 500 మంది అనారోగ్యం బారిన పడడం చూస్తే పరిస్థితి ఎంత భయంకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థుల మరణాలపై ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం, విద్యాకేంద్రాలను కనీసం ఒక్క ప్రజాప్రతినిధి, మంత్రి సందర్శించకపోవడం బాధాకరమని, విద్యార్థుల మరణాలకు రేవంత్ రెడ్డి సర్కారే కారణమని దుయ్యబట్టారు. నాసిరకం భోజనం పెట్టడంతో పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని, హాస్టళ్లలో పాములు, ఎలుకలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యావ్యవస్థను కాంగ్రెస్ సర్కారు ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించి, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని, విద్యా వ్యవస్థను సంస్కరించాలని డిమాండ్ చేశారు.

సర్కారు బడిలో ఫుడ్ పాయిజన్

- 24 మంది విద్యార్థులకు అస్వస్థత
- 108 వాహనంలో ఖేడ్ దవాఖానకు తరలింపు
- కల్హేర్‌లోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో ఘటన
- ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్‌పై సస్పెన్షన్ వేటు

కల్హేర్, ఆగస్టు 12: కలుషిత ఆహారం తిని 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన సోమవారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. బీబీపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 114 మంది విద్యార్థులకు 92 మంది విద్యార్థులు సోమవారం మధ్యాహ్న భోజనం చేశారు. తిన్న తర్వాత 2, 3 గంటల ప్రాంతంలో విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. వండిన కూర వాసన వచ్చిందని కొందరు విద్యార్థులు తెలిపారు. దీంతో ఆందోళన చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థులను నారాయణఖేడ్ సర్కార్ దవాఖానకు తరలించారు. దవాఖానలో విద్యార్థులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎంఈవో శంకర్ తెలిపారు. బీబీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ నర్సింగ్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించకుండానే విద్యార్థులకు వడ్డించారు. భోజనంలో వడ్డించిన గుడ్లు తినడంతో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, అందుకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.



నారాయణఖేడ్‌లోని సర్కార్ దవాఖానలో చికిత్స అందిస్తున్న వైద్యులు

కేటీఆర్‌పై 'డ్రోన్' కేసు నిలిపివేత

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ
- దర్యాప్తు ఆపాలని పోలీసులకు ఆదేశం
- అభియోగాలు, సెక్షన్లకు పొంతనేదని ప్రశ్న
- ప్రతివాది, ఫిర్యాదుదారుకు నోటీసులు
- తర్వాతి విచారణ సెప్టెంబర్ 5కు వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 12, (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించిన సందర్భంగా అనుమతుల్లేకుండా డ్రోన్ వినియోగించారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తును హైకోర్టు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్కసుమన్‌పై మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసు ప్రాథమిక ఆధారాలను పరిశీలిస్తే.. పోలీసులు మోపిన అభియోగాలకు నమోదు చేసిన సెక్షన్లకు పొంతనలేదని అభిప్రాయపడింది. అందువల్ల ఈ కేసులో తదుపరి చర్యలన్నింటిపై స్టే విధిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. అరెస్టు సహా ఇతర చర్యలేవీ తీసుకోరాదని స్పష్టంచేసింది. ఆరోపణలకు అనుగుణంగా అభియోగాలు లేవని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉన్నదని చెప్పింది. ప్రతివాదిగా ఉన్న ఫిర్యాదుదారు మేడిగడ్డ బరాజ్ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వలి షేక్ తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను జస్టిస్ కే లక్ష్మణ్ సెప్టెంబర్ 5కు వాయిదా వేశారు.

బీఆర్ఎస్ నేతలను కేసుల్లో ఇరికించే యత్నం

కేటీఆర్ జూలై 26న గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్కసుమన్, ఇతర పార్టీ నేతలతో మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించారు. అనుమతిలేకుండా డ్రోన్ ద్వారా బరాజ్ స్థితిగతులను చిత్రీకరించారని ఆరోపిస్తూ జూలై 29న మహదేవపూర్ పోలీసులకు సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వలి షేక్ ఫిర్యాదు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ, మేడిగడ్డ రిజర్వాయర్‌లో నీటిని నిల్వచేసి ఎత్తిపోతలు చేయక యాసంగి సాగుకు తీవ్ర సమస్యగా మారిందని తెలిపారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను ప్రజలకు వివరించాలనే పిటిషనర్లు మేడిగడ్డ సందర్శించారని వివరించారు. డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం వల్ల మేడిగడ్డకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ పోలీసులు ఆరోపణలు దారుణంగా ఉన్నాయని చెప్పారు.



8 నెలల్లోనే ఎందుకీ వ్యవసాయ విధ్వంసం?

- తగ్గిన సాగు రైతుకు ప్రమాద సంకేతం
- కాంగ్రెస్ పాలనలో రైతుకు భరోసా లేదు
- అస్తవ్యస్థ విధానాలతోనే దయనీయ స్థితి
- సాగు విస్తీర్ణం తగ్గడంపై కేటీఆర్ ఆందోళన

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈ ఏడాది 15.30 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలోనే వ్యవసాయానికి ఎందుకింత గడ్డుకాలమని 'ఎక్స్'లో ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలన సాగుకు స్వర్ణయుగమైతే, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సాగు విస్తీర్ణం ఒక్కసారిగా ఎందుకు పడిపోయిందని నిలదీశారు. ఒక్క ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గటం ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతమని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలో దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో 8 నెలల్లోనే ఎందుకింత వ్యవసాయ సంక్షోభం ఏర్పడిందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. సీఎం మాటలు కోటలు దాటుతున్నా చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకొనే విజన్ లేదు. రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు. చెరువులకు నీళ్లు మళ్లించే తెలివి లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. కాంగ్రెస్ పాలనలో రైతు బతుకుకు భరోసానే లేదు' అని పేర్కొన్నారు. నిన్న వ్యవసాయానికి కరెంట్ కట్ చేశారు. నేడు రుణమాఫీలో రైతుల సంఖ్య కట్ చేశారు. సాగయ్యే భూమి విస్తీర్ణాన్ని కూడా కట్ చేసే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్యపెట్టి.. పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ ఏర్పడిందని ఆరోపించారు.


కార్మికుల పీఎఫ్.. కాంట్రాక్టర్ జేబుల్లోకి?

- సింగరేణిలో పీఎఫ్ కుంభకోణం
- కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్ ఎగవేత
- ప్రసాద్ సుశీ హైటెక్ మాయాజాలం
- 15 కోట్ల మేర కార్మికుల పీఎఫ్ మాయం
- కొత్తగూడెం జీవీఆర్‌లోనూ ఇదే తంతు
- పరోక్షంగా సహకరిస్తున్న అధికారులు
- 17 ఓసీపీల్లో విచారిస్తే వందల కోట్ల అక్రమాలు బయటపడే చాన్స్

మంచిర్యాల, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సింగరేణి సంస్థలో జరిగిన పీఎఫ్ కుంభకోణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంస్థ ఇచ్చిన కాంట్రాక్ట్(వర్క్ ఆర్డర్)ను పట్టించుకోకుండా ప్రసాద్ సుశీ హైటెక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్‌ను కొట్టేసింది. నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ కార్మికుడికి కూడా సీఎంపీఎఫ్ (కోల్‌మైన్స్ ప్రావిడెంట్‌ఫండ్) చెల్లించాలి. కార్మికుడి వేతనంలోని 19 శాతాన్ని కంపెనీ జమస్తే, మరో 19 శాతాన్ని కార్మికుడి వేతనం నుంచి కట్ చేసి ఈపీఎఫ్‌గా చెల్లించాలి. సుశీ కంపెనీ మాత్రం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓసీపీ (ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు)లో తమ వద్ద పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల్లో గరిష్ఠంగా 40 శాతం మందికి మాత్రమే పీఎఫ్ చెల్లించి మిగతా వారికి రూపాయి కూడా చెల్లించలేదు. ఈ రకంగా 11కోట్లపైనే కంపెనీ నొక్కేసినట్టు ప్రాథమికంగా తేలింది. ఇదే కంపెనీ ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీపీలోనూ కాంట్రాక్ట్ సంస్థగా ఉంది. శ్రీరాంపూర్ తరహాలోనే పీఎఫ్ అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

ఏడేండ్లుగా పీఎఫ్ చెల్లింపులు నిల్

సింగరేణి సంస్థ 2016 జూన్‌లో శ్రీరాంపూర్ ఓసీపీలో మట్టి తవ్వకాల పనులకు ప్రసాద్ సుశీ హైటెక్ కంపెనీకి 72 నెలల కాలానికి వర్క్ ఆర్డర్ ఇచ్చింది. ఆ తర్వాత మరో ఏడాది పొడిగించింది. మొత్తంగా 84 నెలలు శ్రీరాంపూర్ ఓసీపీలో మట్టి తవ్వకాలు జరిపింది. ఇందుకోసం దాదాపు 1000 మంది కార్మికులను తీసుకుంది. అయితే, డిసెంబర్ 2021లో డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్)కు ఇచ్చిన వార్షిక నివేదికలో 924 మంది కార్మికులు తమ సంస్థలో పనిచేస్తున్నట్టు పేర్కొన్నది. ఆ ఏడాది మొత్తంలో ఒక నెలలో 490 మందికి మాత్రమే పీఎఫ్ జమచేసింది. కొన్ని నెలల్లో మాత్రం ఒకరిద్దరికి జమచేసింది.



OFFICE OF THE REGIONAL COMMISSIONER
COAL MINES PROVIDENT FUND ORGANISATION, GODAVARIKHANI
Fax: 08728-235555, Phone: 08728-235522, E-mail: godavarikhani@cmpfo.gov...

To,
The Director(P&AW)
S.C.C.L Corporate Office,
Dist: Bhadradri-Kothagudem-507 101

Sub:- Coverage of Contract workers under CMPF Scheme

Sir,

[illegible]

Yours faithfully
(A. K. AGARWAL)
ADDITIONAL COMMISSIONER

కార్మికులందరికీ పీఎఫ్ చెల్లించాల్సిందేనంటూ సింగరేణి డైరెక్టర్ రాసిన లేఖ

గతంలోనే వెలుగులోకి..

శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై సామాజిక కార్యకర్త నహీం పాషా ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. కంపెనీలో 900 మంది పని చేస్తుంటే తక్కువ మందికి పీఎఫ్ కడుతున్నారంటూ లెక్కలతో బయటపెట్టారు. పీఎంవో నుంచి ఆ ఫిర్యాదు ఫిర్యాదు పశ్చిమబెంగాల్ ధన్‌బాగ్‌లోని సీఎంపీఎఫ్ ప్రధాన కార్యాలయానికి ఫార్వర్డ్ చేశారు. అక్కడి నుంచి గోదావరిఖని రీజినల్ ఆఫీస్‌కు పంపించారు. ఇక్కడున్న సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌తో గోదావరిఖని రీజియన్ పరిధిలోకి వచ్చే (మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, ఆర్జీ-1, ఆర్జీ-2, ఆర్జీ-3, భూపాలపల్లి) అన్ని ఓసీపీల్లో వెరిఫికేషన్ చేయించారు. ఈ క్రమంలో సుశీ కంపెనీ శ్రీరాంపూర్ ఓసీపీలో కార్మికులకు చేస్తున్న మోసాన్ని గుర్తించారు. డీజీఎంఎస్‌కు ఇచ్చిన వార్షిక నివేదికలో 924 మంది పని చేస్తున్నారని చెప్పిన సుశీ కంపెనీ విచారణకు వచ్చిన అధికారిని తప్పుదోవ పట్టించినట్టు తెలిసింది. అయినా ఎంక్వైరీలో శ్రీరాంపూర్ ఓసీపీలో 715 మంది పని చేస్తుంటే, 280 మందికే పీఎఫ్ జమచేస్తున్నారని, మిగిలిన వారికి పీఎఫ్ ఇవ్వడం లేదని తేలింది. నిబంధనల ప్రకారం అందరికీ పీఎఫ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ పాకు సీఎంపీఎఫ్ కమిషనర్ లెటర్ రాశారు. 2021 జనవరిలో ఈ లెటర్ రాస్తే సింగరేణి సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఇదీ లెక్క..

సింగరేణిలో 2016 లో సుశీ కంపెనీ కాంట్రాక్ట్ తీసుకునే నాటికి ప్రతి ఒక్క కార్మికుడికి జీతం రూ.15 వేలుగా ఉంది. నిబంధనల ప్రకారం ఒక్కో కార్మికుడికి నెలకు రూ. 2,850 సీఎంపీఎఫ్ జమకావాలి. కంపెనీ మాత్రం తమ వద్ద పనిచేస్తున్న 924 మందిలో 400 మందికి మాత్రమే పీఎఫ్ చెల్లించి మిగతా వారికి అసలు చెల్లించనే లేదని తేలింది. చెల్లించని మొత్తం నెలకు రూ. 14,25,000 అవుతుంది. ఈ లెక్కన 80 నెలల కాలానికి అది రూ. 11.4 కోట్లు అవుతుంది. ఇదే కంపెనీ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఆధ్వర్యంలో ఉన్న జీవీఆర్ ఓసీపీలో 2018 నుంచి 770 మంది పనిచేస్తున్నారు. కంపెనీ మాత్రం 440 మందికే పీఎఫ్ చెల్లిస్తున్నట్టు తెలిసింది. ఇక్కడ కూడా దాదాపు రూ. 5 కోట్ల మేర పీఎఫ్ ఎగ్గొట్టినట్టు తేలింది. ఈ మొత్తం సుశీ కంపెనీ ఖాతాల్లోకి వెళ్లినట్టు సమాచారం.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్ జమ చేయడంలో జరుగుతున్న అన్యాయంపై నాలుగేండ్లుగా పోరాడుతున్నా. సీఎంపీఎఫ్, ఈపీఎఫ్ కమిషనర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సింగరేణి సంస్థ ఇచ్చిన వర్క్ ఆర్డర్ నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్ సుశీ హైటెక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్మికులకు న్యాయంగా రావాల్సిన ఈపీఎఫ్ డబ్బులు మిగుల్చుకోవడం హేయమైన చర్య. సదరు కంపెనీపై నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి కార్మికుల సొమ్ము మొత్తాన్ని రికవరీ చేయాలి. ఇందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన సింగరేణి అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- నహీం పాషా, సామాజిక కార్యకర్త


కంపెనీ కోట్ చేసిన దానికంటే తక్కువకే టెండర్లు

ఓసీపీలకు సంబంధించి ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్ట్ అప్పగించేప్పుడు కార్మికుల జీతాలు, సంక్షేమ చర్యలు, సీఎంపీఎఫ్, బోనస్, వాడే మిషనరీ, వాహనాలు ఇలా అన్నింటినీ పరిగణలోకి తీసుకుని సింగరేణి ఒక ఫార్ములా కోట్ చేస్తుంది. దానినే ప్రైజ్ వ్యాల్యుయేషన్ ఫార్ములా అంటారు. ఆ ఫార్ములా ప్రకారం ఒక ఎస్టిమేషన్ సిద్ధం చేసి సింగరేణి కంపెనీ బిడ్డింగ్‌లను ఆహ్వానిస్తున్నది. అయితే, కంపెనీ బిడ్డింగ్ పిలిచిన మొత్తానికంటే తక్కువ మొత్తానికి కోట్ చేసిన సంస్థలు కాంట్రాక్ట్ దక్కించుకోవడం గమనార్హం. ఉదాహరణకు.. ఓసీపీలో ఒక క్యూబిక్ మీటర్ మట్టి తవ్వడానికి రూ.100 ఖర్చు అవుతుందని కంపెనీ నిర్ణయిస్తే, కాంట్రాక్టర్లు మాత్రం రూ.50, రూ.40లకే చేస్తామని లెస్‌కి టెండర్లు వేసి దక్కించుకుంటారు. తక్కువకే కోట్ చేసిన వారికి సింగరేణి కాంట్రాక్ట్ బాధ్యతలు అప్పగిస్తుంది. పనులు మొదలయ్యాక కాంట్రాక్ట్ కంపెనీలు మెలిక పెడతాయి. నష్టం వస్తున్నదని చెప్పి కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్‌ను ఎగ్గొట్టి ఆ మొత్తాన్ని మిగుల్చుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సింగరేణి సంస్థకున్న 17 ఓసీపీల్లోనూ ఇదే జరుగుతున్నట్టు తెలిసింది. ఒక్క శ్రీరాంపూర్ ఓసీపీ, సత్తుపల్లి ఓసీపీలో ఒకే ఒక్క కంపెనీ చేసిన మోసమే రూ.15 కోట్లు ఉంటే.. 20 ఏళ్లకు పైగా సింగరేణిలో ఓసీపీలు నడుస్తున్నాయి. అప్పటి నుంచి లెక్కలు వేస్తే వేల కోట్ల రూపాయల మేర అక్రమాలు జరిగి ఉంటాయని అనుమానిస్తున్నారు.

సమాచారం అడిగితే దాటవేత యత్నం

సుశీ కంపెనీకి సంబంధించిన సమాచారం కోసం అధికారులను సంప్రదిస్తే దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. వారి అధికార ప్రతినిధిని అడగాలని సలహా ఇస్తున్నారు. వారి సూచన మేరకు శ్రీరాంపూర్ ఏరియా ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిగితే పాత సమాచారంతో మీరేం చేస్తారని ప్రశ్నిస్తున్నారు. తాము సమాచారం ఇవ్వలేమని, కావాలంటే ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇదే విషయంపై శ్రీరాంపూర్ ఏరియా జీఎంను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

లోకం పోకడ



సీఎం రహిత రాష్ట్రంలో మనం!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.3°c	24.1°c
రంగారెడ్డి	35.2°c	22.3°c
మెదక్	34.2°c	23.0°c
ఖమ్మం	33.0°c	25.0°c
నిజామాబాద్	32.8°c	24.4°c
కరీంనగర్	32.0°c	26.0°c
మహబూబ్‌నగర్	32.0°c	23.2°c
వరంగల్	32.0°c	26.0°c
హైదరాబాద్	32.0°c	26.0°c
నల్లగొండ	30.0°c	24.0°c

ప్రాణాపాయస్థితిలో దళిత విద్యార్థిని

- గురుకుల బిల్డింగ్‌పై నుంచి జారిపడ్డ కార్తీక
- పక్కటెముకలు విరిగిపోయి పరిస్థితి విషమం
- నిమ్స్‌లో చేర్పించి వదిలేసిన యాజమాన్యం
- బిడ్డను కాపాడుకొనేందుకు తల్లి ఆరాటం
- ప్రభుత్వ సాయం ఎదురుచూపులు

ములుగు, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ప్రమాదవశాత్తు గురుకులంలోని మూడో అంతస్థు నుంచి జారిపడిన దళిత విద్యార్థిని నిమ్స్‌లో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జంగాలపల్లికి చెందిన కొయ్యడ కార్తీకశ్రీ 9వ తరగతి చదువుతున్నది. ఈ నెల 9న గురుకులం భవనం మీదినుంచి ప్రమాదవశాత్తు పడిపోవటంతో పక్కటెములతో పాటు నడుము విరిగింది. విద్యార్థిని పడిపోవటాన్ని చూసి స్థానికులు చెప్పాకే గురుకుల యాజమాన్యం పొదల్లో పడిపోయిన కార్తీకను మొదట ములుగు దవాఖానకు, తర్వాత వరంగల్ ఎంజీఎంకు, అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేటు దవాఖానకు సిబ్బంది తరలించారు. వైద్యానికి భారీగా ఖర్చవుతుందనటంతో మెరుగైన చికిత్సను సాకుగా చూపి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి వదిలేశారు. భర్త కొయ్యడ రాజు మృతితో ఒక్కగానొక్క బిడ్డను అల్లారుముద్దుగా పెంచుకుంటున్న సుమలతకు ఇప్పుడు ఏమి చేయాలో పాలుపోవటం లేదు. కూలిపనులు చేసుకొనే ఆమె చేతిలో చిల్లిగవ్వ లేక భోరున విలపిస్తున్నది. ప్రభుత్వం ఆదుకుంటేనే తన బిడ్డ ప్రాణాలు దక్కుతాయని, మంత్రి సీతక్క సాయం చేయాలని కోరుతున్నది. ప్రస్తుతం నిమ్స్ వైద్యులు విద్యార్థినికి ఆపరేషన్ చేయాలని సూచించగా బిల్లు ఎవరు చెల్లించాలనేది తేలలేదు. గురుకులంలో ఘటన జరిగినా, తమకేమీ సంబంధం లేదన్నట్టుగా సుమలతతో గురుకుల యాజమాన్యం లేఖ రాయించుకున్నట్టు ప్రచారమవుతున్నది. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థిని తల్లి నుంచి ఎలాంటి లేఖ రాయించుకోలేదని స్పష్టంచేశారు.

గురుకుల విద్యార్థినిపై లైంగిక వేధింపులు

- పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- నిర్లక్ష్యంగా ప్రిన్సిపాల్ సమాధానం.. కేసు నమోదు

పాలకుర్తి రూరల్, ఆగస్టు 12: జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెలలో విద్యార్థినికి సెలవులు రావడంతో ఇంటికి వెళ్లింది. సెలవులు అయిపోయినా పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నది. పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు చెప్పినా వెళ్లనని మొండికేసింది. ఎందుకు వెళ్లవని తల్లిదండ్రులు నిలదీయడంతో బాలిక అసలు విషయం చెప్పింది. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న వంట సిబ్బంది తనతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని.. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకుని విద్యార్థిని కన్నీటి పర్యంతమైంది. సోమవారం ఆ విద్యార్థినిని తీసుకుని తల్లిదండ్రులు పాలకుర్తిలోని గురుకుల పాఠశాలకు వచ్చి తన కుమార్తెకు జరిగిన అన్యాయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్‌కు వివరించారు. అందుకు ప్రిన్సిపాల్ సమాధానం చెప్పకపోవడంతోపాటు విద్యార్థిని, తమపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తల్లిదండ్రులు వాపోయారు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. గత శనివారం కూడా వంట సిబ్బంది తాగి వస్తున్నాడని, అన్నం మెత్తగా వండి పెడుతున్నాడని వంట నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా ఆమె పట్టించుకోకపోవడం గమనార్హం.